


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 294

శనివారం 14-1-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



భోగి వచ్చిందోచ్..

భోగి పండుగపై ప్రత్యేక కథనం..


-11లో



భారత్ శుభారంభం

ప్రపంచకప్ హాకీ టోర్నీ తొలి మ్యాచ్‌లో స్పెయిన్‌పై 2-0తో గెలుపు

-13లో



31 నుంచి బడ్జెట్ సమావేశాలు

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జనవరి 31న ప్రారంభమై ఏప్రిల్ 6 వరకు కొనసాగుతాయని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు.

వివరాలు 6లో ▸



టెన్నిస్‌కు సానియా గుడ్‌బై

భారత వెటరన్ టెన్నిస్ స్టార్ సానియా మీర్జా ఫిబ్రవరిలో జరిగే దుబాయ్ ఓపెన్ తర్వాత రిటైర్ అవుతున్నట్లు ప్రకటించింది.

వివరాలు 13లో ▸

సీఎంఆర్‌పై సీబీ'ఐ'



ధాన్యం కొనుగోళ్లు, కస్టమ్ మిల్లింగ్ రైస్ అప్పగింతల్లో అక్రమాలపై నజర్

- ఇప్పటికే ఢిల్లీ, హరియాణా, పంజాబ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో దాడులు
- 37 మంది ఎఫ్‌సీఐ అధికారులుసహా 74 మంది అరెస్ట్.. త్వరలోనే రాష్ట్రంలో దర్యాప్తుకు సిద్ధం!
- రాష్ట్రంలో ఉత్పత్తి సామర్థ్యానికి మించి ధాన్యం కొనుగోళ్లపై దృష్టి.. నెలలు గడుస్తున్నా సీఎంఆర్ ఇవ్వని మిల్లర్లు..లెక్కల్లో తేడాలు
- సీఎంఆర్ గడువులు ఇష్టారాజ్యంగా పొడిగింపు
- ఎఫ్‌సీఐ, నేతలు, పౌరసరఫరాల శాఖ అధికారులు, మిల్లర్ల కుమ్మక్కు దందా
- వీటన్నిటిపై కేంద్ర దర్యాప్తు సంస్థ వద్ద సమాచారం!

సాక్షి, హైదరాబాద్/న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు, కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) అప్పగింతల్లో జరిగిన అక్రమాలపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) దృష్టి పెట్టింది. భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) అధికారుల సహకారంతో చాలా రాష్ట్రాల్లో రైస్ మిల్లర్లు, వ్యాపారులు, రాష్ట్ర అధికారులు కలిసి వ్యవస్థీకృత సిండికేట్ నడుపుతున్నారనే ఆరోపణల నేపథ్యంలో ఆయా రాష్ట్రాల్లో సీబీఐ విచారణ చేపట్టి తనిఖీలు నిర్వహిస్తోంది. ధాన్యం కొనుగోళ్లలో పెద్ద ఎత్తున

మిగతా 3వ పేజీలో ▶

గ్రూప్–1 ప్రిలిమ్స్ ఫలితాలు విడుదల

- మెరిట్, రిజర్వేషన్ల ఆధారంగా మెయిన్స్‌కు 25,050 మంది ఎంపిక
- టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్లో జాబితా అందుబాటులోకి..
- జూన్‌లో మెయిన్స్ పరీక్షలు.. ఈనెల 18న పరీక్ష ప్యాటర్న్ విడుదల
- అభ్యంతరాలు, విజ్ఞప్తుల కోసం టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో హెల్ప్ డెస్క్
- హైకోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా మహిళా రిజర్వేషన్లు కల్పించినట్టు వెల్లడి

2లో

ఐటీ డిమాండ్లను తీర్చే సత్తా తెలంగాణకే: కేటీఆర్ -3లో▶

న్యూస్‌రీల్

టీడీపీతో పొత్తా..?. అలాంటి ఆలోచనే లేదు



తెలంగాణలో బీఆర్‌ఎస్‌ను ఒంటరిగా ఓడించే బలం ఉన్న బీజేపీపై కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ తరుణ్ ఛుగ్ మండిపడ్డారు. తెలంగాణలో టీడీపీతో పొత్తు పెట్టుకునే యోచనలో బీజేపీ ఉన్నట్టు వచ్చిన కొన్ని మీడియా కథనాలను ఆయన ఖండించారు.

- వివరాలు 2లో▶

తలవంచలేదు.. కాళ్లు మొక్కలేదు



''కడియం శ్రీహరి ఎప్పుడైనా ఎవరికైనా తలవంచలేదు. పాదాభివందనం చేయలేదు. నిటారుగా ఉంటా.. వంగే సమస్యే లేదు. తప్పు చేయలేదు. రాజకీయాలు చేసినన్ని రోజులు చేస్తాం..'' అని మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి వ్యాఖ్యానించారు.

- వివరాలు 2లో▶

క్లుప్తంగా...

ప్రతి ఇంటా ఆనందాల సిరులు వెల్లివిరియాలి

ప్రజలకు ఏపీ సీఎం జగన్ సంక్రాంతి శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. 'సంక్రాంతి పల్లెల పండుగ..మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే అచ్చ తెలుగు పండుగ' అని అన్నారు. భోగి.. సంక్రాంతి.. కనుమ పండుగలను ప్రతి గ్రామంలో ప్రతి కుటుంబం సంతోషంగా జరుపుకోవాలని అభిలషించారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి జీవితాల్లో ఈ మకర సంక్రాంతి మరింత ప్రగతితో కూడిన మార్పు తీసుకురావాలని, పండుగ సంబరాలతో తెలుగు లోగిళ్లలో, ప్రతి ఇంటా ఆనందాల సిరులు వెల్లి విరియాలని ఆకాంక్షించారు.

ఎమ్మెల్సీ కవితతో ఏపీ బీఆర్‌ఎస్ నేతల భేటీ

సాక్షి, హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) ఆంధ్రప్రదేశ్ శాఖ నేతలు శుక్రవారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో భేటీ అయ్యారు. ఏపీ శాఖ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్, నేతలు రావెల కిశోర్‌బాబు, పార్థసారథి సీనియర్ నేత దాసోజు శ్రవణ్ వెంట బంజారాహిల్స్‌లోని కవిత నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు.

ఉమ్మడి ఖమ్మంలో అన్ని సీట్లూ మావే

కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి



సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఖమ్మం జిల్లా.. కాంగ్రెస్ జిల్లా అని, రాబోయే ఎన్నికల్లో 10 అసెంబ్లీ, 2 పార్లమెంటు స్థానాల్లో తమ పార్టీ విజయం సాధించడం ఖాయమని కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి ధీమా వ్యక్తం చేశారు. 'ఖమ్మంలో నో వేకెన్సీ, ఆల్‌రెడీ రిజర్వ్‌డ్ ఫర్ కాంగ్రెస్'అని ఆమె వ్యాఖ్యానించారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆమె టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోటూరి మానవతారాయ్‌తో కలసి విలేకరులతో మాట్లాడుతూ, ఈశాన్యం మూల కలసివస్తుందని ఎవరో చెప్పి ఉంటారని, అందుకే ఈనెల 18న ఖమ్మంలో కేసీఆర్ సభ పెట్టారని ఎద్దేవా చేశారు. 'ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రి చేస్తున్న దోపిడీ, దొంగతనాలు తెలియట్లేదా? మీకెంత వాటా వస్తోంది.. చెప్పాలి?'అని ఆమె నిలదీశారు. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డితో సహా తాము ఎవరినీ కాంగ్రెస్ పార్టీలోకి పిలవబోమని వ్యాఖ్యానించారు.

సంజయ్ అసెంబ్లీ గేటు కూడా తాకలేరు

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: వచ్చే ఎన్నికల తర్వాత బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అసెంబ్లీ గేటు కూడా తాకలేరని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తిట్టకపోతే సంజయ్‌కి మనుగడ లేదని ఎద్దేవా చేశారు. బీజేపీ నాయకులు గ్రామాల్లోకి వస్తే, జరిగిన అభివృద్ధి ఏంటో చూపిస్తామని స్పష్టం చేశారు. శుక్రవారం ఇక్కడి బీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్‌పై విమర్శలు చేసినంత మాత్రాన పోటుగాడు కాలేరంటూ సంజయ్‌పై ధ్వజమెత్తారు. కొల్లాపూర్‌లో సంజయ్ అబద్ధాలు మాట్లాడారని, అక్కడి అభివృద్ధి అంతా కేసీఆర్ నాయకత్వంలోనే జరిగిందని స్పష్టం చేశారు. తెలంగాణ గ్రామాల రూపురేఖలు మార్చిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. బీజేపీ నేతలు కళ్లు ఉండి కూడా అభివృద్ధిని చూడలేకపోతున్నారని, అధికారం కోసం నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు.

రాణి కుముదినిని ఎందుకు సీఎస్‌గా నియమించలేదు?

ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



ఐనవోలు: రాష్ట్రానికి చీఫ్ సెక్రటరీగా అన్ని అర్హతలు ఉన్న రాణి కుముదినిని ఎందుకు నియమించలేదని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. హనుమకొండ జిల్లా ఐనవోలు మల్లికార్జునస్వామిని శుక్రవారం ఆయన దర్శించుకుని, స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ, కుముదిని ప్రస్తుత సీఎస్ శాంతికుమారి కంటే ఒక సంవత్సరం సీనియర్ అధికారి అయినా, కేవలం దళిత వర్గానికి చెందిన అధికారి కాబట్టే పదవి ఇవ్వలేదని విమర్శించారు. దళితబంధు, సచివాలయానికి అంబేడ్కర్ పేరు, 125 అడుగుల విగ్రహం పెడతామని చెబుతూ.. మరోపక్క దళిత అధికారులకు ఉన్నత పదవులు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు.



ఆ పాస్‌పోర్టుకు పవరెక్కువ!

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి, హైదరాబాద్

మన దేశం నుంచి మరోదేశం వెళ్లాలంటే.. పాస్‌పోర్టు.. వీసా.. ఈ రెండు తప్పనిసరి అని అందరికీ తెలుసు.. వీసా లేకుండా మరో దేశానికి వెళ్లే అవకాశం లేదు. కానీ కొన్ని దేశాలు తమ విమానాశ్రయాల్లో దిగిన తర్వాత వీసా (అరైవల్ ఆన్ వీసా) మంజూరు చేస్తుంటాయి. ఇంకొన్ని సన్నిహిత, శ్రేయోభిలాష దేశాలు.. వీసా లేకపోయినా పరస్పరం తమ దేశాల ప్రజలు వచ్చిపోవడానికి అనుమతినిస్తుంటాయి. వీసాల సంగతి ఇలావుంటే.. పాస్‌పోర్టుల్లో అత్యంత శక్తివంతమైన (వెరీ పవర్‌ఫుల్), శక్తివంతమైన, బలహీనమైన (వీక్) పాస్‌పోర్టులు ఉండటం కొంత ఆసక్తిరేకెత్తించే అంశం. గడిచిన 20 సంవత్సరాలుగా శక్తివంతమైన పాస్‌పోర్టు అందించే దేశాల జాబితాను లండన్‌కు చెందిన అంతర్జాతీయ పౌరసత్వ, నివాస సలహా సంస్థ హెన్లీ అండ్ పార్ట్‌నర్స్ ప్రకటిస్తోంది. ఈ క్రమంలోనే తాజా జాబితా ప్రకటించింది. ప్రపంచ దేశాల్లో జపాన్ పాస్‌పోర్టును అత్యంత శక్తివంతమైన పాస్‌పోర్టుగా తేల్చింది. ఈ మేరకు శక్తివంతమైన పాస్‌పోర్టుల జాబితాలో జపాన్ ప్రథమ స్థానంలో ఉండగా, సింగపూర్, దక్షిణ కొరియాలు రెండూ రెండో స్థానంలో, జర్మనీ, స్పెయిన్‌లు మూడో స్థానంలో ఉన్నాయి. ఇక అగ్రరాజ్యాలుగా పరిగణింపబడే అమెరికా, బ్రిటన్, చైనా లాంటి దేశాలు కొన్ని ఆ తర్వాతి స్థానాల్లోనే ఉండటం గమనార్హం. కాగా మనదేశం 59 దేశాలతో 85వ స్థానంలో నిలిచింది.

నంబర్ 1 స్థానంలో జపాన్ పాస్‌పోర్టు.. చివరి స్థానంలో అఫ్గానిస్తాన్

- బలమైన ఆర్థిక వ్యవస్థలు ఉన్నా అమెరికా, చైనాలు జపాన్ తర్వాతే..
- జపాన్ పాస్‌పోర్టుతో గరిష్టంగా 193 దేశాలకు వీసా ఫ్రీ యాక్సెస్

59 దేశాలతో 85వ ర్యాంకులో భారత్

హెన్లీ పార్ట్‌నర్స్ నివేదిక వెల్లడి

ఏమిటీ శక్తివంతమైన పాస్‌పోర్టు?

మొత్తం 199 దేశాలు పాస్‌పోర్టులు జారీ చేస్తున్నాయి. అయితే ఒక దేశ పాస్‌పోర్టుతో గరిష్టంగా ఎన్ని దేశాలకు వీసా లేకుండా వెళ్లొచ్చు లేదా వీసా ఆన్ అరైవల్ పద్ధతిలో వెళ్లొచ్చనే దానిపై ఆ పాస్టపోర్టు బలం అంటే అది ఎంత శక్తివంతమైన పాస్టపోర్టు అనేది ఆధారపడి ఉంటుంది. అంటే ఎన్ని ఎక్కువ దేశాలకు ఇలా వెళ్లేందుకు అవకాశం ఉంటే ఆ పాస్టపోర్టు అంత శక్తివంతమైందన్న మాట. ఇందుకు సంబంధించి ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్ (ఐఏటీఏ) డేటా ఆధారంగా హెన్లీ సంస్థ పాస్‌పోర్టులకు ర్యాంకులు ప్రకటిస్తుంది. ఈసారి మొదటి స్థానంలో నిలిచిన జపాన్ పాస్‌పోర్టుతో గరిష్ట స్థాయిలో 193 దేశాలకు/గమ్యస్థానాలకు వీసా లేకుండా లేదా వీసా ఆన్ అరైవల్ పద్ధతిలో సందర్శించేందుకు అవకాశం ఉంది. సింగపూర్, దక్షిణ కొరియా (రెండో స్థానంలో) పాస్‌పోర్టులతో 192 దేశాలు, జర్మనీ, స్పెయిన్ (మూడో స్థానంలో) పాస్‌పోర్టులతో 190 దేశాలను పై పద్ధతిలో సందర్శించే వీలుంది. ఇక ఫిన్లాండ్, ఇటలీ, లగ్జంబర్గ్ నాల్గవ స్థానంలో (189) ఉండగా, ఆస్ట్రియా, డెన్మార్క్, నెదర్లాండ్స్, స్వీడన్ (188 దేశాలు), ఫ్రాన్స్, ఐర్లాండ్, పోర్చుగల్, యూకే (187), బెల్జియం, చెక్ రిపబ్లిక్, న్యూజిలాండ్, నార్వే, స్విట్జర్లాండ్, యూఎస్ఏ (186), ఆస్ట్రేలియా, కెనడా, గ్రీస్, మాల్టా (185), పోలండ్, హంగేరి (184), లుథ్వేనియా, స్లోవేకియా (183) వరసగా తొలి 10 స్థానాల్లో ఉన్నాయి. 2014 లో అమెరికా, బ్రిటన్ దేశాలు మొదటి, రెండు స్థానాల్లో ఉన్నాయి. కాగా అప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు ఎనిమిదేళ్లుగా ఈ రెండు దేశాలు మళ్లీ ఆ స్థానాలకు చేరుకోకపోవడం గమనార్హం. కాగా 85వ ర్యాంకులో ఉన్న మన పాస్‌పోర్టుతో 59 దేశాలకు ఆ విధంగా వెళ్లొచ్చు.

జీడీపీ తెలుస్తుంది..

జపాన్ పాస్‌పోర్టుతో ప్రపంచంలోని 85 శాతం దేశాలకు ఫ్రీ వీసా యాక్సెస్ ఉంది. ఈ 85 శాతం దేశాలు ప్రపంచం జీడీపీలో 98 శాతం ఆర్థిక వ్యవస్థను కలిగి ఉన్నాయి. అదే నైజీరియా పాస్‌పోర్టుతో 46 గమ్యస్థానాలకు (20%) వీసా ఫ్రీ యాక్సెస్ ఉంటే.. వాటి ఆర్థిక సామర్థ్యం ప్రపంచ జీడీపీలో 1.5 శాతమే కావడం గమనార్హం. ప్రపంచంలో శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థలైన అమెరికా (25 శాతం), చైనా (19 శాతం)ల వాటా ప్రపంచ జీడీపీలో 44 శాతంగా ఉంది.





పెట్టుబడిదారుకు ఉపయుక్తం..

ఈ విధమైన పాస్‌పోర్టు సమాచారం అంతర్జాతీయ వ్యాపారులకు, అంతర్జాతీయ స్థాయి పెట్టుబడులకు ఉపయోగపడుతుంది. ఈ ర్యాంకుల ఆధారంగా ఆయా దేశాల ఆర్థిక స్థితిగతులు, ఇతర పరిస్థితులు తెలుసుకునేందుకు అవకాశం ఉంది. పాస్‌పోర్టు బలానికి, ఆర్థిక శక్తి మధ్య లంకె ఉన్నట్లు సంస్థ వెల్లడించింది.

దిగువన అఫ్గానిస్తాన్..

అఫ్గానిస్తాన్ జారీ చేసే పాస్‌పోర్టుతో కేవలం 27 దేశాలు లేదా గమ్యస్థానాలకు మాత్రమే వీసా రహితంగా లేదా అరైవల్ ఆన్ వీసా పద్ధతిలో వెళ్లేందుకు అవకాశం ఉంది. ఈ విధంగా ఇది పాస్‌పోర్టులు జారీ చేసే 199 దేశాల్లో అట్టడుగు స్థానాన్ని ఆక్రమించింది. అఫ్గాన్‌తో పోల్చుకుంటే ఇరాక్ (29), సిరియా (30), పాకిస్తాన్ (33) కాస్త మెరుగ్గా ఉన్నాయి.

టీడీపీతో పొత్తా..? అలాంటి ఆలోచనే లేదు

- తెలంగాణలో బీజేపీకి దురుద్దేశాలు ఆపాదించే కథనాలను ఖండిస్తున్నాం
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్ ఆగ్రహం



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో బీఆర్‌ఎస్‌ను ఒంటరిగా ఓడించే బలం ఉన్న బీజేపీపై కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ తరుణ్ చుగ్ మండిపడ్డారు. తెలంగాణలో టీడీపీతో పొత్తు పెట్టుకునే యోచనలో బీజేపీ ఉన్నట్టు వచ్చిన కొన్ని మీడియా కథనాలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ కథనం పూర్తిగా అవాస్తవమని, పార్టీకి దురుద్దేశాలు ఆపాదించే లక్ష్యంతోనే ఈ కథనాన్ని సృష్టించినట్టు స్పష్టమవుతోందని పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం తరుణ్ చుగ్ పత్రికా ప్రకటన విడుదల చేశారు. గురువారం ఢిల్లీలో లోహ్రి వేడుక సందర్భంగా కొద్దిమంది మీడియా ప్రతినిధులు, స్నేహితులతో జరిగిన అనధికారిక సమావేశంలో టీడీపీతో పొత్తు, వైఎస్ షర్మిలకు మద్దతివ్వడం వంటి విషయాన్ని పరోక్షంగానైనా తాను ప్రస్తావించలేదని.. ఈ విషయాలపై తాను ఒక్క మాట కూడా మాట్లాడలేదని స్పష్టత ఇచ్చారు. రాష్ట్రంలో ఉనికి కోల్పోయిన కొన్ని రాజకీయ పార్టీలు తెలంగాణలో బీజేపీపై అసత్య ప్రచారాలు చేస్తూ, పొత్తుల కోసం అర్రులు చాస్తున్నాయని విమర్శించారు. తెలంగాణలో బీఆర్‌ఎస్‌ను ఒంటరిగా ఓడించేంత బలం బీజేపీకి ఉందని.. రాష్ట్రంలో బీజేపీనే ప్రత్యామ్నాయమని ఆయన స్పష్టం చేశారు.

టీడీపీతో పొత్తు ఉండదు: బీజేపీ నేత ఇంద్రసేనారెడ్డి



సాక్షి, హైదరాబాద్: టీడీపీతో ఎట్టిపరిస్థితుల్లోనూ పొత్తు పెట్టుకునే అవకాశం లేదని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లు ఇంద్రసేనారెడ్డి స్పష్టంచేశారు. తెలంగాణలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీజేపీ అధికారంలోకి రావడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్‌ను ఇంటికి పంపి మోదీ నాయకత్వంలోని బీజేపీని గెలిపించేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ వాతావరణం చెడగొట్టడానికి కొందరు ప్రయత్నం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఇంద్రసేనారెడ్డి మీడియాతో మాట్లాడుతూ టీడీపీతో పొత్తులు పెట్టుకొని గతంలోనే నష్టపోయామన్నారు. అప్పుడు స్వతంత్రంగా పోటీ చేసి ఉంటే బీజేపీ ఇంకా బలపడి ఉండేదని, అభిప్రాయపడ్డారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగా పోటీచేస్తుందని ఆయన స్పష్టం చేశారు. తమతో పొత్తులకు టీడీపీ ప్రయ త్నం చేయడమే తమ బలాన్ని సూచిస్తోందన్నారు. రాష్ట్రంలో కనీస బలం లేని పార్టీలతో బీజేపీ పొత్తు పెట్టుకోవాలని అవాస్తవ ప్రచారానికి దిగుతున్నారన్నారు.

కేసీఆర్‌తో ఒడిశా మాజీ సీఎం భేటీ



సాక్షి, హైదరాబాద్: భారత్ రాష్ట్ర సమితి అధ్యక్షుడు, తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావుతో ఒడిశా మాజీ ముఖ్యమంత్రి గిరిధర్ గమాంగ్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. శుక్రవారం ఉదయం ప్రగతిభవన్‌కు చేరుకున్న గిరిధర్ గమాంగ్‌కు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, రాజ్యసభ ఎంపీ దామోదర్‌రావు, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి స్వాగతం పలికారు. ఈ భేటీలో జాతీయ రాజకీయాలతో పాటు వివిధ రాష్ట్రాల్లో నెలకొన్న రాజకీయ పరిస్థితులపై చర్చ జరిగింది. సమావేశంలో గమాంగ్ కుమారుడు శిశిర్ గమాంగ్‌తో పాటు ఇతర నేతలు పాల్గొన్నారు. కాగా బీఆర్‌ఎస్ విస్తరణలో భాగంగా ఇప్పటికే వివిధ రాష్ట్రాలకు చెందిన ముఖ్య నేతలతో కేసీఆర్ వరుస భేటీలు జరుపుతూ జాతీయ రాజకీయాలు, దేశవ్యాప్తంగా నెలకొన్న సమస్యలపై చర్చిస్తున్నారు. ఈ నెల 18న ఖమ్మంలో జరిగే బీఆర్‌ఎస్ బహిరంగ సభకు రావాల్సిందిగా గమాంగ్‌ను కేసీఆర్ ఆహ్వానించినట్లు సమాచారం.



గోదా దేవికి పూజ చేస్తున్న సీఎం కేసీఆర్

ప్రగతిభవన్‌లో గోదా కల్యాణం

కేసీఆర్ దంపతుల ఆధ్వర్యంలో

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు దంపతుల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రగతిభవన్‌లో ఘనంగా గోదాదేవి కల్యాణ వేడుకలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా సాగిన కళ్యాణం కన్నుల పండువగా సాగింది. హిందు సంప్రదాయం ప్రకారం.. ప్రతి ఏడాది ధనుర్మాసంలో ముప్పై రోజులపాటుసాగే శ్రీ ఆండాళ్ అమ్మవారి తిరుప్పావై పాశురాల పఠనం అనంతరం, గోదాదేవి కల్యాణంతో ధనుర్మాస వ్రతం ముగుస్తుంది. ఈ కార్యక్రమంలో సీఎం సోదరీమణులు, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారని ముఖ్యమంత్రి కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

తలవంచలేదు.. కాళ్లు మొక్కలేదు

ఆత్మాభిమానంతోనే రాజకీయాలు చేయాలి: కడియం శ్రీహరి



లింగాలఘణపురం: ''కడియం శ్రీహరి ఎప్పుడైనా ఎవరికైనా తలవంచలేదు. పాదాభివందనం చేయలేదు. నిటారుగా ఉంటా.. వంగే సమస్యే లేదు. తప్పు చేయలేదు. రాజకీయాలు చేసినన్ని రోజులు చేస్తాం..'' అని మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి వ్యాఖ్యానించారు. శుక్రవారం జనగామ జిల్లా లింగాలఘణపురం మండల కేంద్రంలో కురుమ సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం, క్యాలెండర్ ఆవిష్కరణలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ''ఎక్కడ కూడా తప్పు చేయొద్దు. తలవంచొద్దు. ఆత్మాభిమానంతో రాజకీయాలు చేయాలి. తప్పు చేసినోడు తలవంచుకుంటడు. అయ్యా.. అయ్యా అంటూ ఉరుకుతా ఉంటడు. మనం నిజాయితీగా ఉన్నప్పుడు అంతా మన దగ్గరికే వస్తారు..'' అని పేర్కొన్నారు. కురుమలు తమ పిల్లలకు మంచి చదువులు చదివించి ఆత్మాభిమానంతో బతికేలా చూడాలని సూచించారు. 45ఏళ్ల క్రితమే మిత్రుల సహకారంతో పీజీ వరకు చదివానని, ఉద్యోగం సాధించి కుటుంబ సభ్యుల చదువుకు కృషి చేశానని చెప్పారు. తర్వాత రాజకీయాల్లో చేరడంతో కలిసొచ్చిందన్నారు. సామాజిక చైతన్యం ద్వారా రాజకీయ ప్రాతినిధ్యం వస్తుందన్నారు.



ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఏర్పాటు చేసిన సంక్రాంతి సంబురాల్లో మంత్రి హరీశ్ తదితరులు

దేశం చూపు ఖమ్మం వైపు

- 18న సభకు ముగ్గురు సీఎంల హాజరు
- బీఆర్‌ఎస్ సభతో దేశానికి దిశానిర్దేశం..
- సన్నాహక సమావేశాల్లో మంత్రి హరీశ్‌రావు

సత్తుపల్లి: జాతీయ రాజకీయాలను మలుపు తిప్పనున్న చరిత్రాత్మక బీఆర్‌ఎస్ సభ జరగనున్న ఖమ్మం వైపు దేశమంతా చూస్తోందని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన ఖమ్మం జిల్లా సత్తుపల్లి, కూసుమంచి, వైరాలో జరిగిన బీఆర్‌ఎస్ సభ సన్నాహక సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ దేశంలో విప్లవాత్మక మార్పులు తీసుకురానున్న బీఆర్‌ఎస్ సభకు సీఎం కేసీఆర్‌తో పాటు ఢిల్లీ, పంజాబ్, కేరళ ముఖ్యమంత్రులు కేజ్రీవాల్, భగవత్‌మాన్ సింగ్, పినరయి విజయన్, ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్, సీపీఎం, సీపీఐ అగ్రనేతలు హాజరవుతారని తెలిపారు. 2001 ఏప్రిల్ 25న కరీంనగర్‌లో నిర్వహించిన అప్పటి టీఆర్‌ఎస్ సింహగర్జన సభ కంటే ఈ నెల 18న జరిగే ఖమ్మం సభను మరింత విజయవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆ సభ తెలంగాణ ఉద్యమాన్ని, రాజకీయాలను మలుపు తిప్పిందని.. ఇప్పుడు బీఆర్‌ఎస్ పార్టీ ఖమ్మం సభ కూడా దేశానికి దిశానిర్దేశం చేస్తుందని చెప్పారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాపీ కొట్టి మిషన్ భగీరథను.. ఘర్‌ఘర్‌కు జల్, రైతు బంధును పీఎం సమ్మాన్, మిషన్ కాకతీయను అమృత్ సరోవర్‌గా పేర్లుమార్చి తమ పథకాలుగా చెప్పుకుంటోందని ఎద్దేవా చేశారు. రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా హైదరాబాద్‌లో రూ.750 కోట్లతో కేన్సర్ ఆస్పత్రి, సత్తుపల్లిలో కేన్సర్ స్క్రీనింగ్ సెంటర్, కంటి ఆస్పత్రిని నిర్మిస్తానని వెల్లడించారు. ఈ సమావేశాల్లో ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వరరెడ్డి, ఎమ్మెల్యేలు కందాళ ఉపేందర్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య, రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంక్రాంతి సంబురాలు

సత్తుపల్లిలో జరిగిన బీఆర్‌ఎస్ సభ సన్నాహక సమావేశం వేదిక పక్కన ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఏర్పాటు చేసిన సంక్రాంతి సంబురాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు భోగి మంటలు వెలిగించారు.

కేటీఆర్ సీఎం కుర్చీలో ఆశీనులు కావాలని..

200 కుర్చీలు పంపిణీ చేసిన వరంగల్ నేత

వరంగల్ చౌరస్తా: రాష్ట్ర ఐటీ, మున్సిపల్‌శాఖ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీఎం సీటులో ఆసీనులు కావాలని ఆకాంక్షిస్తూ శుక్రవారం వరంగల్ నగరంలో శాప్ మాజీ డైరెక్టర్, టీఆర్‌ఎస్ నాయకుడు రాజనాల శ్రీహరి నగరవాసులకు 200 కుర్చీలను పంపిణీ చేశారు. ప్రతి కార్యక్రమాన్ని వినూత్నంగా నిర్వహించే రాజనాల శ్రీహరి ఈ దఫా కుర్చీలు పంపిణీ చేసి తన అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా రాజనాల శ్రీహరి మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ నాయకత్వంలో మంత్రి కేటీఆర్ అనేక కొత్త కంపెనీలు తీసుకొచ్చి యువతకు ఉపాధి కల్పిస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ రాష్ట్రాన్ని ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతున్నారన్నారు.



మహిళలకు కుర్చీలను పంపిణీ చేస్తున్న టీఆర్‌ఎస్ నాయకుడు రాజనాల శ్రీహరి

మెయిన్స్‌కు 25,050 మంది ఎంపిక

గ్రూప్‌-1 ప్రిలిమ్స్ ఫలితాలు విడుదల

సాక్షి, హైదరాబాద్: గ్రూప్‌-1 ప్రిలిమ్స్ ఫలితాలు విడుదలయ్యాయి. ప్రిలిమ్స్ రాసినవారిలో మెయిన్స్ పరీక్షలకు అర్హత సాధించిన అభ్యర్థుల జాబితాను తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) శుక్రవారం అర్ధరాత్రి విడుదల చేసింది. ఒక్కో పోస్టుకు 50 మంది చొప్పున మొత్తంగా 25,050 మందిని మెయిన్స్‌కు ఎంపిక చేసినట్టు వెల్లడించింది. ఈ మేరకు అభ్యర్థుల హాల్ టికెట్ నంబర్లతో కూడిన జాబితాను టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో పెట్టింది. ఈ ఫలితాలకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు, విజ్ఞప్తులు ఉంటే టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌కు కార్యాలయ పనివేళల్లో ఫోన్ చేసి సంప్రదించవచ్చని సూచించింది. ఈ ఏడాది జూన్‌లో మెయిన్స్ పరీక్షలు నిర్వహిస్తామని.. ఆ పరీక్ష ప్యాటర్న్‌ను ఈనెల 18న కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని తెలిపింది.

503 గ్రూప్‌-1 ఉద్యోగాలకు..: రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో 503 గ్రూప్‌-1 ఉద్యోగాల భర్తీకి గత ఏడాది నోటిఫికేషన్ విడుదలైన సంగతి తెలిసిందే. దరఖాస్తులు స్వీకరించిన టీఎస్‌పీఎస్సీ అక్టోబర్ 16న ప్రిలిమ్స్ పరీక్షను నిర్వహించింది. మొత్తం 2,85,916 మంది పరీక్షకు హాజరయ్యారు. అక్టోబర్ నెలాఖరులో టీఎస్‌పీఎస్సీ అభ్యర్థుల ఓఎంఆర్ జవాబు పత్రాలను స్కాన్ చేసి వెబ్‌సైట్‌లో పెట్టింది. ప్రాథమిక కీ విడుదల చేసి.. అభ్యంతరాలను స్వీకరించింది. ఐదు ప్రశ్నలను తొలగించి తుది కీని ప్రకటించింది. తాజాగా మల్టీజోన్లు, రిజర్వేషన్లు, జెండర్ వారీగా ఒక్కో పోస్టుకు 50 మంది చొప్పున అభ్యర్థులను ఎంపిక చేసింది. అయితే మల్టీజోన్‌-2 పరిధిలో విజువల్లీ హ్యాండిక్యాప్డ్ (విమెన్), హియరింగ్ ఇంపెయిర్డ్ (జనరల్) కేటగిరీల్లో 1:50 నిష్పత్తిలో అభ్యర్థులు లేకపోవడంతో ఆ రెండు కేటగిరీలను పక్కనపెట్టింది. మొత్తంగా 25,050 మందిని మెయిన్స్‌కు ఎంపిక చేసి జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపర్చింది.

వివరాలకు..

టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్: www.tspsc.gov.in
టీఎస్‌పీఎస్సీ హెల్ప్‌డెస్క్ నంబర్లు:
040-22445566, 040-23542185,
040-23542187
ఈ-మెయిల్: helpdesk@tspsc. gov. in

మహిళలకు 33శాతం రిజర్వేషన్లు..: మహిళా రిజర్వేషన్లకు సంబంధించి హైకోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా.. నేరుగా 33% రిజర్వేషన్లు కల్పిస్తున్నట్టు టీఎస్‌పీఎస్సీ వెల్లడించింది. ఒకే మార్కులను ఇద్దరు లేదా అంతకు మించి అభ్యర్థులు సాధిస్తే.. వారి స్థానికత ప్రకారం అర్హతను ఖరారు చేసినట్టు కమిషన్ తెలిపింది. ఒకే మార్కులు సాధించిన వారు ఒకే స్థానికతతో ఉన్నప్పుడు అభ్యర్థుల పుట్టినతేదీ ఆధారంగా ఎక్కువ వయసున్న వారికి హయ్యర్ ర్యాంకు ఇచ్చినట్టు వివరించింది. ఓఎంఆర్ పత్రాల్లో కమిషన్ సూచించిన విధంగా కాకుండా ఇష్టానుసారం బబ్లింగ్ చేసిన వారిని పరిగణనలోకి తీసుకోలేదని కమిషన్ తెలిపింది.

'కాంట్రాక్టు ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి'

సాక్షి, హైదరాబాద్: వైద్య ఆరోగ్యశాఖలోని అన్ని కేడర్ల కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, అలాగే అన్ని కేడర్ల ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాదనాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఫసియొద్దీన్ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యాదనాయక్ మాట్లాడుతూ ఖాళీ పోస్టులను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేసి ఉద్యోగులకు పని భారాన్ని తగ్గించాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని కోరారు. 2023 జూలై నుంచి రావాల్సిన రెండో పీఆర్సీని వెంటనే ప్రకటించి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. నేషనల్ హెల్త్ మిషన్‌లోని రెండో ఏఎన్ఎంలు, డీఎస్సీ కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగులు, వైద్య విధాన పరిషత్ ఉద్యోగులు, 104, 108, అర్బన్ హెల్త్ సెంటర్స్, ఆయుష్ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఇలంజుకుతో



సింపుల్! ఇలా ముగ్గేసి 'ముగ్గు'లోకి దించాలి!!

క్లుప్తంగా...

యూజీ ఆయుష్ వైద్యవిద్య సీట్ల భర్తీకి వెబ్ కౌన్సెలింగ్

ఆప్షన్ల కోసం 16 నుంచి 17వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అవకాశం



సాక్షి, హైదరాబాద్: యూజీ ఆయుష్ వైద్య విద్య సీట్ల భర్తీకి రెండో విడత వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కాళోజీ ఆరోగ్య విశ్వ విద్యాలయం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. వర్సిటీ పరిధిలోని ఆయుష్ కళాశాలల్లో హోమియోపతి (బీహెచ్ఎంఎస్), ఆయుర్వేద (బీఏఎంఎస్), యునాని (బీయూఎంఎస్), నేచురోపతి–యోగా (బీఎన్వైసీ) కోర్సుల్లో కన్వీనర్ కోటా సీట్లను ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనుంది. ఈ నెల 16 ఉదయం 8 గంటల నుంచి 17వ తేదీ సాయంత్రం 6గంటల వరకు అభ్యర్థులు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని, తుది మెరిట్ జాబితాలోని అర్హులైన అభ్యర్థులు కళాశాలల వారీగా ఆప్షన్లు నమోదు చేసుకోవాలని సూచించింది. అయితే అఖిల భారత కోటాలో, కాళోజీ, ఎన్టీఆర్ వర్సిటీలలో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో సీటు పొందిన అభ్యర్థులు ఈ వెబ్ కౌన్సెలింగ్‌కు అనర్హులని పేర్కొంది. మరింత వివరాలకు www.knruhs.telangana.gov.inను చూడాలని వెల్లడించింది.


పోలీస్ ఉద్యోగాల తుది రాత పరీక్షల తేదీల్లో మార్పులు

నియామక మండలి చైర్మన్ శ్రీనివాసరావు

సాక్షి, హైదరాబాద్: యూనిఫామ్ సర్వీసెస్ ఉద్యోగాల నియామక ప్రక్రియ తుది రాత పరీక్ష తేదీల షెడ్యూల్‌లో స్వల్పంగా మార్పులు చేసినట్టు తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ నియామక మండలి చైర్మన్ వి.వి. శ్రీనివాసరావు తెలిపారు. టీఎస్‌పీఎస్సీ నుంచి వచ్చిన అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం మార్చి 12న జరగాల్సిన కమ్యూనికేషన్ ఎస్సై, ఫింగర్ ప్రింట్స్ బ్యూరో ఏఎస్సై తుది రాత పరీక్షలను ఒక రోజు ముందుకు.. అంటే మార్చి 11వ తేదీకి మార్చినట్టు వెల్లడించారు. సివిల్ కానిస్టేబుల్, ట్రాన్స్‌పోర్ట్, ఎక్సైజ్ కానిస్టేబుల్, ఐటీ కమ్యూనికేషన్స్ కానిస్టేబుల్ పోస్టులకు తుది రాత పరీక్ష తేదీని ఏప్రిల్ 23 నుంచి ఏప్రిల్ 30వ తేదీకి మార్చినట్టు వివరించారు. కాగా, సివిల్ ఎస్సై సహా ఇతర పోస్టులకు తుది రాత పరీక్షలు ముందుగా నిర్ణయించిన తేదీల్లోనే యథావిధిగా నిర్వహిస్తామని శ్రీనివాసరావు తెలిపారు.

త్వరలోనే టీచర్ల బదిలీలు

పీఆర్‌టీయూటీఎస్ డైరీ ఆవిష్కరణలో మంత్రి హరీశ్‌రావు



పీఆర్‌టీయూటీఎస్ డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పలు యాజమాన్యాల పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరి పదోన్నతులు, బదిలీ షెడ్యూల్ త్వరలోనే విడుదల కానున్నట్టు రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు వెల్లడించారు. శుక్రవారం ఆయన పీఆర్‌టీయూటీఎస్ 2023 నూతన సంవత్సర డైరీని ఆవిష్కరించారు. టీచర్ల పదోన్నతులు, బదిలీల షెడ్యూల్‌ను సంక్రాంతి కానుకగా అందించాలని తాను సీఎం కేసీఆర్‌ను కోరగా, సానుకూలంగా స్పందించారన్నారు కార్యక్రమంలో పీఆర్‌టీ యూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.కమలాకర్‌రావు, ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, నేతలు మధు, రంగారావు, తిరుపతిరెడ్డి, వెంకటేశ్వరరావు, రవి, ప్రసాద్ పాల్గొన్నారు.

సీఎస్‌ను కలిసిన ట్రెసా నేతలు



సీఎస్‌కు వినతిపత్రం ఇస్తున్న ట్రెసా నేతలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) రాష్ట్ర అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.గౌతమ్‌కుమార్ నేతృత్వంలోని బృందం శుక్రవారం సచివాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపింది. రెవెన్యూ శాఖలోని సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు.

నేవీతో ఐఐటీహెచ్ ఒప్పందం

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: హైదరాబాద్ ఐఐటీ, నేవీతో కీలక ఒప్పందం కుదుర్చుకుంది. రక్షణ రంగ సాంకేతిక అభివృద్ధికి నేవీకి చెందిన సంస్థ డబ్ల్యూఎస్ఈఈ (వెపన్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ సిస్టం ఇంజనీరింగ్ ఎస్టాబ్లిష్‌మెంట్) తో కలిసి పనిచేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీ.ఎస్.మూర్తి, నేవీ వైస్ అడ్మిరల్ సందీప్ నైతానిలు ఈ నెల 9న ఢిల్లీలో ఒప్పందంపై సంతకాలు చేసినట్టు ఐఐటీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఐఐటీలోని టెక్నాలజీ రీసెర్చ్ పార్క్‌లో కో డెవలప్‌మెంటల్ టెక్నా లజీ ఇన్నో వేషన్ సెంటర్ ఏర్పాటు చేస్తారు.

కోవిడ్ టీకాలకు కటకట..!

రాష్ట్రంలో కోవిషీల్డ్ వ్యాక్సిన్ స్టాక్ ఖాళీ.. మూడు రోజుల క్రితమే వెబ్‌సైట్ క్లోజ్

- కోవాగ్జిన్ నిల్వలు కూడా అంతంతే
- ఈ నెలాఖరుతో ముగియనున్న ఆ టీకాల గడువు
- విదేశాలకు వెళ్లేవారు, బూస్టర్ డోసు కోసం వచ్చేవారికి తిప్పలు
- కరోనా కొత్త వేరియంట్లు, విదేశాల్లో కేసుల పెరుగుదల వార్తలతో జనంలో ఆందోళన



సాక్షి, రంగారెడ్డి జిల్లా: రాష్ట్రంలో కోవిడ్ టీకాలకు కొరత ఏర్పడింది. ముఖ్యంగా కోవిషీల్డ్ వ్యాక్సిన్ల స్టాక్ పూర్తిగా ఖాళీ అయింది. టీకా కోసం ప్రభుత్వ వ్యాక్సినేషన్ సెంటర్లకు వెళ్తున్నవారికి ప్రస్తుతం అందుబాటులో లేవన్న సమాధానమే వస్తోంది. మరోవైపు చైనాతోపాటు పలు దేశాల్లో భారీగా కరోనా కేసులు నమోదవుతున్నాయని, కొత్త వేరియంట్లు ప్రభావం చూపుతున్నాయని వస్తున్నవార్తలతో జనంలో ఆందోళన కనిపిస్తోంది. డిమాండ్ మేరకు టీకాలను సరఫరా చేయకపోవడం, ప్రభుత్వ కోల్డ్ చెయిన్ పాయింట్ (సీసీపీ), డిస్ట్రిక్స్ వ్యాక్సి నేషన్ పాయింట్ (డీవీ ఎస్) కేంద్రాలకు ఇప్పటికే సర ఫరా చేసిన కోవిషీల్డ్ టీకాల గడువు ముగిసిపోవడం వంటివి ఇబ్బందికరంగా మారింది. ఇదే టీకా తొలి రెండు డోసులు వేసుకున్న వారితోపాటు విదేశాలకు వెళ్లాల్సినవారు వ్యాక్సిన్లు అందుబాటులో లేక ప్రైవేటులో తీసు కోవాల్సి వస్తోంది. ఈ పరిస్థితిని సొమ్ముచేసు కుంటున్న ప్రైవేటు ఆస్పత్రులు టీకాలతోపాటు అదనపు చార్జీలు అంటూ అడ్డగోలుగా వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కోవిషీల్డ్ గడువు ముగియడంతో..

కరోనా వైరస్ నుంచి రక్షణ కోసం ప్రభుత్వం ప్రజలకు కోవాగ్జిన్, కోవిషీల్డ్ వ్యాక్సిన్లను ఇస్తోంది. మెజార్టీ ప్రజలు మొదటి, రెండో డోసు కోవిషీల్డ్ టీకాలు తీసుకున్నారు. బూస్టర్ డోసులు పంపిణీ మొదలైనా ఇటీవలి వరకు పెద్దగా డిమాండ్ కనిపించలేదు. కానీ కొన్నిరోజులుగా కోవిడ్ కొత్త వేరియంట్లను గుర్తించడం, ప్రపంచవ్యాప్తంగా పలుదేశాల్లో మళ్లీ ప్రభావం చూపిస్తుండటంతో.. బూస్టర్ (ప్రికాషన్) డోసు వేసుకునేందుకు ప్రజలు ముందుకొస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3,24,42,135 ఫస్ట్‌డోసు, 3,15,40,633 సెకండ్ డోసు టీకాలను పంపిణీ చేశారు. వీరిలో 1,32,93,044 మంది ప్రికాషన్ డోసు తీసుకోగా.. మరో 1,61,38,443 మందికి అవసరం ఉంది. ప్రభుత్వం ఇంతకు ముందు సరఫరా చేసిన కోవిషీల్డ్ టీకాల గడువు ఈ నెల 10వ తేదీతో ముగిసిపోయింది. దీనితో మిగిలిన టీకాలను పక్కన పడేశారు. సంబంధిత వెబ్‌సైట్ కూడా మూడు రోజుల కిందే మూతపడింది. ప్రస్తుతం ఆస్పత్రుల్లో కోవాగ్జిన్ మాత్రమే అందుబాటులో ఉంది. అది కూడా 2.77 లక్షల డోసులే స్టాకు ఉంది. ఈ వ్యాక్సిన్ గడువు కూడా ఈ నెలా ఖరుతో ముగియ నున్నట్టు సమాచారం. టీకా నిల్వలు దగ్గరపడుతుండటంతో వైద్య సిబ్బంది కూడా ఏమీ చేయ లేక చేతులెత్తేస్తున్నారు. వ్యాక్సినే షన్ కోసం ఆస్పత్రు లకు వెళ్తున్నవారు నిరాశతో వెనుదిరుగుతున్నారు.

టీకాల కోసం లేఖ రాసినా స్పందించని కేంద్రం

- కేంద్ర ప్రభుత్వం కంపెనీల నుంచి కరోనా టీకాలను తీసుకుని దేశవ్యాప్తంగా రాష్ట్రాలకు సరఫరా చేస్తుంది. ఆయా రాష్ట్రాల అవసరాలు, డిమాండ్‌ను బట్టి పంపిణీ చేస్తుంది. రాష్ట్రంలో కోవిడ్ టీకాల స్టాకు ఖాళీ అవుతుండటంతో వెంటనే పంపాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి టి.హరీశ్‌రావు కొన్నిరోజుల కిందే కేంద్రమంత్రి మన్‌సుఖ్ మాండవీయకు విజ్ఞప్తి చేశారు. కానీ దీనిపై కేంద్రం ఇంతవరకు స్పందించలేదని.. రాష్ట్ర అవసరాలకు తగినట్టుగా కేంద్రం నుంచి టీకాలు అందడం లేదని వైద్యారోగ్య శాఖ వర్గాలు చెప్తున్నాయి.

రాష్ట్రంలో కోవిడ్ వ్యాక్సినేషన్ తీరు

ఏ డోసు	తీసుకున్నవారి సంఖ్య
డోస్-1	3,24,42,135
డోస్-2	3,15,40,633
ప్రికాషన్ డోస్	1,32,93,044
ఇంకా ప్రికాషన్ డోస్ తీసుకోవాల్సినవారి సంఖ్య	1,61,38,443

గురువారం నాటికి రాష్ట్రవ్యాప్తంగా కోవిడ్ టీకాల నిల్వ..

టీకా	సీసీపీ/డీవీఎస్	స్టేట్ స్టోర్	మొత్తం
కోవిషీల్డ్	-	-	-
కోవాగ్జిన్	2,04,970	72,870	2,77,840

రాష్ట్రంలో మొత్తం కోవిడ్ వ్యాక్సినేషన్ సెంటర్లు	4,041
ప్రభుత్వ కేంద్రాలు	3,704
ప్రైవేటు కేంద్రాలు	337

కోవిషీల్డ్ బూస్టర్ డోస్ లేదన్నారు

ఈ నెల 23న అమెరికా వెళ్లాల్సి ఉంది. వాక్సినేషన్ తప్పనిసరి చేశారు. ఇప్పటికే మొదటి, రెండు డోసులు కోవిషీల్డ్ తీసుకున్నా. బూస్టర్ డోసు తీసుకోవాల్సి ఉంది. టీకా కోసం గురువారం బాలాపూర్ పీహెచ్‌సీకి వెళ్లాను. కానీ ఆ టీకా లేదన్నారు. ఎనిమిది రోజుల్లో ప్రయాణం ఉంది. ఇప్పుడేం చేయాలో అర్థం కావడం లేదు.

– అశోక్‌కుమార్, మీర్‌పేట్, హైదరాబాద్

ఐటీ డిమాండ్లను తీర్చే సత్తా తెలంగాణకే: కేటీఆర్

టీ హబ్, డీవీసీ భాగస్వామ్యంతో డీవీసీ ఇండియా ఫండ్



టీ హబ్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: ఐటీ రంగ డిమాండ్లను తీర్చే సత్తా తెలంగాణకే ఉందని, స్టార్టప్‌ల ఫలితాలను రాష్ట్రానికే కాకుండా దేశవ్యాప్తంగా విస్తరింపచేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కె.తారక రామారావు అన్నారు. ఆర్థికంగా వృద్ధి చెందుతున్న భారతదేశంలో పెట్టుబడులు రాబట్టడం కష్టమైనదేమీ కాదని, స్టార్టప్‌లకు నిధులు సేకరణ ఇబ్బందికర అంశంకాదని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని స్టార్టప్‌లకు మార్గదర్శనం చేసే లక్ష్యంతో డల్లాస్ వెంచర్ కేపిటల్(డీవీసీ), టీహబ్ శుక్రవారం పరస్పర అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ సందర్భంగా టీ హబ్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఆరు వేలకుపైగా స్టార్టప్‌లు ఉన్నాయని, దేశంలోనే తొలి ప్రైవేటు రాకెట్‌ను ప్రయోగించిన సంస్థ టీ హబ్‌లోనే పురుడు పోసుకుందని అన్నారు. డీవీసీ, టీహబ్ కలిసి డీవీసీ ఇండియా ఫండ్ ఏర్పాటు చేయడం హర్షణీయమని, రెండు ప్రముఖ సంస్థల మధ్య కుదిరిన ఒప్పందం తెలంగాణను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు మరింత దోహదం చేస్తుందన్నారు. ఒప్పందంలో భాగంగా డల్లాస్ వెంచర్ ఫండ్ ద్వారా డీవీసీ హైదరాబాద్ స్టార్టప్‌లకు నిధులు సమకూరుస్తుందని తెలిపారు. దేశంలో టెక్ స్టార్టప్‌లకు చేయూతనిచ్చేందుకు రూ.350 కోట్లతో డీవీసీ ఇండియా ఫండ్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. డీవీసీ ఇప్పటికే భారత్‌లో అనేక స్టార్టప్ లను నెలకొల్పిందని వివరించారు. కార్యక్రమంలో డీవీసీ ఎండీ దయాకర్ పూస్కూర్, సహ వ్యవస్థాపకులు అబిదాలీ నీముచ్‌వాలా, శ్యామ్ పెనుమాక, గోకుల్ దీక్షిత్, కిరణ్ కల్లూరి, టీ హబ్ సీఈవో మహంకాళి శ్రీనివాస్‌రావు, ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ పాల్గొన్నారు.

స్టార్టప్‌లకు ఊతం

డల్లాస్ వెంచర్ కేపిటల్ 2023లో స్టార్టప్‌లు తమ వాణిజ్య పరిధిని విస్తరించుకునేందుకు ఊతమివ్వడం ద్వారా వినియోగదారుల్లో విస్తతిని పెంచుకునేందుకు సహాయపడుతుంది. దీని కోసం ప్రస్తుతమున్న స్టార్టప్‌లతోపాటు కొత్తగా ఏర్పాటయ్యే స్టార్టప్‌లతో కలిసి పనిచేస్తుంది. టీ హబ్ సహకారంతో వృద్ధి చెందే సామర్థ్యమున్న వినూత్న స్టార్టప్‌లను గుర్తించి అంతర్జాతీయ మార్కెట్ లో విస్తరించేందుకు అవసరమైన వినూత్న సాంకేతికత, మౌలిక వసతులు, బృంద సామర్థ్యం పెంపుదల తదితరాల్లో డీవీసీ మార్గదర్శనం చేస్తుంది.

నేడు దావోస్‌కు మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 16 నుంచి మూడు రోజుల పాటు స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) సదస్సులో పాల్గొనేందుకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు శనివారం రాత్రి హైదరాబాద్ శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బయల్దేరి వెళ్లనున్నారు. 16, 17, 18 తేదీల్లో దావోస్ పర్యటనలో భాగంగా పలువురు వాణిజ్య వేత్తలతో భేటీ కావడంతో పాటు తెలంగాణలో వివిధ రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను కేటీఆర్ వివరించనున్నారు. దావోస్ పర్యటన ముగించుకుని తిరిగి ఈ నెల 20న కేటీఆర్ హైదరాబాద్‌కు చేరుకుంటారు.

సీఎంఆర్‌పై సీబీ‘ఐ’

▶ మొదటి పేజీ తరువాయి

అక్రమాలకు పాల్పడటం, నాసిరకం బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించడం, నాణ్యత ప్రమాణాలకు తిలోదకాలిచ్చి బియ్యం సరఫరా చేస్తున్నారనే ఆరోపణలపై ఇప్పటికే ఢిల్లీ, హరియాణా, పంజాబ్, ఛత్తీస్‌గఢ్‌ల్లో దాడులు నిర్వహించింది. 74 మందిపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేసింది. ఇదే క్రమంలో త్వరలోనే తెలంగాణలోనూ ధాన్యం కొను గోళ్లలో అక్రమాలు, సీఎంఆర్ అప్పగింతల్లో అవకతవకలపై దర్యాప్తుకు సీబీఐ రంగంలోకి దిగనున్నట్టు కేంద్రప్రభుత్వ వర్గాల ద్వారా తెలుస్తోంది. బీఆర్ఎస్ నేతల అండతో మిల్లర్లు సీఎంఆర్ కేటాయింపులలో అవకతవకలకు పాల్పడుతున్నట్లుగా ఢిల్లీకి ఉప్పందినట్లు తెలిసింది. మిల్లర్లకు పౌరసరఫరాల శాఖ అధికారుల సహకారం కూడా ఉందని భావిస్తున్న సీబీఐ ఆ దిశగా దర్యాప్తుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

4 రాష్ట్రాల్లోని 50 ప్రాంతాల్లో తనిఖీలు..

విశ్వసనీయ సమాచారం మేరకు.. ధాన్యం ఉత్పత్తి అధికంగా ఉండే పంజాబ్, హరియాణా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో ధాన్యం కొనుగోళ్లలో భారీగా అక్రమాలు జరిగినట్లు సీబీఐ గుర్తించింది. దీనితోపాటు సకాలంలో కేంద్రానికి ఇవ్వాల్సిన సీఎంఆర్ ఇవ్వకుండా మిల్లర్లు ప్రైవేటుకు అమ్ముకోవడం, దీనికి కొందరు ఎఫ్‌సీఐ అధికారులతో పాటు ఆయా రాష్ట్రాల ఆహార, పౌర సరఫరాల శాఖల అధికారులు సహకరిస్తుండటాన్ని కూడా గుర్తించింది. సెంట్రల్ పూల్‌కు ఇచ్చే బియ్యంలో నాణ్యత లోపిస్తున్నా, ఎఫ్‌సీఐ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో వినియోగదారులకు నాణ్యతలేని బియ్యం సరఫరా అవుతు న్నట్లు నిర్ధారించింది. మూడ్రోజుల కిందట ఢిల్లీ, పంజాబ్, హరియాణా, ఛత్తీస్‌గఢ్‌ల్లోని 50 ప్రాంతాల్లో సీబీఐ ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. ఎఫ్‌సీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ రాజీవ్‌కుమార్ మిశ్రా సహా 74 మందిని అరెస్ట్ చేసింది. ఇందులో 37 మంది ఎఫ్‌సీఐ అధికారులు కాగా మిగతావారిలో మిల్లర్లు, దళారులు, గోదాముల నిర్వాహకులు ఉన్నారు.

ఉత్పత్తి సామర్థ్యానికి మించి కొనుగోళ్లు

మిశ్రా ఎఫ్‌సీఐ ప్రధాన కార్యాలయంలో పనిచేసిన సమయంలోనే తెలంగాణ, పంజాబ్, హరియాణాల్లో ఉత్పత్తి సామర్థ్యానికి మించి ధాన్యం కొనుగోళ్లు జరిగాయనే ఆరోపణలు వచ్చాయి. మిశ్రా చాలా రాష్ట్రాల మిల్లర్లతో కుమ్మక్కై, కేంద్రానికి ఇవ్వాల్సిన సీఎంఆర్ కోటా గడువు పెంపునకు ఆదేశాలు ఇచ్చారని, ఈ క్రమంలో కోట్ల రూపాయలు చేతులు మారాయనే ఆరోపణలు రాగా విచారణ జరుగుతోంది. తెలంగాణకు సంబంధించి ఎఫ్‌సీఐలో గతంలో పనిచేసిన ఓ అధికారి హయాంలో కూడా సీఎంఆర్ కోటా సేకరణ విష యంలో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. అలాగే గత సంవత్సరం వానాకాలం, యాసంగి సీజన్ల సీఎంఆర్ గడువు దాటినా ఎఫ్‌సీఐకి అందకపోవడం, లెక్కల్లో తేడాలుండటం వంటి అంశాలు సీబీఐ దృష్టిలో ఉన్నట్లు చెబుతున్నారు.

సీఎంఆర్ అప్పగింతలో అవకతవకలు

వానాకాలం, యాసంగి పంటను మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు మిల్లులకు తరలిస్తుంటుంది. సుమారు 3 వేల మిల్లుల ద్వారా ధాన్యాన్ని మిల్లింగ్ చేసి, కేంద్రం సెంట్రల్‌పూల్ కింద ఇచ్చిన టార్గెట్‌కు అనుగుణంగా సీఎంఆర్‌ను ఎఫ్‌సీఐ గోడౌన్లకు పంపిస్తుంటుంది. అయితే ధాన్యాన్ని ఆరునెలల్లోగా మిల్లింగ్ చేసి ఎఫ్‌సీఐకి అప్పగించాల్సిన మిల్లర్లు ఆ తర్వాత రెండు, 3 సీజన్లు గడిచినా అప్పగించడం లేదు. మిల్లుల్లోని నాణ్యమైన సర్కారు ధాన్యాన్ని మిల్లింగ్ చేసి, ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తూ ప్రజాపంపిణీ బియ్యం కొని, రీసైక్లింగ్ చేసి లోటును భర్తీ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఇప్పటికీ పెండింగ్‌లో 2021-22 వానాకాలం బియ్యం

ప్రస్తుతం 2022–23 వానకాలం ధాన్యం కొనుగోళ్లు సాగుతుండగా, మరో నెలలో కస్టమ్ మిల్లింగ్ ప్రారంభం కావలసి ఉంది. కానీ, ఇప్పటికీ 2021–22 వానాకాలం సీజన్ బియ్యం 8.65 లక్షల మెట్రిక్ టన్నులు (ఎల్ఎంటీ) ఎఫ్‌సీఐకి రావలసి ఉంది. ఆ సీజన్‌లో 70.21 ఎల్ఎంటీల ధాన్యాన్ని మిల్లర్లకు అప్పగించగా, 47.04 ఎల్ఎంటీల బియ్యాన్ని సీఎంఆర్ కింద ఇవ్వాల్సి ఉంది. అయితే ఇప్పటికే పలుమార్లు గడువు పెంచినా ఎఫ్‌సీఐకి ఇచ్చిన బియ్యం 38.39 ఎల్ఎంటీలే. ఇక గత యాసంగి సీజన్‌కి సంబంధించి 50.39 ఎల్ఎంటీ ధాన్యం మిల్లులకు పంపి, 34.07 ఎల్ఎంటీ సీఎంఆర్ తీసుకోవలసి ఉండగా, ఇప్పటివరకు 16 ఎల్ఎంటీల బియ్యం మాత్రమే ఎఫ్‌సీఐకి అందింది. 2020–21 యాసంగికి సంబంధించి మిర్యాలగూడలోని వజ్ర పారాబాయిల్డ్ రైస్‌మిల్లు రూ.5.90 కోట్ల విలువైన బియ్యాన్ని ఎగవేయడంతో ఈ నెల 9న ముగ్గురు యజమానులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇలా ప్రతి జిల్లాలో అధికారుల అండతో అక్రమాలు కొనసాగుతూనే ఉన్నాయనే ఆరోపణలు విన్పిస్తున్నాయి.

ఆధారాలు సేకరించిన దర్యాప్తు సంస్థ!

రాష్ట్రంలోని 3 వేల రైస్ మిల్లులకు మూడేళ్లుగా ప్రతి సీజన్‌లో సుమారు రూ.15 వేల కోట్ల విలువైన ధాన్యాన్ని ప్రభుత్వం అప్పగించి సీఎంఆర్ తీసుకుంటోంది. ధాన్యాన్ని మిల్లింగ్ చేసినందుకు లేబర్ ఖర్చుసహా ప్రతి పైసా మిల్లర్లకు చెల్లిస్తోంది. అయినా.. 33 జిల్లాల్లోని పలువురు పౌర సరఫరాల శాఖ అధికారుల అండతో మిల్లర్లు సర్కారు ధాన్యాన్ని సొంత వ్యాపారానికి వినియోగించుకుంటున్నట్టుగా సీబీఐ ఆధారాలు సేకరించినట్లు సమాచారం. 2019–20లో 118 మంది మిల్లర్లు రూ.230 కోట్ల విలువైన 1,00,427 మెట్రిక్ టన్నుల బియ్యం ఎఫ్‌సీఐకి బకాయి పడగా, వారిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పైగా సదరు మిల్లులకు మరోసారి సీఎంఆర్ గడువు పెంచడం అనుమానాలకు తావిచ్చింది. 2020– 21లో కూడా మిల్లర్లు బకాయిలు పడగా వారిని డిఫాల్టర్లుగా ప్రకటించి, 2021–22 సీజన్లలో ధాన్యం కేటాయించలేదు. అయితే ఆ తర్వాత రాజకీయ జోక్యంతో సదరు మిల్లులకు కూడా ధాన్యం సరఫరా అయింది. ఇలాంటి అడ్డగోలు వ్యవహారాలన్నింటిపై సీబీఐ సమాచారం సేకరించినట్లు తెలిసింది.

అక్రమ నిర్మాణాలపై అధికారుల తీరు సరికాదు: హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: యథాతథ స్థితి (స్టేటస్ కో) ఉత్తర్వులు జారీ అయ్యాయని చెప్పి అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే అధికారులు వాటిని పట్టించుకోకుండా ఉండకూదని హైకోర్టు స్పష్టం చేసింది. హైదరాబాద్‌లోని అత్తాపూర్‌లో అక్రమ నిర్మాణాన్ని కూల్చేస్తామని జీహెచ్ఎంసీ ఇచ్చిన నోటీసును కొందరు వ్యక్తులు సవాల్ చేసిన కేసులో కింది కోర్టు స్టేటస్‌కో ఉత్తర్వులు ఇచ్చింది. ఆ ఉత్తర్వులు ఉండగా అక్రమ నిర్మాణాలను కొనసాగించడంతో ఇతర వ్యక్తులు హైకోర్టులో రిట్ దాఖలు చేశారు. స్టేటస్‌కో ఉందని చెప్పి అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా జీహెచ్ఎంసీ అధికారులు చూస్తూ ఉండటం సముచితం కాదని ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని ఆదేశించి పిటిషన్లపై విచారణను ముగించింది.

జరిమానా చెల్లించలేదని..

బాధిత కుటుంబంపై భౌతిక దాడి.. కుల బహిష్కరణ

ములకలపల్లి: కుల పెద్దలు విధించిన జరిమానా కట్టలేదనే నెపంతో ఓ కుటుంబాన్ని బహిష్కరించడమే కాక తాగునీటి పైపులైన్ తొలగించి, వారి ఇంటికి ఎవరూ వెళ్లొద్దని చాటింపు వేయించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం రాచన్నగూడెంలో ఈ ఘటన జరిగింది. రాచన్న గూడెంకు చెందిన గిరిజనుడు పెనుబల్లి శ్రీనివాస్.. తన తల్లిదండ్రులు, తమ్ముడు, తాత పోతంరాజుతో కలసి ఉంటున్నాడు. ఆయనకు దమ్మపేట మండలం ఎర్రగుంపు గ్రామానికి చెందిన శారదతో వివాహం జరిగింది. అయితే, మనస్పర్థలతో శారద ఏడాది కిందట పుట్టింటికి వెళ్లిపోయింది. కాగా, నెల క్రితం శ్రీనివాస్ కూడా అక్కడకే వెళ్లి కూలీ పనులు చేసుకుంటున్నాడు. ఈనెల 10న శ్రీనివాస్ తాత కన్నుమూయగా.. శారదతో కలసి అతను రాచన్నగూడెం తిరిగి వచ్చాడు. తమకు చెప్పకుండా భార్య వద్దకు వెళ్లిపోవడమేకాకుండా ఆమెను తిరిగి తీసుకువచ్చాడని కులపెద్దలు పంచాయితీ పెట్టారు. ఈ మేరకు రూ.1.5 లక్షల జరిమానా కట్టాలని తీర్పు చెప్పగా, రూ.20 వేలు మాత్రమే చెల్లించగలమని శ్రీను చెప్పాడు. దీంతో కుల పెద్దల సమక్షంలోనే బాధితులపై కొందరు దాడి చేసి జరిమానా మొత్తం చెల్లించాలని హుకుం జారీ చేశారు. ఇంటి తాగునీటి పైపులైన్ తొలగించారు. కరెంట్ కూడా నిలిపివేస్తామని హెచ్చరించి.. శ్రీను ఇంటికి ఎవరూ వెళ్లొద్దని చాటింపు వేయించారు. దీంతో బాధిత కుటుంబం బుధవారం పోలీ సులను ఆశ్రయించగా సర్పంచ్‌కు చెప్పి తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. కానీ, గురువారం చిన్నకర్మ చేస్తుండగా వచ్చిన గ్రామస్తులు మళ్లీ నీటి సరఫరా నిలిపివేశారు. దీంతో బాధితులు శుక్రవారం మళ్లీ పోలీసులను ఆశ్రయించారు. ఈ విషయమై ఎస్సై సురేశ్‌ను వివ రణ కోరగా శనివారం విచారణ చేపడతామని తెలిపారు.

భౌగోళికంగా విడిపోయినా మనసులు కలిసే ఉన్నాయి

అమరావతి ఉద్యోగ సంఘాల నేతలతో శ్రీనివాస్‌గౌడ్ భేటీ



శ్రీనివాస్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ఏపీ ఉద్యోగ సంఘాల నేతలు

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ భౌగోళికంగా విడిపోయినప్పటికీ మన మనసులు కలిసే ఉన్నాయని తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. తెలుగు ప్రజలకు మంత్రి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం విజయవాడ కనకదుర్గ అమ్మవారిని కుటుంబ సమేతంగా వెళ్లి సందర్శించుకున్న శ్రీనివాస్‌గౌడ్ దర్శించుకున్నారు. అనంతరం రెవెన్యూ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏపీలోని జేఏసీ, అమరావతి ఉద్యోగుల సంఘాల నాయకులు బొప్పరాజు, వైవీ రావు తదితరులు మంత్రిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ... ఉమ్మడి రాష్ట్రంలో చిరకాల మిత్రుడు బొప్పరాజుతో కలసి కొన్ని దశాబ్దాలు ఉద్యోగ సమస్యలపై కలసి పనిచేశామని గుర్తు చేశారు. ప్రభు త్వంతో ఘర్షణ వైఖరి లేకుండా సమస్యలను ప్రభుత్వ పెద్దల దృష్టికి, ఉన్నతాధి కారుల దృష్టికి తీసుకొని వెళుతూ పరిష్కారానికి కృషి చేస్తున్నారని కొనియాడారు. తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశవ్యాప్తంగా అమలు కావాలనే సంకల్పం విజయ వంతం కావాలని, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు భగవంతుడు మరింత శక్తినివ్వాలని అమ్మవారిని కోరుకున్నట్లు మంత్రి తెలిపారు.

తాత్కాలికమైన సుఖదుఃఖాలు వేసవి, శీతాకాలాల లాగా వచ్చిపోయే అశాశ్వతమైనవి. కాబట్టి ఇంద్రియానుభవం వలన కలిగే అటువంటి మార్పులకు కలత చెందక సహించడం నేర్చుకోవాలి.

– హైందవ ధర్మం

సాక్షి

శనివారం, జనవరి, 14

కాటేస్తున్న 'రహస్యాలు'!

అమెరికాలో మొన్న నవంబర్ మధ్యంతర ఎన్నికలు డెమొక్రాటిక్ పార్టీకి అంచనాలకు మించిన విజయాలనందించాయి. ఇప్పుడిప్పుడే ద్రవ్యోల్బణం సద్దుమణిగిన జాడలు కనిపిస్తున్నాయి. ఆర్థిక రంగం అంతో ఇంతో పుంజుకుంటున్నదని కూడా అంటున్నారు. ఈ విజయోత్సాహంతోనే కావొచ్చు... రెండోసారి సైతం తానే డెమొక్రాటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థినని అధ్యక్షుడు జో బైడెన్ ఢంకా బజాయిస్తున్నారు. ఇంతటి శుభ తరుణంలో ఉరుము లేని పిడుగులా 'రహస్యపత్రాలు' బయటికొస్తూ బైడెన్‌ను ఇరుకున పడేస్తున్నాయి. ఎన్నో వివాదాలకు కేంద్ర బిందువై రెండేళ్లక్రితం అధ్యక్ష ఎన్నికల్లో ఓటమిపాలై నిష్క్రమించిన డోనాల్డ్ ట్రంప్ పోతూ పోతూ అత్యంత రహస్యమైన ఫైళ్లను సంగ్రహించారన్న ఆరోపణలు ఏడాదిన్నర క్రితం గుప్పుమన్నాయి. ఆ వ్యవహారంపై విచారణ సాగుతోంది. ట్రంప్ ఎస్టేట్‌లో, ఆయన కార్యాలయాల్లో అటువంటి రహస్యపత్రాలు దొరికాయి కూడా. ఆ మరకను ఎలా వదుల్చుకోవాలో తెలియక రిపబ్లికన్‌లు కకావికలవుతున్న తరుణంలో బైడెన్ సైతం ఆ తానులోని ముక్కేనని వెల్లడికావటం డెమొక్రాట్లకు సహజంగానే దుర్వార్త. ప్రజలిచ్చిన అధికారాన్ని బాధ్యతగా భావించక స్వప్రయోజనాలు నెరవేర్చుకునే సాధనంగా పరిగణించేవారే చట్టాలను బేఖాతరు చేస్తారు. నిబంధనలు అతిక్రమించి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తారు. ట్రంప్, బైడెన్‌లిద్దరూ ఆ పనే చేశారా అన్నది ఇప్పుడు తేలాల్సిన ప్రశ్న. వాషింగ్టన్‌లోని బైడెన్ కార్యాలయంలో నిరుడు నవంబర్ 2న కొన్ని రహస్యపత్రాలు దొరికాయని గత వారం ఆయన న్యాయవాదులు ప్రకటించారు. 2017లో ఒబామా హయాంలో బైడెన్ ఉపాధ్యక్షుడిగా ఉన్నప్పటి పత్రాలివి. దానిపై రిపబ్లికన్‌లు రచ్చ చేస్తుండగానే విల్మింగ్టన్‌లోని బైడెన్ సొంతింట్లో గురువారం ఆ కాలానికి సంబంధించినవే మరికొన్ని రహస్యపత్రాలు ప్రత్యక్షమయ్యాయి.

ట్రంప్ పుణ్యమా అని అమెరికా సమాజం నిట్టనిలువునా చీలింది. ట్రంప్ ఓటమిని జీర్ణించుకోలేని ఆయన మద్దతుదార్లు ఫలితాలు వెల్లడైనరోజు విధ్వంసానికి తెగించారు. దౌర్జన్యాలకు దిగారు. ఆ ఉదంతంపై విచారణ సాగుతున్న కాలంలోనే ట్రంప్ చేతివాటం బయటికొచ్చింది. అధ్యక్షుడిగా తన పరిశీలనకు వచ్చిన అత్యంత రహస్యమైన పత్రాలను ఆయన కట్టలకొద్దీ పోగేసుకున్నారని వెల్లడైంది. ఈ విషయంలో ట్రంప్‌పై అనర్హత వేటు పడే ప్రమాదమున్నదని కూడా అక్కడి మీడియా కథనాలు చెబుతున్నాయి. ఇప్పుడు బైడెన్‌కూ అలాంటి ప్రారబ్ధమే చుట్టుకుంటుందా? ఎన్ని లోటుపాట్లున్నా ఇప్పటికీ ప్రపంచంలో అగ్రరాజ్యంగానే కొనసాగుతున్న అమెరికాను గత దశాబ్దకాలంగా 'రహస్యపత్రాలు' అడపా దడపా కాటేస్తూనే ఉన్నాయి. అమెరికా రక్షణ విభాగంలో పనిచేస్తున్న చెల్సియా ఎలిజెబెత్ మానింగ్ తొలిసారి 2010లో వికీలీక్స్‌కు అత్యంత కీలకమైన రహస్య ఫైళ్లు అందజేశారు. అందులో ఇరాక్, అఫ్ఘానిస్తాన్‌లలో అమెరికా సైన్యం సాగించిన దురాగతాలకు సంబంధించిన వీడియోలు, అధికారిక పత్రాలు, ఉన్నతస్థాయిలో సాగిన సంభాషణలు వగైరాలున్నాయి. ప్రస్తుతం రష్యాలో తలదాచుకుంటున్న ఎడ్వర్డ్ స్నోడెన్ సైతం అప్పట్లో వివిధ దేశాధినేతలపై అమెరికా రాయబారులు తమ అధ్యక్షుడికి పంపిన కేబుల్స్ లీక్ చేసి ఆ దేశం పరువును పాతాళానికి నెట్టారు. వారి మాదిరిగా ట్రంప్, బైడెన్‌లు రహస్య ఫైళ్లలోని అంశాలు బయటపెట్టి ఉండకపోవచ్చు. కానీ అధికారం వెలగబెట్టినవారు చెల్సియా, స్నోడెన్ మాదిరే సొంతానికి ఫైళ్లు పట్టుకెళ్లారని వెల్లడికావటం అమెరికాను ప్రపంచంలో నవ్వులపాలు చేయదా? ఇప్పుడు డెమొక్రాట్లకు వచ్చిపడిన సమస్యేమంటే... ట్రంప్ చౌర్యం బయటికొచ్చినప్పుడు వారు కాలరెగరేశారు. ఘనమైన రాజకీయ అనుభవం, పాలనకు కావలసిన సమర్థత, జాతీయ భద్రత అంశంలో రాజీపడని తత్వం తమ సొంతమని దండోరా వేశారు. కానీ బైడెన్ 'రహస్యపత్రాల' వ్యవహారం కాస్తా వారి గాలి తీసేసింది.

ట్రంప్ ఎస్టేట్‌లో ఎఫ్‌బీఐ విభాగం రహస్యపత్రాలు పట్టుకున్నప్పుడు 'ఒక దేశాధ్యక్షుడు ఇంత బాధ్యతారహితంగా ఎలా ఉంటార'ని బైడెన్ బోలెడు ఆశ్చర్యపోయారు. ఇప్పుడాయనే ఇరకాటంలో పడ్డారు. రెండుచోట్లా రహస్యపత్రాలే దొరికినా ఇద్దరినీ ఒకేగాటన కట్టొచ్చా? దొరకడంలో సారూప్యత ఉన్నా దొరికిన పత్రాల తీవ్రతలో తేడాలుండొచ్చు. ఆ సంగతి పత్రాల పరిశీలన పూర్తయితే గానీ తేలదు. అలాగే అవి ఎవరెవరి కంటపడ్డాయో కూడా తెలియవలసి ఉంది. ట్రంప్ దగ్గర 33 బాక్సుల్లోపట్టేన్ని పత్రాలు దొరికితే అందులో అనేకపత్రాలు 'టాప్ సీక్రెట్'కు సంబంధించినవి. బైడెన్ దగ్గర సంఖ్యరీత్యా ఇంతవరకూ దొరికినవి తక్కువ. పైగా 'మీ హయాంలోని రహస్యపత్రాలు తీసుకుపోయారట. వాటిని తక్షణం మాకు అప్పగించండ'ని జాతీయ పత్రాల భాండాగారం ఏడాదిగా కోరుతున్నా ట్రంప్ బేఖాతరు చేశారు. న్యాయశాఖను కూడా ఆయన లెక్క చేయలేదు. అందుకే ఎఫ్‌బీఐను ఉరికించాల్సివచ్చింది. ఇక బైడెన్ న్యాయవాదులు స్వచ్ఛందంగానే పత్రాలు అప్పగించినా వారి వ్యవహారశైలిలో దోషముంది. రెండునెలలపాటు వాటి సంగతి దాచి ఉంచారు. గత నెల 20న న్యాయశాఖకు చెప్పినా ఆ శాఖ సైతం మూగనోము పాటించింది. చివరకు గత సోమవారం బయటపెట్టింది. ట్రంప్‌ను ఎలాగైనా శిక్షింపజేయాలని చూస్తున్న అటార్నీ జనరల్ మెరిక్ గార్లాండ్‌కు తాజా పరిణామం మింగుడుపడనిదే. ఇప్పుడు రాబర్ట్ కె. హర్ నేతృత్వంలో సాగబోయే విచారణ బైడెన్ భవితనూ, డెమొక్రాట్ల రాతనూ నిర్ణయిస్తుంది. చేసుకున్నవారికి చేసుకున్నంత!

కులగణనే సమస్యలకు పరిష్కారం

విశ్లేషణ



డా॥ కత్తి పద్మారావు

భారత దేశ సామాజిక, ఆర్థిక వ్యవస్థలు నిచ్చెన మెట్ల కుల వ్యవస్థపై ఆధారపడి నిర్మితమయ్యాయి. భూమి మీద ఎవరికైతే హక్కు ఉందో వారే రాజ్యాధికారాన్నీ అనుభవించే పరిస్థితి ఇక్కడ నెలకొని ఉంది. అయితే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య వంటి పై మూడు ఆధిపత్య కులాలవారితో పాటూ శూద్రులైన కొన్ని కులాల వారూ సంపదనూ, రాజ్యాధికారాన్నీ అనుభవించ గలుగుతున్నారు. అయితే రాజ్యాధికారంతో పాటూ దేశ సంపదను కులాల దామాషా ప్రకారం ఎవరికి దక్కాల్సింది వారికి దక్కినప్పుడే... రాజ్యాంగం ఇచ్చిన సమానత్వ హక్కుకు సార్థకత్వం చేకూరుతుంది. ఇందుకు దేశంలో ఏ కులంవారు ఎంత మంది ఉన్నారనే లెక్కలు అవసరం. అందుకే కుల గణనను ప్రభుత్వం తక్షణం చేపట్టాలి.

భారతదేశంలో సాంఘిక అసమానతలు తగ్గాలంటే కుల గణనతో పాటు కుల సంపద గణన కూడా జరగాల్సి ఉంది. బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఈ కులగణనకు పూనుకోవడం అందుకు 500 కోట్లు కేటాయించడం ఒక సామాజిక పరిణామానికి తప్పక దోహదం చేస్తుంది.

అంబేడ్కర్, లోహియాలు ఇరువురూ ఈ కులగణన విషయంలో గట్టిగా పట్టుపట్టారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు అందరూ హిందువులే అనే వాదనలో బ్రాహ్మణవాదం ఉంది అని వీరు పసిగట్టారు. అది ఒక సందర్భంలో ఎస్సీలను హరిజనులు లేదా దేవుని బిడ్డలు అని చెప్పినప్పుడు అంబేడ్కర్ అంటరానివారు దేవుని బిడ్డలు అయితే మరి మిగిలిన వారందరూ దెయ్యం బిడ్డలా అని ప్రశ్నించాడు. ఈ సందర్భంలో మాట్లాడుతూ ఇప్పటికైనా భారతదేశాన్ని మనం మార్చుకోవాలి. సామాజిక న్యాయాన్ని పాలనలో తీసుకురావాలంటే తప్పకుండా కులగణన జరగాలి.

అందరికీ భూమి హక్కు వచ్చినప్పుడే సమానత చేకూరుతుంది. వ్యవసాయం ప్రభుత్వ పరిశ్రమగా ఉండాలి. ప్రభుత్వాధీనంలోకి దేశంలోని భూమిని తీసుకురావాలి. అప్పుడే భూస్వామి, భూమిలేని పేద వ్యవసాయ కూలీ, కౌలుదారు అనే భేదాలు తొలగి పోతాయన్నాడు అంబేడ్కర్. హిందూ మత భావన జాతి వ్యతిరేకమైనదని ఆయన ప్రకటించాడు. సాంఘిక, ఆర్థిక ప్రజాస్వామ్యం లేకుండా రాజకీయ ప్రజాస్వామ్యానికి మనుగడ లేదు అని ప్రకటించాడు. దేన్నైనా అమ్ముకోండి గానీ ఆత్మాభిమానాన్ని మాత్రం అమ్ముకోవద్దని శూద్రులకు, అతిశూద్రులకు చాటి చెప్పాడు.

నిజానికి బిహార్ బౌద్ధ భూమి. అక్కడ బీసీలుగా చెప్పబడుతున్న అనేక కులాల వారు కొన్ని శతాబ్దాలు బౌద్ధులే. భారతదేశంలో ఉన్న శిల్పాలన్నీ దళితులు, బౌద్ధులు చెక్కారు. నిజానికి భారతదేశంలో దళితులు, బహుజనులు కొన్ని శతాబ్దాలు బౌద్ధంలోనే ఉన్నారు. పైగా వారు బౌద్ధ కవులుగా, బౌద్ధ తాత్వికులుగా, బౌద్ధ శిల్పులుగా, బౌద్ధ భిక్షువులుగా జీవించారు. బీసీలు హిందువులుగా మారింది క్రీ.శ. 6వ శతాబ్దం తరువాతే. క్రీ.శ. 6వ శతాబ్దం ప్రాంతంలో భాగవతాన్ని సృష్టించారు. అందులో కృష్ణుని పాత్ర సృష్టించారు. కృష్ణుడు యాదవుడని బహు భార్యాత్వాన్ని ఆయనకి ఆపాదించారు. భగవద్గీతను కూడా ఆయన చేత చెప్పించారు. అప్పటి నుండే యాదవులు హిందువులుగా మారడం ప్రారంభించారు. భగవద్గీత బుద్ధుని పరిణామ వాదానికీ, ప్రకృతివాదానికీ భిన్నంగా చెప్పబడింది. బుద్ధుడు ఏదీ నిత్యం కాదనీ, మిశ్రతమైనదేదీ శాశ్వతం కాదని చెప్పాడు.

ఆ అంశాన్ని వివరిస్తూ అంబేడ్కర్ దీనికి అసంగుని వివరణ ఇలా ఇచ్చారు. ''ఒక దాని ఆధారంగా మరొకటి ఏర్పడిన మిశ్రమంలో ఏ ఒక్కటీ స్వయం శక్తి కలిగి ఉండజాలదు. మిశ్రమం విడిపోయినప్పుడు అందలి ధాతువులు సహితం నాశనమైపోవడం అనివార్యం అవుతుంది.'' మన్ను, నీరు, నిప్పు, వాయువుల మిశ్రమమే జీవి. ఈ నాలుగు ధాతువులు విడిపోయినప్పుడు జీవి విగతమౌతుందనీ, దానినే మిశ్రమ పదార్థ అనిత్యతత్వం అంటారనీ, 'ఒక వ్యక్తి శాశ్వతమెలా అవుతాడన్నది'' ఈ శాస్త్రం వివరిస్తుందని అంబేడ్కర్ శాస్త్రీయంగా క్రోడీకరించాడు.



నిజానికి యాదవులు వ్యవసాయ కులం గొర్రెల కాపరులుగా ఉన్నారు. భగవద్గీత వచ్చాక వారిలో భూస్వామ్య ఆధిపత్యం వచ్చింది. బౌద్ధ భావం తగ్గింది. నిజానికి కమ్మరి, కుమ్మరి, చాకలి, మంగలి వారంతా శాతవాహనులుగా, రజకులుగా, నాయీ బ్రాహ్మణులుగా తమనుతాము ఆర్యీకరించుకోవడం, బ్రాహ్మణీకరించుకోవడం; భాగవత, రామాయణ, భారతాల కథలు బుర్రలకు ఎక్కించుకొన్నాకే జరిగింది. అలా బీసీ కులాల వారు హిందువులుగా మారారు. జ్యోతిరావు పూలే బీసీలు హిందువులు కాదని చెప్పడం గమనార్హం.

భూమిపై ఆధిపత్యం ఉన్నవారు ఆధిపత్య కులాలుగా అవతరించారు. వారే అధికారాన్ని చేపట్టగలుగుతున్నారు. బ్రాహణ, క్షత్రియ, వైశ్య కులాలవారితో పాటూ కొందరు శూద్రకులాలలో ఆధిపత్య కులాల స్థాయికి చేరినవారూ (తెలుగు రాష్ట్రాల్లో కమ్మ, రెడ్డి; బిహార్‌లో యాదవ) అధికార పీఠం ఎక్కగలుగుతున్నారు. వీరిదగ్గరే సంపద పోగుపడిపోతున్నది. కూలినాలీ చేసుకొనే వారికి 40 కోట్ల మందికి ఇళ్లే లేవు. ఆధిపత్య కులాలవారి సంపద తేలితేనే సమ సమాజ రూపకల్పనకు ప్రణాళిక రూపొందించుకునే వీలుంది. అయితే భూమి పంచడానికీ, ఇతర సంపద పంచడానికీ ఆధిపత్య కులాలు సిద్ధంగా లేవు. కాగా నామమాత్రపు రిజర్వేషన్లకు ఈర్ష్య పడుతున్నారు.

బిహార్ జనాభా పన్నెండు కోట్ల 70 లక్షల మంది. 16 శాతం ఎస్సీలు, 48 శాతం ఓబీసీలు, 17 శాతం ముస్లింలు, 1.28 శాతం ఎస్టీలు జీవిస్తున్నారు. తాజా జనగణన తర్వాత కులాల శాతాలు కూడా బయటకు వస్తాయి. భారతదేశంలో 1871లోనే బ్రిటిష్ ప్రభుత్వం ఎందుకు కులగణన చేపట్టింది? బ్రిటిష్‌వాళ్లకు భారతీయ కులవ్యవస్థపై ఒక అవగాహన వస్తే కానీ వారు ఇక్కడ మనలేరు. బహుశా అందుకే కులగణన చేసి ఉంటారు. ఈ కుల గణన వల్ల శూద్రులకు, అతి శూద్రులకు సామాజిక స్పృహ వస్తుందని మహాత్మా పూలే నడిపిన సత్యశోధక్ సమాజ్ పేర్కొంది.

అంబేడ్కర్ ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్, బీజేపీ అంతర్యాన్ని కనిపెట్టాడు. రాముడు వర్ణాశ్రమ ధర్మాన్ని రక్షించడం కోసం శంబూకుణ్ణి చంపాడు కాబట్టి అన్ని విశ్వవిద్యాలయాల్లో శూద్ర, అతిశూద్ర, మైనార్టీలపై దాడులు జరుగుతున్నాయి. తామే చదువుకోవాలి, ఇంకొకరు చదువుకోకూడదు. తమకే భూములుండాలి, మరొకరికి ఉండకూడదు; తమకే రాజ్యాధిపత్యం ఉండాలి, వేరే వారికి ఉండకూడదు అనే మనువాద భావాలను బాగా నమ్ముతున్నారు కనుక ఇటువంటి దాడులకు వారు తెగబడుతున్నారు ఆధిపత్య కులాల వారు. ఈ భావాలు ఏ కులం వారికి ఉన్నా అవి రాజ్యాంగ విరుద్ధమైనవే. రాజ్యాంగానికి వ్యతిరేకంగా జీవిస్తున్న అగ్రవర్ణ ఆధిపత్య బ్రాహ్మణవాదులు నిషేధిత సంస్థల నుండి ఆవిర్భవించినవారే వీరంతా. వారెప్పుడూ రాజ్యాంగానికి బాధ్యులుగా లేరు. రాజ్యాంగాన్ని ఉల్లంఘించే మార్గంలో వారు నడుస్తున్నారు. మాట్లాడే స్వేచ్ఛను రాజ్యాంగం ఇచ్చిందని వారికి తెలియదు.

ఈ మనువాదానికి పూర్తిగా వ్యతిరేకంగా ఉండే బౌద్ధాన్ని అంబేడ్కర్, లోహియా, మహాత్మాపూలే, పెరియార్ రామస్వామి నాయకర్ అనుసరించారు. ఇప్పుడు మనం బౌద్ధ భారతాన్ని నిర్మించుకోవాలి. బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీలు ఉత్పత్తి శక్తులు. వారిని పేదరికంలో ఉంచి, వారిని దుఃఖంలో ఉంచి ఎవరైనా రాజ్యాంగేతరులుగా పరిపాలించాలని అనుకుంటే అది వట్టి భ్రమే. రాజ్యాంగంలోని 15వ ఆర్టికల్ ఈ విధంగా చెబుతుంది. కుల, మత, లింగ, పుట్టిన ప్రదేశం కారణాలుగా వివక్షకు తావులేదు.1) కేవలం మతం, జాతి, కులం, లింగం, పుట్టిన ప్రదేశం లేక వాటిలో కొన్నింటి ప్రాతిపదికపై ఏ వ్యక్తినీ ప్రభుత్వం వివక్షకు గురి చేయరాదు. 2) కేవలం, మతం, జాతి, కులం, లింగం పుట్టిన ప్రదేశం లేక వాటిలో కొన్నింటి ప్రాతిపదికపై పౌరులెవరికీ హక్కులను నిరాకరించటం, నియంత్రించటం, అర్హత లేకుండా చేయడం గాని చేయరాదు.

భారతదేశ పునర్నిర్మాణానికి భారత రాజ్యాంగమే గీటురాయి. మతతత్వవాదులు తప్పక ఓడిపోతారు. ఒక మతం భారతదేశాన్ని ఎప్పటికీ పరిపాలించలేదు. ఒక కులం భారతదేశాన్ని ఎప్పటికీ పరిపాలించలేదు. భారతదేశం అంతర్గతంగా తీవ్రమైన సామాజిక, సాంస్కృతిక, సాంకేతిక విద్యాపరమైన మార్పుకు గురవుతూ వస్తుంది. దళిత బహుజన మైనార్టీలు లౌకికవాదులు ఏకమై సమ సమాజ నిర్మాణానికి పోరాడాల్సిన యుగమిది. కులగణనే కాదు కులసంపద గణన కూడా జరగాల్సిందే. భారతదేశంలో ప్రజలందరూ సమానంగా బతికే రోజు కోసం పోరాడాల్సిందే. అదే అంబేడ్కర్, పూలే మార్గం.

వ్యాసకర్త దళిత ఉద్యమ నేత । 98497 41695

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

బాగా పనికొస్తుంది



గత ఎనిమిదేళ్లలో సుప్రీంకోర్టు ట్రాక్ రికార్డు తనను నిరాశ పరిచిందని ఆ అత్యున్నత న్యాయస్థానం మాజీ న్యాయమూర్తి గోపాల గౌడ అన్నారు. జ్ఞానవాపి, తదితర మసీదులపై దావా వేయడానికి అయోధ్య తీర్పు.. 'తగినవిధంగా ప్రతిస్పందించే శక్తులకు' మరింత బలం చేకూర్చిందని కూడా ఆయన అభిప్రాయపడ్డారు.

– రాణా ఆయూబ్, జర్నలిస్ట్

వర్ణ వివక్షా?! మీకెంత ధైర్యం!



అరబ్బులు అధికంగా నివసించే ఇజ్రాయిల్ పట్టణం నెగెవ్‌లో ఒక అరబ్ కనుక ఇల్లు కొనడానికి ప్రయత్నిస్తే, ఆ అమ్మకాన్ని నిలిపివేస్తానని నెగెవ్ మేయర్ అంటున్నారు! ఇజ్రాయిల్‌లోని పాలస్తీనా పౌరులను ఆయన లోపలి నుంచి తినేసే చెదపురుగుల్లా చూస్తున్నారు!

– ముహమ్మద్ షెదాదా, యూరో కామన్ రైట్స్ చీఫ్

అంత 'ఫాస్ట్' వద్దు



మంచి ఆహారం పొలాల నుంచి వస్తుంది. వంటగదుల్లో తయారౌతుంది. వండేందుకు సమయం పడుతుంది. సరైన రీతిలో నిల్వ చేయక పోతే చెడిపోతుంది. ఇంత పని ఉంటుంది. కేవలం రెండు నిమిషాల్లో రెడీ అయ్యేది వ్యక్తులకు మంచిది కాదు. గ్రహానికీ మేలు కాదు. పిల్లల్ని ఆరోగ్యకరంగా పెంచాలనుకుంటున్నారా? అయితే వారికి వంట చేయడం నేర్పండి.

– రుజుతా దివేకర్, న్యూట్రిషనిస్ట్

అంతుచిక్కడం లేదు



వాస్తవ నియంత్రణ రేఖ వెంబడి ఉద్రిక్తతల ప్రస్తుతస్థితిపై భారత ఆర్మీ చీఫ్.. "నిలకడగా ఉంది. నియంత్రణలో ఉంది. కానీ అనూహ్యంగా ఉంది. భారత–చైనా సరిహద్దుల్లో ఎలాంటి ఆకస్మిక పరిణామాల నైనా ఎదుర్కొనేందుకు ఉన్నత ప్రమాణాలతో కూడిన సన్నాహాలతో సిద్ధంగా ఉన్నాం.." అన్నారు! ఏమిటి దీనర్థం!

– సనా హాష్మీ, పోస్ట్ డాక్టొరల్ ఫెలో

సారాంశం

నరికొండ చలపతి

రుణ... పురాణం!



ఇండియన్ 'లోన్'

మోదీకి ముందున్న 14 మంది ప్రధానులు చేసిన అప్పు రూ. 56 లక్షల కోట్లయితే, మోదీ ఎనిమిదిన్నరేళ్లలో రూ. 100 లక్షల కోట్లు అప్పు చేశారు. పుట్టబోయే ప్రతి బిడ్డపై 1.25 లక్షల రూపాయల రుణభారం మోపారు. – **కేటీఆర్ కామెంట్**

....

కౌంటర్.. 'స్టేట్'మెంట్

తెలంగాణ అప్పు రూ. 3.12 లక్షల కోట్లయ్యింది. రెండేళ్లలోనే బీఆర్ఎస్ సర్కారు రూ. 87 వేల కోట్ల అప్పును చేసింది. బంగారు తెలంగాణను అప్పుల తెలంగాణగా మార్చారు. మన పిల్లలకు అప్పు మిగులుస్తున్నారు. సరాసరి తలసరి రూ. 94 వేల అప్పును మోపుతున్నారు

– బండి సంజయ్, కిషన్‌రెడ్డి విమర్శలు

....

అప్పుల 'మధ్య'తరగతి..

''కాళ్లు తడవకుండా సముద్రాన్ని దాటవచ్చేమో గానీ, కళ్లు తడవకుండా జీవితాన్ని దాటలేం..'' అంటారు..

కళ్ల తడి కామన్ కానీ, ఈ రోజుల్లో అసలు అప్పు చేయకుండా జీవితం దాటనేలేం. కుటుంబాలన్నీ అప్పుల కుప్పలే.

'ఈఎంఐ'.. అని రుణాల పేరు పోష్‌గా మారిందంతే. వాయిదాల్లేకుండా బతికేదెవ్వరు.. ఇంటికి, బండికి, చదువుకు, పెళ్లికి.. చిట్‌లు.. ఒక్కటేమిటి ముఖ్యంగా మధ్యతరగతి బతుకంటేనే అప్పులు కదా...!

చిన్నప్పుడు 'తీసివేతలు' నేర్పుతున్నప్పుడు లెక్కల మాస్టారు 'ఒకటి అప్పు తీసుకోరా ..' అని ఎప్పటి నుంచి చెప్పారో, అప్పటినుంచి బతుకు లెక్కంతా అప్పులే. రుణాలు తీసుకుంటూనే ఉన్నాం. వడ్డీలు, కిస్తులు కడుతూనే ఉన్నాం.

అప్పు గొప్పే...

రిచ్ క్లాస్‌లో ఇదేం నామోషీ కాదు. అంబానీ నుంచి అదానీ దాకా అపరకుబేరులైనా అప్పు చేయాల్సిందే. నిజానికి ఇలాంటి వారికే ఎక్కువ అప్పు లిస్తారు కూడా. ఈ రేంజ్‌లో ఉన్న వారికి రెడ్ కార్పెట్ వేసి అప్పులిచ్చి గౌరవించడం, ఎగ్గొడితే ఫ్లయిట్లలో విదేశాలకు పంపడం కూడా మనకు తెలిసిందే కదా..

అప్పుకు మారుపేరైన.. 'ఈఎంఐ'ల్లో పుట్టి (హాస్పిటల్ చార్జీలు కూడా ఈఎంఐలో కట్టేంతగా ఉంటాయి), ఈఎంఐల్లో పెరిగి, ఈఎంఐలతో చదువుకుని, ఈఎంఐల్లో పోవడమే మధ్య, పేద తరగతి జీవితం.

కానీ, అప్పుల్లోనూ అంత ఖదర్‌గా బతికే బిజినెస్, రిచ్ క్లాసూ ఉంది.

రుణ.. పురాణం

నిజానికి ఈ అప్పు లొల్లి, అప్పుల్లోనూ పేద ధనిక తారతమ్యం పురాణాల కాలం నుంచీ ఉన్నట్టుంది.

బూడిద పూసుకుని , కనీసం ఒంటిపై బ్రాండెడ్ బట్టల్లేకుండా పులి చర్మాలు, నారచీరలు ధరించి శ్మశానాల్లో తిరుగుతూ ఉండే 'శంకరుడి'కి కుబేరుడెప్పుడయినా లోన్ ఆఫర్ చేసిన సందర్భాలు కనిపిస్తాయా..? గడ్డ కట్టుకుపోయే చలిలో హిమాలయాల్లో నివసించే శివుడు కనీసం 'హోమ్‌లోన్'కు అప్లయి చేసుకున్న దాఖలాలూ లేవు. యుగాల తరబడి అదే నందీశ్వరుడిని యూజ్ చేశాడే కానీ, ఎవరైనా శివుడికి 'వెహికల్ లోన్' అరేంజ్ చేశారా..? పుష్పక విమానంలో తిరిగే కుబేరుడు ఆఫర్ చేశాడా.. ఎందుకంటే ఆయన పేద దేవుడు. పైగా ఎవరేం అడిగినా ఇచ్చేసే భోళా శంకరుడాయే.. 'కొల్లాటరల్ సెక్యూరిటీ' చూపే శక్తి లేదు. ప్రధానుల, ముఖ్యమంత్రుల రికమండేషన్ కూడా లేనట్టుంది.

... ఇప్పటి మన రైతులు, పేదోళ్ల పరిస్థితిలాగా!

అదే, విష్ణుమూర్తిని చూడండి. ఆయన మ్యారేజీకి కుబేరుడు ఎంత డబ్బిచ్చాడు! తిరుపతి వెంకన్న ఇంకా కిస్తులు కడుతూనే ఉన్నాడు. ఆయనకు ఆ అప్పెలా వచ్చింది. ఆ అప్పు ఎందుకు తప్పు కాలేదు..? ఎందుకంటే ఆయన బాగా రిచ్చి. స్వయంగా లక్ష్మీదేవియే అర్ధాంగి. దేవుళ్లలో బాగా పలుకుబడి ఉన్నవాడు. ఘనంగా అల వైకుంఠ

పురంలో ఆ మూల సౌధాల్లో నివసిస్తాడు. పెద్దోళ్లందరికీ కావలసినవాడు. ఇంకేం ఎంతైనా అప్పు పుట్టుద్ది... మన రిచ్ పీపుల్ లాగా.

– ఇక మన ఆర్థిక మంత్రి సీతారామన్ లాంటి వాళ్లెవరైనా ఉంటే దేవుళ్లలో ఇప్పటికే వెంకన్న రుణం అంతా 'రైటాఫ్ ' అయిపోయేది.

అప్పు.. సంపన్నం

ఇది చూడండి.. మనం ఆరాధనగా చూసే అమెరికా, సింగపూర్ తలసరి అప్పులు ఎక్కువే. అక్కడ సింగపూర్‌లో ఒక్కొక్కరిపై 97.46 లక్షల రూపాయల అప్పులు ఉన్నాయి. జపాన్ , కెనడా, బెల్జియం వంటి సంపన్న దేశాల వారి తలసరి అప్పులు ఎక్కువ. రిచ్‌నెస్ అలా ఉంటది మరి.

అప్పుల్లోనూ.. పూర్

ఆఫ్ఘనిస్థాన్, డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, బురుండి, మడగాస్కర్, లైబీరియా వంటి చిన్న దేశాల్లో తలసరి అప్పు తక్కువే. విదేశాల నుంచి అప్పులు దొరకడం కష్టం. ఆదాయమే సరిగ్గా లేని వాళ్లకు అప్పులెలా ఇస్తారు.. అదీ సంగతి

....

..ఇంతకీ బీఆర్ఎస్‌కైనా, బీజేపీకైనా చెప్పొచ్చేదేమంటే.. **ఎంత అప్పుంటే అంత దర్జా.. ఎంత దర్జా ఉంటే అంత అప్పు...** కనుక 'పకోడు చేసే అప్పులు..' పెరుగుతున్నాయని చింతించవలదు.

డబ్బున్నోడికి అప్పు ఈజీ కదా.. అంటే అప్పుంటే డబ్బు, దర్పం ఉన్నట్టే కదా! అంటే మనం బాగానే ఉన్నాం అనుకుంటే సరి.

....

కానీ, '...మన మీద పడే అప్పులపై ' చింతించే మిడిల్ క్లాస్ ఒకటి ఉందండోయ్..

దేశాలు..
తలసరి అప్పులు (రూ.లలో)

జపాన్	84.4 లక్షలు
గ్రీస్	33.24 లక్షలు
సింగపూర్	97.46 లక్షలు
ఇటలీ	43.91 లక్షలు
అమెరికా	72.46 లక్షలు
కెనడా	47.96 లక్షలు
యూకే	37.01 లక్షలు
ఆఫ్ఘనిస్థాన్	3 వేలు
దక్షిణ సూడాన్	11 వేలు
కాంగో	7 వేలు
బురుండి	14 వేలు
సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్	20 వేలు
మడగాస్కర్	21 వేలు
నైగర్, సాలొమన్ ఐలాండ్స్	24 వేలు

'ఇప్పటికే ఏళ్ల తరబడి ఇంటిలోన్ కడుతున్నాను, ఈ మధ్యే పిల్లాణ్ణి స్కూల్లో వేయడానికి ఓ లక్ష అప్పు చేశాను, కరోనా మింగిన నాలుగు లక్షల తాలూకు అప్పు, వడ్డీ అలాగే ఉన్నాయి. రెండో అమ్మాయి స్కూల్లో చేరడానికి రెడీ అవుతోంది. ఈ ఖర్చులిలా ఉండగా మన 'డబుల్ ఇంజన్ సర్కార్లు' వాళ్లు చేసిన అప్పులన్నీ మన తోనే కట్టిస్తారు.. వాళ్ల జేబు లోంచి కట్టరుగా... అని మా ఆవిడ భయంగా అడుగుతోంది..'

– కేటీఆర్, సంజయ్ పోటాపోటీ 'అప్పుల' విమర్శలు చూసి ఓ నెటిజన్ పోస్టు ఇది.

ఆలోచించదగ్గ ఆందోళనే. అక్కడిదాకా రాకుండా చూడండి. ఇప్పటికే అప్పులు కట్టలేక చస్తున్నాం.

పురోగతికి ఇది ఉత్తరాయణం...

అభిప్రాయం



రమేశ్ హజారి

తూర్పుదిక్కున ఉదయించే సూర్యుడు ఒక ఆరునెలలు ఉత్తరానికీ, మరో ఆరు నెలలు దక్షిణానికీ మరలుతుంటాడు. మకర సంక్రాంతి నుండి మొదలుకొని జూలై నెల రెండో వారం వరకు ఉత్తర దిశగా సాగే సూర్యుని ప్రయాణాన్ని 'ఉత్తరాయణం' అంటారు. దక్షిణాన ఉదయించిన వెలుగులు విరజిమ్మిన సూర్యుడు ఉత్తరం దిశగా నడిచే ఈ ఆర్నెల్ల కాలాన్ని 'పుణ్యకాలం'మని పురాణాలు వివరిస్తాయి.

ప్రకృతి తన ధర్మాన్ని తాను నిర్వర్తిస్తున్న క్రమంలో అనేక మార్పులు చోటు చేసుకుంటుంటాయి. క్రమబద్ధమైన గతితార్కిక పురోగతి ద్వారానే గుణాత్మక మార్పును సాధించడం సాధ్యం. ప్రకృతి మనకు నేర్పేది అదే. ఇదే ప్రాకృతిక ధర్మాన్ని కాలానుగుణంగా అన్వయించుకుంటూ తన గతిని తార్కిక దిశా నిర్దేశంతో ముందుకు కొనసాగించినపుడే సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో గుణాత్మక పురోగతి సాధ్యపడుతుంది. అప్పుడు మాత్రమే విజయం సిద్ధిస్తుంది.

2001 నుంచి తెలంగాణలో కొనసాగిన స్వరాష్ట్రం ఉద్యమం కానీ, ఇప్పుడు చేస్తున్న స్వయం పాలన కానీ ఇవే సామాజిక రాజ కీయ చలన సూత్రాలు, ఇవే ప్రాకృతిక ధర్మాన్ని అనుసరించడం వల్ల సత్ఫలితాలు వచ్చాయి, వస్తున్నాయి. ఒకనాడు తెలంగాణ అన్ని రంగాల్లో వివక్షకు గురయిన ప్రాంతంగా ఉంది. అటువంటి తెలంగాణను కొట్లాడి రాష్ట్రంగా సాధించుకున్నం. అదే ఉద్యమ స్ఫూర్తితో పాలనను కూడా ముఖ్యమంత్రి కేసీఆర్ సాగిస్తున్నారు.



తెలంగాణ క్షేత్రంగా సాధించిన ప్రగతిని దేశవ్యాప్తం చేయాలనే తలంపుతో కేసీఆర్ ముందడుగు వేసిండు. సాగునీటిని అందుకోలేని ఎత్తైత్తు భూములకు నీళ్లందించగలిగారు ముఖ్యమంత్రి ఇలాంటివాటిని ప్రయోగాత్మక కార్యాచరణ ద్వారా సాధించిన పొలిటికల్ ఇంజనీరు మన సీఎం. అభివృద్ధి అంటే ఇట్లా కూడా చేయవచ్చా అని విమర్శకులు సైతం ఆశ్చర్యానికి గురయ్యేలా కొన సాగుతున్న కేసీఆర్ మోడల్ పాలన, తెలంగాణ మోడల్ అభివృద్ధి దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలను విపరీతంగా ఆకట్టుకుంటున్నది. 'మాకూ కేసీఆర్ వంటి ముఖ్యమంత్రి కావాలె' అని దేశంలోని అన్ని వర్గాలూ అంటున్నాయి.

తెలంగాణను అభివృద్ధి చేసి సకల జనులకు కష్టాలను తీర్చిన ఓ తల్లి హృదయం వంటి హృదయం కలిగిన మన సీఎం... వివిధ రాష్ట్రాల్లో ప్రజలు అనుభవిస్తున్న వేదనను స్వయంగా అర్థం చేసుకున్న ప్రజా పాలకుడుగా ఒక గట్టి నిర్ణయం తీసుకున్నడు. తెలంగాణ మాదిరే దేశంలోని సకల జనుల సంక్షేమాన్నీ, అభివృద్ధినీ సాధించాలనే రాజకీయ దృఢ సంకల్పాన్ని తీసుకుని, తెలంగాణ ప్రజల ఆశీర్వాదాలు అందుకుని బీఆర్ఎస్ జెండాను భుజానేసుకుని ముందుకు కదిలిండు. ప్రగతి కాగడాను చేతబట్టి నూతనోత్తేజంతో వెలుగులు వెదజల్లుతూ సంక్రాంతి శోభను సంతరించుకున్న ఉత్తరాయణ సూర్యుడై దేశానికి పుణ్యకాలాన్ని మోసుకొచ్చేందుకు సంక్రాంతి నుంచి ఉత్తరాయణంలోకి ప్రవేశించనున్నడు.

వ్యాసకర్త తెలంగాణ ముఖ్యమంత్రి ప్రజా సంబంధాల అధికారి । 93909 19090

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్‌నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్యమాసం, తిథి: బ.సప్తమి ప.2.30 వరకు, తదుపరి అష్టమి, నక్షత్రం: హస్త ప.2.11 వరకు, తదుపరి చిత్త, వర్జ్యం: రా.10.21 నుండి 11.58 వరకు, దుర్ముహూర్తం: ఉ.6.39 నుండి 8.07 వరకు, అమృతఘడియలు: ఉ.7.52 నుండి 9.31 వరకు, భోగి పండగ: రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు, యమగండం: ప.1.30 నుండి 3.00 వరకు, సూర్యోదయం: 6.38, సూర్యాస్తమయం: 5.39

కంటి 'వెలుగు' కావాలి!

రెండో విడత 'కంటి వెలుగు' మొదలవుతుండటంపై ఆసక్తి

- అద్దాలు, మందులతోపాటు శస్త్రచికిత్సలూ చేయించాలనే విజ్ఞప్తులు
- అప్పట్లో ఇచ్చిన అద్దాలు పనిచేయడం లేదనే ఆవేదన
- కానీ ఈసారి కంటివెలుగు ప్రకటనల్లో కానరాని శస్త్రచికిత్సల ప్రస్తావన
- తొలిదశలో గుర్తించినవారికే ఇంకా పూర్తవని ఆపరేషన్లు
- నాలుగున్నర లక్షల మందికిపైగా ఎదురుచూపులు



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'కంటి వెలుగు' కార్యక్రమం రెండో విడత మొదలవనుండటంతో ప్రజల్లో ఆసక్తి నెలకొంది. గతంలో కంటి పరీక్షలు చేసినప్పుడు ఇచ్చిన అద్దాలు ఇప్పుడు పనిచేయడం లేదని, కొత్తవి ఇవ్వాలన్న విజ్ఞప్తులతోపాటు.. ఆపరేషన్లు అవసరమయ్యే వారికి వెంటనే చేయించేలా ఏర్పాట్లు చేయాలన్న డిమాండ్లు వస్తున్నాయి. కేవలం పరీక్షలు జరిపి అద్దాలు, మందులతో సరిపెట్టవద్దని.. శస్త్రచికిత్స చేయించాలని బాధితులు కోరుతున్నారు.

ఘనంగా ప్రారంభించినా..

రాష్ట్రంలో ప్రజల దృష్టి సమస్యలను నివారించేందుకు ప్రభుత్వం 2018 ఆగస్టు 15న 'కంటి వెలుగు' పథకానికి శ్రీకారం చుట్టింది. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ గణాంకాల ప్రకారం రాష్ట్ర జనాభాలో 25% మంది ఏదో ఒక స్థాయిలో కంటి సమస్యలతో బాధపడుతున్నారన్న విషయాన్ని గుర్తించి ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాలు, వార్డులు, పట్టణాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎనిమిది మందితో కూడిన వైద్యబృందాలు పరీక్షలు చేపట్టాయి. రూ.196.79 కోట్ల వ్యయంతో 826కిపైగా బృందాలతో నాలుగున్నర నెలలపాటు కార్యక్రమం కొనసాగింది. తొలిరోజున 1,09,000 మందిని పరీక్షించారు. గరిష్టంగా ఒక రోజున లక్షన్నర మందికి కంటి పరీక్షలు చేశారు. మొత్తంగా 38 లక్షల మందికిపైగా కంటి పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో అవసరమైన వారికి అద్దాలు, మందులు ఇచ్చారు. ఆరున్నర లక్షల మందికిపైగా శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. ఇందులో మూడో వంతు మందికి ఆపరేషన్లు చేసినా.. ఆస్పత్రుల్లో సిబ్బంది, పరికరాలు, మౌలిక సదుపాయాల కొరత కారణంగా మిగతా వారికి నిర్వహించలేకపోయారు.

ఈసారి ఆపరేషన్లు చేస్తారా?

'కంటి వెలుగు' పథకం రెండో విడత ఈనెల 18న ఖమ్మం వేదికగా మొదలుకానుంది. శస్త్రచికిత్సలు అవసరమయ్యే పలు రకాల కంటి వ్యాధులతో బాధపడేవారు ఈసారి తమకు ఊరట లభిస్తుందనుకున్నా.. అధికారుల తీరుతో ఆందోళన నెలకొంది. 'కంటి వెలుగు'కు సంబంధించిన ప్రకటనల్లో, వివరాల్లో ఎక్కడా శస్త్రచికిత్సల ప్రస్తావన రావడం లేదు. గతంలో చేసిన పరీక్షల ప్రకారమే నాలుగున్నర లక్షల మందికిపైగా శస్త్రచికిత్సల కోసం ఎదురుచూస్తున్నారు. ఈసారి దానికి అదనంగా బాధితుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని, అందువల్ల ఆపరేషన్లు చేయించే విషయంపై స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. మరోవైపు వయసు మీద పడుతున్న కొద్దీ కంటి సమస్యలు తీవ్రమవుతుంటాయని, అందువల్ల ఏటా కంటి పరీక్షలు నిర్వహించాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు.

మసకబారుతున్న చూపు!

క్రితంసారి ఇచ్చిన కంటి అద్దాల్లో చాలామందికి ఇప్పుడవి పనిచేయడం లేదు. వారిలో చూపు మసకబారి దృష్టి లోపాలు పెరిగిపోతున్నాయి. వీరిలో కొందరు శస్త్రచికిత్స అవసరమైన స్థితికి చేరినట్టు అంచనా. కంటిచూపు బాధితుల్లో అధికులు పేద, మధ్య తరగతివారే. వీరిలో కొందరు అప్పోసప్పో చేసి ప్రైవేటులో చికిత్స చేయించుకుంటున్నా.. చాలామందికి ఆపరేషన్ చేయించుకునే స్తోమత లేక అంధత్వం బారిన పడుతున్నారు.

తొలివిడత 'కంటి వెలుగు'లెక్కలివీ..

కార్యక్రమం జరిగినది: ఆగస్టు 15, 2018 నుంచి జనవరి 1, 2019 వరకు
మొత్తం నిధులు: రూ.196.79 కోట్లు
పనిచేసిన సిబ్బంది: 826కిపైగా బృందాలు, 940 మంది మెడికల్ ఆఫీసర్లు, 1,000 మంది కంటి వైద్యులు, 33,000 మందికిపైగా సిబ్బంది
పరీక్షలు చేయించుకున్నవారు: 38,26,000కుపైగా
రీడింగ్ గ్లాసులు పొందినవారు: 18,00,000 మంది
ప్రిస్క్రిప్షన్ గ్లాసులు పొందినవారు: 13,76,000 మంది
శస్త్రచికిత్స అవసరమని గుర్తించినవారు: 6,60,000 మంది
శస్త్రచికిత్స చేయించుకున్న వారు: దాదాపు 2,00,000

అప్పుడిచ్చిన అద్దాలు సరిగా పనిచేయట్లేదు..



ప్రభుత్వం కంటి వెలుగు పథకం కింద కంటి అద్దాలు ఇచ్చింది. అయితే కొన్నిరోజుల నుంచి అవి సరిగా పనిచేయట్లేదు. సరిగా కనిపించడం లేదు. ఆ అద్దాలు పెట్టుకోవట్లేదు. కొత్త అద్దాలు ఇవ్వాలి.

– తోకునూరి నర్సమ్మ, చింతపల్లి, సీరోలు మండలం, మహబూబాబాద్ జిల్లా

ఈసారైనా ఆపరేషన్ చేస్తారో..లేదో!



నాకు ఒక కన్ను పూర్తిగా కనిపించదు. తొలివిడత కంటి వెలుగు కార్యక్రమంలో డాక్టర్లు పరీక్షించి.. ఆపరేషన్ చేయాలని చెప్పారు. ఇంతవరకు చేయలేదు. చాలా ఇబ్బంది అవుతోంది. ఈసారి చేయిస్తామని అధికారులు చెప్తున్నారు. ఇప్పుడైనా అవుతుందో లేదో..

– రంగమ్మ, సోంపురం, కేటీదొడ్డి, జోగుళాంబ గద్వాల జిల్లా

కంటి వెలుగుకు సహకరిస్తాం



ప్రభుత్వం పేదల కోసం మంచి కార్యక్రమం చేపట్టింది. దృష్టి సమస్యల తో బాధపడుతున్న వారికి కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలు అందజేయడం అభినందనీయం. ప్రభుత్వం చేసే ఈ యజ్ఞంలో పాలు పంచుకోవాలని ఉంది. ప్రభుత్వం పిలిస్తే రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటుగా ప్రాక్టీసు చేస్తున్న వేలమంది ఆప్తాల్మాలజిస్టులు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) తరఫున స్వచ్ఛందంగా కంటివెలుగులో సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నారు.

– డాక్టర్ బీఎన్ రావు, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు

ఊరూరా పాతపంటల జాతర

- నేటి నుంచి 28 రోజులపాటు 23 గ్రామాల మీదుగా కొనసాగింపు
- సంగారెడ్డి జిల్లాలో చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన

జహీరాబాద్: పాతపంటలకు కొత్తకళ వస్తోంది. చిరు ప్రాధాన్యం కలిగిన చిరుధాన్యం ఇప్పుడు అంతర్జాతీయ ప్రాధాన్యం సంతరించుకుంది. ఐక్యరాజ్యసమితి ఈ ఏడాదిని చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించడంతో అందరూ పాతపంటలైన చిరుధాన్యాల వైపు దృష్టి సారిస్తున్నారు. ఈ నేపథ్యంలో సంగారెడ్డి జిల్లాలో 28 రోజులపాటు 23 గ్రామాల మీదుగా డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ(డీడీఎస్) ఆధ్వర్యంలో 23వ పాతపంటల జాతర సాగనుంది. సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం జాంగార్‌బౌలి తండా నుంచి జాతర ప్రారంభమై ఫిబ్రవరి 11న ఝరాసంగం మండలం మాచ్‌నూర్‌లో ముగియనుంది. ఎడ్లబండ్లలో చిరుధాన్యాలను ప్రదర్శిస్తూ ప్రజల్లో అవగాహన కల్పించనున్నట్లు డీడీఎస్ డైరెక్టర్ పీవీ సతీశ్ వివరించారు. సమృద్ధి పోషకాలతో కూడిన చిరుధాన్యాల సాగును ప్రోత్సహించి, అవగాహన కల్పించేందుకు రైతులు, మహిళలతో ఆయా శాఖల అధికారులు, వ్యవసాయ నిపుణులు సమావేశాలు నిర్వహిస్తారు. జహీరాబాద్ మండలం పస్తాపూర్‌లో ఏర్పాటు చేసిన సంఘంలో ఐదువేల మంది మహిళారైతులు సజ్జ, కొర్ర, తైద, సామ, పెసర, మినుము, అవిశ తదితర 30 నుంచి సుమారు 50 రకాల చిరుధాన్యాలను పండిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. చిరుధాన్యాల ఆవశ్యకత, సేంద్రియ విధానంలో సాగు, పెట్టుబడి వ్యయం తగ్గించేందుకు జహీరాబాద్, కోహీర్, ఝరాసంగం, న్యాల్‌కల్, మొగుడంపల్లి, రాయికోడ్ మండలాల్లోని 70 గ్రామాల్లో డీడీఎస్ కొంతకాలంగా అవగాహన కల్పిస్తోంది. ఝరాసంగం మండలం మాచ్‌నూర్‌లో 50 నుంచి 60 రకాల విత్తనాలతో చిరుధాన్యాల విత్తన బ్యాంకును నిర్వహిస్తున్నారు. రైతులు పండించిన పంటలో నాణ్యమైనవాటిని విత్తనంగా సేకరించి నిల్వచేసి వానాకాలం, యాసంగిలో సాగు చేస్తున్నారు.

పాతపంటల జాతర షెడ్యూల్

ఈ నెల 14వ తేదీన మొగుడంపల్లి మండలం జాంగార్‌బౌలి తండాలో పాత పంటల జాతర ప్రారంభం అవుతుంది. 16న మన్నాపూర్, 17న ఉప్పర్‌పల్లి తండా, 18న జాడీ మల్కాపూర్, 19న లచ్చునాయక్ తండా, 20న జీడిగడ్డ తండా, 21న అర్జున్‌నాయక్ తండా, మోడ్ తండా, 23న జహీరాబాద్, 24న శేఖాపూర్ తండా, జంలైతండా, 25న శేఖాపూర్, 26న కోహీర్ మండలం గొటిగార్‌పల్లి, 27న బిలాల్‌పూర్, 28న ఝరాసంగం మండలం చిల్కెపల్లి, 30న బిడకన్నె, ఫిబ్రవరి 1న ఝరాసంగం, 2న పొట్‌పల్లి, 3న న్యాల్‌కల్ మండలం రేజింతల్, 4న హలాసెల్లి, గుంజోటి, 6న శంశల్లాపూర్, 8న న్యాల్‌కల్‌లో జాతర సాగుతుంది. 11న ఝరాసంగం మండలం మాచ్‌నూర్‌లోని డీడీఎస్ పచ్చసాలెలో ముగింపు కార్యక్రమం నిర్వహించనున్నారు.



ప్రదర్శన కోసం ఎడ్ల బండ్లలో ఉంచిన చిరు ధాన్యాలు

పెదనాన్న మృతదేహానికి పోస్టుమార్టం చేయొద్దు

- శవాన్ని భుజాన వేసుకుని పరుగులు తీసిన మృతుని తమ్ముడి కొడుకు



తంగళ్లపల్లి (సిరిసిల్ల): రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామంలో వింత ఘటన చోటు చేసుకుంది. లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన జడ మల్లయ్య(65)కు భార్య చంద్రవ్వ, నలుగురు కూతుళ్లు ఉన్నారు. గురువారం రాత్రి అందరూ భోజనాలు చేసి నిద్రించారు. తెల్లవారినప్పటికీ మల్లయ్య ఎంతసేపటికీ నిద్రలోంచి లేవలేదు. దీంతో అనుమానం వచ్చి పరిశీలించగా అప్పటికే గుండెపోటుకు గురై మరణించాడు. కాగా.. కొందరు మల్లయ్య మృతిపై అనుమానం ఉందని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో తంగళ్లపల్లి పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించేందుకు ప్రయత్నించారు. అయితే మృతుడి తమ్ముడి కొడుకు జడ రాజు.. పెదనాన్న మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించకూడదు అంటూ.. మృతదేహాన్ని భుజాన వేసుకుని పరుగులు తీశాడు. దీంతో ఖంగుతిన్న పోలీసులు రాజు వెంట పరిగెత్తారు. చివరకు పట్టుకొని మృతదేహాన్ని సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య చంద్రవ్వ తన భర్త మృతిపై ఎటువంటి అనుమానాలు లేవని చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆ వేటగాళ్లపై కేసులు నమోదు

రామారెడ్డి (ఎల్లారెడ్డి): కామారెడ్డి జిల్లా సింగరాయపల్లి అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల వేటకు వెళ్లి గుట్టల్లో చిక్కుకుని 48 గంటల పాటు ఉత్కంఠను సృష్టించిన రెడ్డిపేట గ్రామానికి చెందిన ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఆ ఘటనపై కన్నాపూర్ బీట్ ఆఫీసర్ సుధీర్, డీఎఫ్‌వో నిఖిత తెలిపిన వివరాల ప్రకారం.. అక్రమంగా అడవిలోకి వెళ్లడంతో పాటు, ఆయుధాలతో జంతువుల వేటకు సంబంధించి స్పష్టమైన ఆధారాలు ఉన్నందున షాడ రాజు, సున్నపు మహేష్‌పై కేసు నమోదు చేశారు. నిందితుల దగ్గర జంతువుల వేటకు వినియోగించే ఆయుధాలు దొరికాయని, ప్రస్తుతం ఇద్దరూ పరారీలో ఉన్నారని తెలిపారు. పోలీసులు, అటవీశాఖ అధికారులు నిందితుల కోసం గాలిస్తున్నారని చెప్పారు.

కరోనాను అడ్డుకునే స్ప్రే

వాషింగ్టన్: కరోనా వైరస్ ఊపిరితిత్తుల్లోకి ప్రవేశించకుండా అడ్డుకునే కొత్త రకం అణువులను అమెరికాలోని జాన్స్ హాప్కిన్స్ యూనివర్సిటీ ఇంజనీర్లు అభివృద్ధి చేశారు. సన్నగా, పోగుల మాదిరిగా ఉండే వీటిని సుప్రా మాలిక్యులార్ ఫిలమెంట్స్‌గా (ఎస్ఎంఎఫ్) పిలుస్తున్నారు. వీటిని ముక్కులోకి స్ప్రే చేయడం ద్వారా కరోనాతో పాటు సార్స్ తదితర వైరస్‌లను కూడా సమర్థంగా అడ్డుకోవచ్చని వారు చెబుతున్నారు. ''కరోనా శ్వాస ద్వారానే సోకుతుందన్నది తెలిసిందే. ఎస్ఎంఎఫ్ స్పాంజ్ మాదిరిగా కరోనా వంటి వైరస్‌లను పీల్చుకుంటుంది. తద్వారా అవి ఊపిరితిత్తుల్లోని కణాలతో కలిసిపోయి వ్యాధి కారకాలుగా మారకుండా చూస్తుంది'' అని వర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ హొంగాంగ్ కుయ్ వివరించారు. వీటిని ఇప్పటికే ఎలుకలపై విజయవంతంగా ప్రయోగించి చూశారట. కరోనా వైరస్ సాధారణంగా ఊపిరితిత్తుల్లోని కణాల్లో ఉండే ఏస్2గా పిలిచే రిసెప్టర్‌లోకి తొలుత చొచ్చుకుపోతుంది. తద్వారా కణంలోకి ప్రవేశించి వృద్ధి చెందుతుంది. తాజాగా అభివృద్ధి చేసిన ఎస్ఎంఎఫ్‌ల్లో ఫిలమెంట్లలోనూ ఇలాంటి సూడో రిసెప్టర్లుంటాయి. కరోనా వైరస్ లోనికి తమవైపు ఆకర్షించి అక్కడే నిలువరిస్తాయి. కరోనా తాలూకు అన్ని వేరియంట్లనూ ఇది సమర్థంగా అడ్డుకుంటుందని పరిశోధకులు చెబుతున్నారు.

క్లుప్తంగా...

చైనాలో కరోనా కేసులు ఏకంగా 90 కోట్లు!

బీజింగ్: చైనాలో ఈ నెల 11వ తేదీ నాటికి అక్షరాలా 90 కోట్ల మంది కోవిడ్–19 వైరస్ బారిన పడ్డారు. పెకింగ్ యూనివర్సిటీ నిర్వహించిన అధ్యయనంలో ఈ విషయం బయటపడింది. ఈ మేరకు వర్సిటీ ఒక నివేదికను విడుదల చేసింది. దేశ జనాభాలో 64 శాతం మందికి వైరస్ సోకిందని వెల్లడించింది. అత్యధికంగా గాన్సూ ప్రావిన్స్‌లో 91 శాతం మందికి కరోనా సోకింది. యునాన్ ప్రావిన్స్‌లో 84 శాతం మంది, కింఘాయ్ ప్రావిన్స్‌లో 80 శాతం మంది వైరస్ ప్రభావానికి గురయ్యారు. చైనాలో కొత్త సంవత్సరం ఈ నెల 23న ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో లక్షలాది మంది జనం పట్టణాల నుంచి సొంత గ్రామాలకు తరలి వెళ్తున్నారు. ఇకపై గ్రామీణ ప్రాంతాల్లో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య పెరిగే ప్రమాదం ఉన్నట్లు అంటువ్యాధుల నిపుణుడొకరు హెచ్చరించారు. కరోనా కొత్త వేవ్ ఉధృతి రెండు నుంచి మూడు నెలలపాటు కొనసాగే అవకాశం ఉందని చైనీస్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ మాజీ అధిపతి జెంగ్ గువాంగ్ తెలిపారు.

ఢిల్లీ కారు ప్రమాద ఘటన.. 11 మంది పోలీసులపై వేటు

న్యూఢిల్లీ: దేశ రాజధానిలో అత్యంత అమానుషంగా 12 కి.మీ. కారు కింద ఈడ్చుకెళ్లి ఒక యువతి నిండు ప్రాణాలు బలైన ఘటనలో 11 మంది పోలీసులపై సస్పెన్షన్ వేటు పడింది. కారు ప్రయాణించిన మార్గంలో విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది అందరినీ సస్పెండ్ చేయాలని కేంద్ర హోం శాఖ ఆదేశించింది. దాంతో మూడు పీసీఆర్ వ్యాన్లలో గస్తీ తిరుగుతున్న ఆరుగురు పోలీసులు, రెండు పికెట్ల దగ్గరున్న అయిదుగురిని సస్పెండ్ చేశారు

5 సెం.మీ. కుంగిన జోషీమఠ్

న్యూఢిల్లీ: ఉత్తరాఖండ్‌లోని జోషీమఠ్ పట్టణం కేవలం 12 రోజుల్లో 5.4 సెంటీమీటర్ల మేర కుంగిపోయినట్లు ఇస్రో పేర్కొంది. 2022 ఏప్రిల్ నుంచి నవంబర్ దాకా 8.9 సెంటీమీటర్లు కుంగినట్లు ఇస్రో నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్సీ) ప్రాథమిక అధ్యయనంలో తేలింది. 2022 డిసెంబర్ 27 నుంచి 2023 జనవరి 8 మధ్య 5.4 సెంటీమీటర్లు కుంగినట్లు పేర్కొంది. కార్టోశాట్–2ఎస్ శాటిలైట్ చిత్రీకరించిన ఫొటోల ద్వారా దీన్ని నిర్ధారించారు.

మహారాష్ట్రలో రోడ్డు ప్రమాదం.. 10 మంది దుర్మరణం

ముంబై/నాసిక్: మహారాష్ట్రలో షిర్డీకి వెళ్తున్న ప్రైవేట్ టూరిస్ట్ నాసిక్ జిల్లా పథారె శివార్ గ్రామం వద్ద శుక్రవారం ట్రక్కును ఢీకొనడంతో 10 మంది దుర్మరణం పాలయ్యారు. 22 మంది గాయపడ్డారు. ప్రమాద తీవ్రతకు ట్రక్కు, బస్సు పూర్తిగా నుజ్జయ్యాయి. బస్సు అతివేగం వల్లే ప్రమాదం జరిగినట్లు ఒక ప్రయాణికుడు తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రధాని సహాయ నిధి నుంచి రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేల పరిహారం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున సాయం అందజేస్తామని మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే అన్నారు.

ఎల్విస్ ప్రెస్లీ కూతురు లీసా మేరీ మృతి



లాస్‌ఏంజెలెస్: లెజెండరీ గాయకుడు ఎల్విస్ ప్రెస్లీ ఏకైక కూతురు లీసా మేరీ ప్రెస్లీ(54) గురువారం చనిపోయారు. అస్వస్థతకు గురైన తన కూతురు లాస్‌ఏంజెలెస్‌లోని ఓ ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారని ఆమె తల్లి నటి, ప్రిసిల్లా ప్రెస్లీ వెల్లడించారు. తండ్రి రూపురేఖలు, గళంతో వృత్తిపరంగా ఆయన అడుగుజాడల్లోనే నడిచిన లీసా మేరీ..2000 సంవత్సరాల్లో తన సొంత రాక్ ఆల్బమ్‌లను విడుదల చేశారు. ఇన్ ది ఘెట్టో, డోన్ట్ క్రై డాడీ వంటి రికార్డుల్లో తండ్రి ఎల్విస్‌తోపాటు ఆమె పాడారు. మైకేల్ జాక్సన్, నికొలస్ కేజ్‌లతో పాటు నలుగురిని పెళ్లాడి, కొంతకాలానికే విడిపోయారు. ఈమెకు నలుగురు సంతానం కలిగారు.

మీనమేషాలే లెక్కిస్తున్నారు



ఇంకా పట్టాలెక్కని జనగణన

- కరోనా పేరుతో రెండేళ్ల ఆలస్యం
- ఉధృతి తగ్గినా పట్టించుకోని కేంద్రం

ఎస్.రాజమహేంద్రారెడ్డి

'అనుకున్నవి అనుకున్నట్టు జరిగితే దేశం ఎప్పుడో బాగుపడేది'
– కామారెడ్డి టౌన్‌ప్లానింగ్ కేసులో తెలంగాణ హైకోర్టు వ్యాఖ్య

అవును కదా! తరచి తరచి ఆలోచిస్తే న్యాయస్థానం వ్యాఖ్యతో ఏకీభవించక తప్పదు. వ్యక్తుల నుంచి రాజ్యం దాకా ఇదే తాత్సారం. ఏదో అనుకోవడం. ఇంకేదో అవుతుందని వాయిదాల మీద వాయిదాలు వేసుకుంటూ పోవడమే కాకుండా, వాటికి కారణాలు వెతకడం అలవాటైపోయింది. ఒక దేశం సుభిక్షంగా ఉండాలంటే ఆ దేశంలోని ప్రజలు కనీస స్థాయిలోనైనా సంతోషంగా ఉండాలి. వంద కోట్ల పైగా జనాభా ఉన్న భారత్ లాంటి దేశంలో అంత మంది ప్రజల స్థితిగతులు, ఆర్థిక హెచ్చుతగ్గులు, ఉపాధి తీరుతెన్నులూ క్షుణ్నంగా తెలిసి ఉండాలి. ఒక మనిషి అతి సాధారణ జీవితం గడపాలన్నా కూడూ గూడూ కనీసావసరాలు. ఇలాంటి వివరాలు, గణాంకాలు చేతిలో ఉంటేనే ఏ ప్రభుత్వమైనా సంక్షేమ ఫలాలు ఎవరికి అత్యవసరమో, అవసరమో, అవసరం లేదో ఇదమిత్థంగా తేల్చుకోగలుగుతుంది. సరైన దిశలో సరైన చర్యలు చేపట్టగలుగుతుంది. దీనికి లెక్కలు కావాలి. అవే జనాభా లెక్కలు. ఈ లెక్కలు చేతిలో ఉంటే ప్రజల బతుకు లెక్కలు సరిచేసే వీలు చిక్కుతుంది. ఏడాది తిరిగే సరికి గ్రామాలకు గ్రామాలు వలసలతో వెలవెలబోతున్నాయి. ఆ బరువుతో పట్టణాలు ఇరుకైపోతున్నాయి. ఉపాధి వేటలో కష్టాలు తరుముకొస్తున్నాయి. గ్రామాల, పట్టణాల ముఖచిత్రాలు ఇంత వేగంగా మారుతుంటే జనగణన మరింత వేగంగా సాగాలి కదా! కానీ దేశంలో చివరిసారిగా ఈ కసరత్తు జరిగింది 2011లో. అంటే 11 ఏళ్ల కిందట! 2019లో జనగణనకు కేంద్రం ప్రణాళికలు వేసింది. 2021కల్లా ముగించాలని నిర్ణయించింది. ఇప్పుడు మనం 2023లో ఉన్నాం. కానీ ఆ దిశగా తొలి అడుగు కూడా పడలేదు. అనుకున్నది అనుకున్నట్టు జరిగితే ఈసరికి ఆ అనుకున్నదేదో పూర్తయిపోయి ఉండేది. ఎందుకలా జరగలేదు? ఒకసారి చూద్దాం...

అంతా సిద్ధంగానే ఉన్నా...

నిజానికి 2021లోగా జనభా గణన పూర్తి చేయాలని కేంద్రం 2019లోనే నిర్ణయించడమే గాక రూ.8,754.23 కోట్లు కేటాయించింది కూడా. ఈ కసరత్తుకు 33 లక్షల మంది అవసరమని అంచనా వేసింది. వారిని ఏయే రంగాల నుంచి సమీకరించాలో కూడా నిర్ణయానికి వచ్చింది. మొత్తం ప్రక్రియను రెండు దశల్లో పూర్తి చేయాలని ప్రణాళికలు వేసింది. 2020 ఆగస్టు నుంచి సెప్టెంబర్ దాకా తొలి దశ, 2021 ఫిబ్రవరిలో రెండో దశ పూర్తి చేయాలన్నది ఆలోచన. ప్రణాళికలన్నీ కాగితం మీద భేషుగ్గా కుదిరాయి. కానీ అనూహ్యంగా కరోనా మహమ్మారి విరుచుకుపడటంతో జన గణనను వాయిదా వేయాల్సి వచ్చింది. 2020లో కరోనా తొలి వేవ్, 2021లో రెండో వేవ్ వల్ల కార్యక్రమం అటకెక్కింది. నిజానికి కరోనా కల్లోలం నడుమే చైనా, అమెరికా, బ్రిటన్ వంటి చాలా దేశాలు 2020లోనే జనాభా లెక్కల ప్రక్రియను ముగించాయి! మన దగ్గర కనీసం 2022లో అయినా ఆ మహా కార్యాన్ని పూర్తి చేసి ఉంటే బాగుండేది. కరోనా నుంచి ఇంకా పూర్తిగా కోలుకోలేదన్న సాకుతో తప్పించుకోవడం కుదరదు. ఎందుకంటే గతేడాది ఉత్తరప్రదేశ్ వంటి అతి పెద్ద రాష్ట్రంతో పాటు గుజరాత్, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, మణిపూర్, గోవాల్లో శాసనసభ ఎన్నికలు దిగ్విజయంగా నిర్వహించిన సంగతి తెలిసిందే. ఎన్నికలకు అడ్డురాని కరోనా భయం జన గణనకు మాత్రమే ఎలా అడ్డంకి అయింది? సూక్ష్మంగా చెప్పాలంటే ఎన్నికలు అనుకున్నట్టు జరిగాయి. జనాభా గణన అనుకున్నట్టు జరగలేదు. దీనిపై కేంద్రం ఈ రోజుకూ కిమ్మనకుండానే ఉంది. అంటే ఇప్పట్లో ఆ ఊసే లేదని కూడా స్పష్టమవుతోంది. వచ్చే ఏడాది (2024) సాధారణ ఎన్నికలుండటంతో ఆ ఏడాదీ జన గణన లేనట్టే. ఒకవైపు బిహార్లో కుల గణనకు రాష్ట్ర ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ నడుం బిగించిన సంగతి తెలిసిందే. మరి అలాంటి చొరవ కేంద్రం ఎందుకు తీసుకోలేకపోతోంది? ఈ ఏడాది మరో 9 రాష్ట్రాల్లో శాసనసభ ఎన్నికలున్నాయి. ఇలా ఎన్నికల నిర్వహణలో చూపించే చొరవ జనాభా సేకరణలో ఎందుకు చూపించలేక పోతున్నారనేదే మిలియన్ డాలర్ల ప్రశ్న. దేశ ప్రజల స్థితిగతులపై ఎన్నికలకు ముందే కొత్త లెక్కలు బహిర్గతమైతే ఎన్నికల్లో సమీకరణలు మారిపోతాయనా? ప్రతిపక్షాలకు చేజేతులా గణాంకాల అస్త్రం అందించినట్టు అవుతుందనా?

అంత ఈజీ కాదు...

పోనీ, కేంద్రం తక్షణ కర్తవ్యంగా ఇప్పటికిప్పుడు రంగంలోకి దిగి వచ్చే ఏడాదే జనాభా గణన చేపట్టాలని నిర్ణయం తీసుకున్నా అదంత సులువు కాదు. ఎందుకంటే జన గణనకు ఏడాది ముందే గృహాల జాబితా తయారు చేయాల్సి ఉంటుంది. 2011 ఫిబ్రవరిలో జనాభా సేకరణ జరగడానికి ముందే, అంటే 2010లో ఆవాసాల గుర్తింపును కేంద్రం పూర్తి చేసింది. నిజానికి గృహాలను గుర్తించడమే పెద్ద సమస్య. అయితే నేటి డిజిటల్ యుగంలో ఈ ప్రక్రియ కొంత వేగంగా జరగడానికి ఆస్కారముంది. ఆయా రాష్ట్రాలు తమ పరిపాలనా పరిధులకు జూన్ 30లోగా తుది రూపు ఇవ్వాలని భారత రిజిస్ట్రార్ జనరల్, సెన్సెస్ కమిషనర్ ఆదేశించినట్టు సమాచారం. అంటే గృహాలను గుర్తించే కార్యక్రమానికి జూన్ తర్వాతే వీలుపడుతుంది. ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించడం కన్నా మొబైల్ యాప్ ద్వారా ఈ పనిని సులువుగా చేయవచ్చు. కచ్చితమైన సమాచారాన్ని రాబట్టేలా ప్రశ్నావళి రూపొందించాల్సి ఉంటుంది. జనాభా లెక్కల సేకరణలో భాగంగా 1951లో 13 ప్రశ్నలుండేవి. ఇప్పుడవి 31కి పెరిగాయి. హైటెక్ హంగులను ఉపయోగించుకుని ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా జనాభా గణన చేపడితే సంక్షేమ ఫలాలకు అర్హులైన ప్రజలందరికీ మేలు చేసినట్టవుతుంది.

పదేళ్లకోసారి...

పదేళ్లకోసారి జనగణన చేయడం ఆనవాయితీగా వస్తోంది. మన దేశంలో తొలిసారిగా 1872లో జనాభా లెక్కలకు శ్రీకారం చుట్టారు. ఆ తర్వాత క్రమం తప్పకుండా పదేళ్లకోసారి నిర్వహిస్తూనే ఉన్నారు. 1941 (రెండో ప్రపంచ యుద్ధం), 1961 (చైనా యుద్ధం), 1971 (బంగ్లాదేశ్ విమోచన యుద్ధం)ల్లో కొన్ని ఇబ్బందులు ఎదరైనా పదేళ్ల ఆనవాయితీ తప్పలేదు. ఈసారి లెక్క తప్పింది. ఇంకోసారి తప్పదన్న గ్యారెంటీ లేదు! అయినా అనుకున్నది అనుకున్నట్టు జరిగి ఉంటే ఈసారికి గణాంకాలన్నీ మన చేతిలో ఉండేవి.

ఆ పని నేను చేయలేదు

- 'ఎయిరిండియా' నిందితుడు మిశ్రా
- బాధితురాలి పనే కావచ్చని వాదన



న్యూఢిల్లీ: ఎయిరిండియా విమానంలో మహిళా ప్రయాణికురాలిపై మూత్రం పోసిన ఘటనలో నిందితుడు శంకర్ మిశ్రా అడ్డం తిరిగాడు. ''నేనా నేరమే చేయలేదు. మూత్రం పోయలేదు. బహుశా ఆమే పోసుకుని ఉంటుంది'' అని కోర్టుకు తెలిపాడు. మిశ్రా కస్టోడియల్ ఇంటరాగేషన్‌కు నిరాకరిస్తూ మెట్రోపాలిటన్ మేజిస్టీరియల్ కోర్టు ఇచ్చిన ఆదేశాలను పునఃపరిశీలించాలంటూ పోలీసులు వేసిన పిటిషన్‌పై శుక్రవారం అడిషనల్ సెషన్స్ కోర్టులో వాదోపవాదాలు జరిగాయి. మిశ్రా తరఫున సీనియర్ లాయర్ రమేశ్ గుప్తా వాదించారు. 'శంకర్ మిశ్రా నిందితుడు కాదు. మరెవరో ఆ నేరం చేసి ఉంటారు. లేదా బాధితురాలే మూత్రం పోసుకుని ఉంటుంది. కొందరు డ్యాన్సర్లకు మాదిరిగానే ఆమెకు కూడా ఈ బలహీనత ఉండి ఉంటుంది. సీట్ల అమరికను బట్టి మామూలుగా ఆమె సీటు వద్దకు వెళ్లి మూత్రం పోసే వీలు కూడా ఉండదు. బాధితురాలు కూడా ఇందుకు సంబంధించి ఫిర్యాదు చేయలేదు. కానీ, పోలీసులు, మీడియా కలిసి ఈ కేసును జోక్‌లాగా మార్చారు. పరారీలో ఉన్నాడంటూ బెంగళూరు వెళ్లి అరెస్ట్ చేయడానికి ఇదేమన్నా మర్డర్ కేసా?' అంటూ వాదించారు. అయితే, 'శంకర్ మిశ్రా, అతడి కుటుంబంతో మాట్లాడేందుకు ఎంతగానో ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. అతడు ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నాడు. అతడు విమానంలోకి రావడానికి ముందే ఏమైనా తాగాడా? ఎలా తాగాడు? ఘటన తర్వాత ఎక్కడ దాక్కున్నాడు? అతడికి సహకరించిన వారెవరు?' వంటి వివరాలు తెలుసుకునేందుకు అతడిని విచారించాల్సి ఉంది. విచారణ సమయంలో అతడిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించం' అని పోలీసులు కోర్టుకు తెలిపారు. మిశ్రా ఈ విషయాలను మేజిస్ట్రేట్ కోర్టులో చెప్పలేదని అడిషనల్ సెషన్స్ జడ్జి హర్‌జ్యోత్ సింగ్ భల్లా అన్నారు. కాబట్టి మరోసారి ఆ కోర్టును ఆశ్రయించాలని సూచించారు. నవంబర్ 26వ తేదీన న్యూయార్క్–న్యూఢిల్లీ విమానంలో మద్యం మత్తులో ఉన్న శంకర్ మిశ్రా సహ ప్రయాణికురాలిపై మూత్రం పోసినట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. ఆ ఘటనపై కొందరు తోటి ప్రయాణికులు మిశ్రాను వేలెత్తి చూపడంతోపాటు బాధితురాలితో నిందితుడు వాట్సాప్ చాట్ కూడా చేశాడు. దీంతో, ఆ రోజు జరిగింది వాస్తవమేనని తేలింది. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు జనవరి 4న ఢిల్లీ పోలీసులు మిశ్రాపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

'పార్లమెంటును నిర్దేశించలేం'

న్యూఢిల్లీ: ఫలానా చట్టం చేయాలంటూ పార్లమెంటుకు నిర్దేశాలు జారీ చేయలేమని సుప్రీంకోర్టు శుక్రవారం స్పష్టం చేసింది. చట్టాలు చేయడం పూర్తిగా శాసన వ్యవస్థ పరిధిలోని అంశమేనని సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్, న్యాయమూర్తి జస్టిస్ పి.ఎస్.నరసింహ ధర్మాసనం స్పష్టం చేసింది. లా కమిషన్‌ను చట్టబద్ధమైన సంస్థగా ప్రకటించడంతో పాటు తక్షణం చైర్మన్, సభ్యులను నియమించేలా కేంద్రాన్ని ఆదేశించాలంటూ దాఖలైన పిటిషన్‌ను విచారణకు స్వీకరించేందుకు నిరాకరించింది. 22వ లా కమిషన్‌ను ఇప్పటికే ఏర్పాటు చేసినట్టు అటార్నీ జనరల్ నివేదించారని గుర్తు చేసింది.



మాఘ మేళా కోసం యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో త్రివేణీ సంగమం వద్ద వేలాదిగా ఏర్పాటు చేసిన టెంట్లు. ఈ నెల 6న మొదలైన మేళా 45 రోజులపాటు సాగుతుంది.

సమాజాన్ని చీలుస్తున్నాయి

చానళ్ల తీరుపై సుప్రీంకోర్టు ఆగ్రహం

- టీఆర్పీయే పరమావధిగా మారింది
- ప్రతిదాన్నీ సంచలనం చేస్తున్నాయి
- వాటిపై నియంత్రణలేమి శోచనీయం
- స్వేచ్ఛాయుత మీడియా తక్షణావసరం
- పెను సమస్యగా విద్వేష వ్యాఖ్యలు
- వ్యాప్తి చేసే చానళ్లపై కఠిన చర్యలు
- కేంద్రానికి ధర్మాసనం ఆదేశం



న్యూఢిల్లీ: వార్తల ప్రసారంలో పలు చానళ్ల తీరును ఆక్షేపిస్తూ సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. బాధ్యతారాహిత్యంతో అవి సమాజాన్ని చీలుస్తున్నాయంటూ ఆగ్రహించింది. విద్వేష ప్రసంగాలకు అడ్డుకట్ట వేసేలా చూడటంతో పాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై న్యాయమూర్తులు జస్టిస్ కె.ఎం.జోసెఫ్, జస్టిస్ బి.వి.నాగరత్నలతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. విద్వేష ప్రసంగాలు సమాజం పాలిట పెను బెడదగా పరిణమించాయంటూ ఈ సందర్భంగా మండిపడింది. వీటికి ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డుకట్ట వేయాల్సిందేనని స్పష్టం చేసింది. బాధ్యతారాహిత ప్రసారాలతో సమాజంలో సామరస్యానికి, సౌభ్రాతృత్వానికి విఘాతం కలిగించే చానళ్లపై చట్ట పరిధిలో కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని ఆదేశించింది. ''మనకు కావాల్సింది సంతులనంతో కూడిన స్వేచ్ఛాయుతమైన మీడియా. కానీ హెచ్చు టీఆర్పీ రేటింగులు సాధించడమే ఈ రోజుల్లో వార్తల కవరేజీకి పరమావధిగా మారింది. అందుకోసం చానళ్లు తమలో తాము పోటీ పడుతూ ప్రతిదాన్నీ సంచలనాత్మంగా మారుస్తున్నాయి. చాలాసార్లు టీవీల్లో లైవ్ చర్చల్లో యాంకర్లు తామే సమస్యలో భాగంగా మారిపోతున్నారు. ప్యానల్లోని వ్యక్తులు మాట్లాడుతుండగానే ఇష్టారాజ్యంగా మ్యూట్ చేస్తున్నారు. వారికి తమ వాదన విన్పించే అవకాశమే ఇవ్వడం లేదు. టీవీ దృశ్య మాధ్యమం కావడంతో పత్రికల కంటే చాలా శక్తిమంతమైనది. వీక్షకులను ఎంతో ప్రభావితం చేయగలుగుతుంది. దురదృష్టవశాత్తూ ప్రేక్షకుల్లో చాలామంది పరిణతి ఉన్నవాళ్లు కాదు. టీవీలు చూపించే దృశ్యాలను చూసి రెచ్చిపోకుండా ఉండటం కష్టం. ఈ నేపథ్యంలో పత్రికలకు ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మాదిరిగా టీవీ ప్రసారాల విషయంలో ఎలాంటి నియంత్రణ వ్యవస్థా లేకపోవడం శోచనీయం'' అంటూ జస్టిస్ జోసెఫ్ ఆందోళన వెలిబుచ్చారు. విద్వేష వ్యాఖ్యల వ్యాప్తి ద్వారా సమస్యలో భాగంగా మారుతున్న టీవీ న్యూస్ యాంకర్లను ప్రసారం నుంచి ఎందుకు తప్పించకూడదని ప్రశ్నించారు. చానళ్లు తీర్పరులుగా మారి విచారణ కూడా జరుపుతున్నాయంటూ ఆక్షేపించారు. ''ఎయిరిండియా విమానంలో తోటి ప్రయాణికురాలిపై మూత్రం పోశాడన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని కించపరిచేలా వ్యాఖ్యలు చేశాయి. అతనింకా విచారణ ఎదుర్కొంటున్నాడు. ప్రతివారికీ పరువు ప్రతిష్ఠలుంటాయి'' అన్నారు.

పోలీసును పొడిచేసినా పట్టించుకోరా!

ఢిల్లీలో ఇటీవల ఒక పోలీసు అధికారిని చైన్‌స్నాచర్ పట్టపగలు అందరి ముందే పొడిచేసినా ఎవరూ పట్టించుకోలేదని ఒక్కరూ అడ్డుకోలేదని జస్టిస్ నాగరత్న ఆవేదన వెలిబుచ్చారు. ''కానీ చానళ్లలో, బయటా మాత్రం ఎవరు ఏమైనా మాట్లాడే పరిస్థితి నెలకొంది. వార్తా చానళ్లు వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా మన దేశంలో వాటిపై ఇప్పటికీ ఎలాంటి నియంత్రణలూ లేవు. భావ ప్రకటన స్వేచ్ఛ గొప్ప బాధ్యతతో కూడుకుని ఉంటుంది. టీవీ చానళ్లు విద్వేష ప్రసంగాల వ్యాప్తికి పాల్పడి కార్యక్రమాల నియమావళిని ఉల్లంఘిస్తే వాటి యాజమాన్యాలపై చర్యలు తీసుకోవచ్చు'' అని స్పష్టం చేశారు. ఒకరిపై అలాంటి చర్యలు తీసుకుంటేనే మిగతా వాళ్లంతా దారికొస్తారని జస్టిస్ జోసెఫ్ అభిప్రాయపడ్డారు. గత ఏడాది కాలంలో ఇలాంటి వేలాది ఫిర్యాదులొచ్చాయని, సదరు చానళ్లపై చర్యలు కూడా తీసుకున్నామని న్యూస్ బ్రాడ్‌కాస్టర్స్ అసోసియేషన్ తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తెచ్చారు. భావ ప్రకటన స్వేచ్ఛ చాలా సున్నితమైన అంశమని ధర్మాసనం పేర్కొంది. దానికి భంగం కలగని రీతిలో చానళ్ల కట్టడికి చర్యలు తీసుకోవాలని కేంద్రానికి సూచించింది. ఈ సమస్య ఇప్పటికే కేంద్రం దృష్టిలో ఉందని అదనపు సొలిసిటర్ జనరల్ కె.ఎం.నటరాజ్ బదులిచ్చారు. విద్వేష ప్రసంగాలకు చెక్ పెట్టేందుకు క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌కు సవరణలు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్టు చెప్పారు.

సమస్యగా మారొద్దు

''ప్రత్యక్ష ప్రసారాల్లో చర్చలు సజావుగా జరిగేలా చూడాల్సిన బాధ్యత యాంకర్‌దే. యాంకరే సరిగా వ్యవహరించకపోతే భిన్నాభిప్రాయాలను అనుమతించరు. అవతలి వక్తను మ్యూట్ చేయడమో, వారిని అసలు ప్రశ్నలే అడగకపోవడమో చేస్తారు. ఇది పక్షపాతమే. ఇలాంటి సందర్భాల్లో యాంకర్లపై ఎన్నిసార్లు చర్యలు తీసుకున్నారు? సమాజంపై ఎంతో ప్రభావం చూపగల అత్యంత బాధ్యతాయుత స్థానాల్లో ఉన్నామని మీడియాలోని వ్యక్తులు అర్థం చేసుకోవాలి. సమస్యలో భాగంగా మారి మనసుకు ఏది తోస్తే అది మాట్లాడొద్దు'' అంటూ ధర్మాసనం హితవు పలికింది.

కన్సాస్ సెనేటర్‌గా ఉషా రెడ్డి



హూస్టన్: అమెరికాలోని కన్సాస్ రాష్ట్ర సెనేటర్‌గా భారతీయ అమెరికన్, విద్యావేత్త ఉషా రెడ్డి (57)బాధ్యతలు చేపట్టారు. డెమోక్రాటిక్ పార్టీ తరఫున బాధ్యతలు స్వీకరించడం ఆనందంగా ఉందంటూ ట్వీట్ చేశారు. ఆమె 2013 నుంచి మన్‌హాటన్ సిటీ కమిషన్‌గా కొనసాగుతున్నారు. మేయర్‌గా రెండుసార్లు ఎన్నికయ్యారు. నేషనల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ చాప్టర్ ప్రెసిడెంట్‌గానూ ఉన్నారు. ఉషారెడ్డి 8 ఏళ్లప్పుడు ఆమె కుటుంబం ఏపీలోని రాజమహేంద్రవరం నుంచి అమెరికా వెళ్లింది.

31 నుంచి బడ్జెట్ సమావేశాలు

ఫిబ్రవరి ఒకటిన కేంద్ర బడ్జెట్

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల షెడ్యూల్ ఖరారైంది. సమావేశాలు జనవరి 31 నుంచి ఏప్రిల్ 6 దాకా కొనసాగుతాయని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి శుక్రవారం తెలిపారు. తొలి విడత జనవరి 31 నుంచి ఫిబ్రవరి 14 దాకా, రెండో విడత మార్చి 13 నుంచి ఏప్రిల్ 6 దాకా జరుగుతాయని వివరించారు. 66 రోజుల వ్యవధిలో మొత్తం 27 రోజుల పని దినాల్లో బడ్జెట్ సమావేశాలుంటాయని తెలిపారు. ఆనవాయితీ ప్రకారం మొదటి రోజున పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తొలి ప్రసంగం చేయనున్నారు. ఫిబ్రవరి ఒకటిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ భేటీల్లో రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చతో పాటు ఇతర అంశాలపై చర్చ జరుగనుంది. వివిధ విభాగాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలు గ్రాంట్ల కోసం డిమాండ్లను పరిశీలించడానికి, ఆయా మంత్రిత్వ శాఖలు, విభాగాలకు సంబంధించిన నివేదికలను రూపొందించడానికి వీలుగా ఫిబ్రవరి 14 నుంచి మార్చి 12 వరకు విరామం ఉంటుందని ప్రహ్లాద్ జోషి వెల్లడించారు.

ప్రపంచ పటంపై మన పర్యాటకం

టూరిస్టులకు సాదర స్వాగతం: మోదీ

- సుదీర్ఘ నదీ పర్యాటక నౌక 'ఎంవీ గంగా విలాస్' ప్రారంభం
- వారణాసిలో టెంట్ సిటీని కూడా ప్రారంభించిన ప్రధాని మోదీ
- బెంగాల్, యూపీ, బిహార్, అస్సాంలో పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన

వారణాసి: అభివృద్ధి చెందిన భారత్ నిర్మాణానికి ప్రాంతాల మధ్య బలమైన అనుసంధానం అవసరమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ప్రపంచంలోనే అత్యంత సుదీర్ఘమైన ప్రయాణం సాగించే నదీ పర్యాటక నౌక 'ఎంవీ గంగా విలాస్'కు ఆయన శుక్రవారం వర్చువల్‌గా జెండా ఊపారు. ఉత్తరప్రదేశ్‌లోని చారిత్రక నగరం వారణాసి నుంచి నౌక ప్రయాణం ఆరంభమైంది. అలాగే వారణాసిలో గంగా నది ఒడ్డున నిర్మించిన టెంట్ సిటీని ప్రధాని మోదీ ప్రారంభించారు. అంతేకాకుండా పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, బిహార్, అస్సాంలో రూ.1,000 కోట్లకుపైగా విలువైన పలు ఇన్‌లాండ్ వాటర్ వేస్ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయడంతోపాటు మరికొన్నింటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ.. కాశీ–దిబ్రూగఢ్ నదీ పర్యాటక నౌకతో ఉత్తర భారతదేశంలోని పర్యాటక ప్రాంతాలకు ఇక ప్రపంచ టూరిజం పటంపై ప్రత్యేక స్థానం లభిస్తుందని ఉద్ఘాటించారు. ఆయా ప్రాంతాల అభివృద్ధికి మార్గం సుగమం అవుతుందన్నారు. నరేంద్ర మోదీ ఇంకా ఏం చెప్పారంటే..

నమామి గంగా, అర్థ్ గంగా

''భారతీయుల జీవితాల్లో పవిత్ర గంగా నదికి ఎనలేని ప్రాముఖ్యత ఉంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత గంగానది పరిసర ప్రాంతాలు అభివృద్ధిలో వెనుకబడ్డాయి. అభివృద్ధి లేక ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు వలసలు పెరిగాయి. సమస్య పరిష్కారానికి రెండంచెల వ్యూహం అమలు చేస్తున్నాం. అందులో ఒకటి గంగా నది ప్రక్షాళన కోసం ఉద్దేశించిన 'నమామి గంగా' పథకం. మరొకటి 'అర్థ్ గంగా'. నదీ తీర రాష్ట్రాల్లో ఆర్థిక ప్రగతిని పెంపొందించే వాతావరణం సృష్టిస్తున్నాం. గంగా విలాస్ నౌకలో విహరించేందుకు 32 మంది స్విట్జర్లాండ్ వాసులు ఒప్పందం కుదుర్చుకోవడం సంతోషకరం. అన్ని దేశాల నుంచి పర్యాటకులను సాదరంగా ఆహ్వానిస్తున్నాం.

పర్యాటకంలో కొత్త యుగానికి ఆరంభం

గంగా నదిలో పర్యాటక నౌక ప్రయాణం ప్రారంభం కావడం ఒక మైలురాయి లాంటి సందర్భం. భారతదేశ పర్యాటక రంగంలో కొత్త యుగానికి ఇదొక ఆరంభం. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసుకుంటే కొత్త ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. దేశంలోని నదులు జల శక్తికి, వాణిజ్యానికి, పర్యాటకానికి కొత్త ఊపును తీసుకురానున్నాయి. 2014 కంటే ముందు జలమార్గాలపై పాలకులు దృష్టి పెట్టలేదు. 2014 తర్వాత జలమార్గాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నాం. జాతీయ జలమార్గాలను ఐదు నుంచి 111కు పెంచాం. జలమార్గాల్లో సరుకు రవాణా 30 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి మూడింతలు పెరిగింది''.



51 రోజులు.. రూ.55 లక్షలు

గంగా విలాస్ నౌకలో ప్రయాణానికి రూ.55 లక్షలు ఖర్చవుతుంది! 2024 మార్చి దాకా నౌక మొత్తం ఇప్పటికే బుక్ అయ్యిందని నిర్వహణ సంస్థ అంతారా లగ్జరీ రివర్ క్రూయిజెస్ పేర్కొంది. ఇది పట్నా, సాహిబ్‌గంజ్, కోల్‌కతా, ఢాకా, గౌహతి గుండా ప్రయాణిస్తుంది. 50 టూరిస్టు కేంద్రాలు, ప్రపంచ వారసత్వ కట్టడాలను సందర్శించవచ్చు. 18 సూట్లుండే ఈ నౌకలో 36 మంది ప్రయాణించవచ్చు. కాశీలో పర్యాటకులకు వసతి కల్పించడానికి ఉద్దేశించిన టెంట్ సిటీ ఏటా అక్టోబర్ నుంచి జూన్ దాకా అందుబాటులో ఉంటుంది. అన్ని ఘాట్ల నుంచి పడవల్లో టెంట్ సిటీకి చేరుకోవచ్చు.

గ్లోబల్ సౌత్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తాం

గ్లోబల్ సౌత్ సదస్సులో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: వర్ధమాన దేశాలు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడానికి 'గ్లోబల్ సౌత్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. శుక్రవారం గ్లోబల్ సౌత్ సదస్సు ముగింపు కార్యక్రమంలో ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు. కోవిడ్–19 మహమ్మారి, ధరల పెరుగుదల, భౌగోళిక రాజకీయ పరిస్థితులు అభివృద్ధి చెందుతున్న దేశాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని గుర్తుచేశారు. వాతావరణ సంక్షోభం, అప్పుల సంక్షోభానికి కారణమయ్యే ప్రపంచీకరణను అభివృద్ధి చెందుతున్న దేశాలు కోరుకోవడం లేదన్నారు. అస్థిరమైన భౌగోళిక రాజకీయాల వల్ల మన దేశాలు అభివృద్ధిపై సరిగ్గా దృష్టి పెట్టలేకపోతున్నాయని పేర్కొన్నారు. ఈ పరిస్థితిలో మార్పు రావాలంటే ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి వంటి అంతర్జాతీయ సంస్థలను మూలం నుంచి సంస్కరించాలని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. గ్లోబల్ సౌత్ సదస్సులో 120కి పైగా దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సాక్షి
కరీంనగర్

శనివారం । 14 । జనవరి । 2023





- పండుగకు పిండివంటలతో ఉపాధి
- హోంఫుడ్స్‌కు ఖండాంతరాల్లో డిమాండ్
- చిన్నాపెద్ద కార్యక్రమాలకు భారీగా ఆర్డర్లు
- ఇండ్లలో సహజసిద్ధంగా పిండివంటల తయారీ
- ఉమ్మడి జిల్లాలోని మహిళల స్వయంకృషి

సంక్రాంతి స్పెషల్

విలేజ్ నుంచి విదేశాలకు..

నోరూరిస్తున్న సంక్రాంతి ఘుమఘుమలు

సంక్రాంతి అంటేనే పిండి వంటలు. వారం రోజుల ముందు నుంచే ఇళ్లంతా ఘుమఘుమలు. సకినాలు, గారెలు, అరిసెలు, లడ్డూలు ఇలా తీరొక్క రకాలు నోరూరిస్తుంటాయి. చుట్టుపక్కల వారంతా కలిసి ఆడుతూ.. పాడుతూ ఒకరికొకరు సాయంగా ఉంటూ గతంలో పిండి వంటలు చేసుకునే వారు. ఎక్కడో దూరంగా ఉంటున్న ఆత్మీయులకు పంపించేవారు. ఉరుకులు, పరుగుల జీవితంలో పెద్దమొత్తంలో పిండివంటలు ఇప్పుడు సాధ్యం కావడం లేదు. దీంతో చాలా మంది హోంఫుడ్స్‌ను ఆశ్రయిస్తుండగా.. ఇన్నాళ్లు పట్టణాలకే పరిమితమైన ఇంటివంటలు గ్రామాల్లోనూ విశేష ఆదరణ పొందుతున్నాయి. క్యాంటిటీ, క్వాలిటీయే లక్ష్యంగా తయారు చేసిన వంటకాలను దేశవిదేశాల్లోని మన తెలంగాణవాసులు ఎంతో ఇష్టంగా ఆరగిస్తున్నారు. పండుగ సమయంలోనే కాదు.. ఏడాది మొత్తం గిరాకీ ఉంటోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లోని పలు హోంఫుడ్స్, మహిళలకు లభిస్తున్న ఉపాధిపై సంక్రాంతి సందర్భంగా కథనం..

సంక్రాంతికి ఆర్డర్లు ఫుల్

సంక్రాంతి వచ్చిందంటే మాకు చేతినిండా పని ఉంటుంది. ఖాళీగా ఉండకుండా ఇంటిపట్టున ఉంటూ ఏదైనా పని చేయాలనుకున్నప్పుడు ఆర్డర్ మీద అప్పాలు చేయాలన్న ఆలోచన వచ్చింది. ప్రత్యేకంగా బ్రాండ్ లేకుండానే తెలిసిన వారి నుంచి ఆర్డర్లు తీసుకుని క్వాలిటీతో సమయానికి ఇవ్వడంతో రోజురోజుకూ గిరాకీ పెరిగింది. అప్పాలు చేయడంతో వచ్చిన పైసలతోనే మా ఇద్దరు అమ్మాయిలను అమెరికా పంపించా.

– తానిపర్తి లక్ష్మి, గ్రూప్ లీడర్, సుల్తానాపూర్

అప్పాల ‘సుల్తానాపూర్’



సాక్షి, పెద్దపల్లి: పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తానాపూర్‌లో ఏడాదంతా అప్పాల ఘుమఘుమలు వస్తూనే ఉంటాయి. 15ఏళ్ల క్రితం గ్రామానికి చెందిన లక్ష్మి లీడర్‌గా పదిమంది సభ్యులతో గ్రూపుగా ఏర్పాటయ్యారు. చిన్నమొత్తాలతో వ్యాపారం చేయాలనుకున్నారు. గ్రూప్‌లోని ఓ సభ్యురాలి ఇంట్లో వివాహ వేడుకకు పెద్దమొత్తంలో పిండివంటలు తయారు చేయాల్సి వచ్చింది. కావాల్సిన సారెను అందరూ కలిసి సిద్ధం చేశారు. తరువాత పిండివంటల తయారీ తెలిసిన పని, తక్కువ పెట్టుబడి కావడంతో వ్యాపారం ప్రారంభించాలని అనుకున్నారు. అలా ప్రారంభమై ఇప్పుడు ఏటా రూ.60 లక్షల టర్నోవర్ అవుతోంది. అప్పులు తీర్చుతూ, తమ పిల్లలను విదేశాల్లో చదివిస్తున్నారు. మరో 50మందికి ఉపాధి కల్పిస్తున్నారు. ఈ బిజినెస్ బాగుండటంతో ఇదే వృత్తిగా ఆ గ్రామంలో ఏడు గ్రూప్‌లు ఏర్పడ్డాయి. వీటికింద సుమారు 400మందికి పైగా సహాయకులు ఉపాధి పొందుతున్నారు. 32 వరుసలతో చక్రాల సకినాలు, కిలో పరిమాణంలో లడ్డూ, కరిజ, బెల్లం అరిసెలు, నువ్వుల లడ్డూ, మురుకులు, చెగోడీలూ, గవ్వలు, ఖారా, ఇతరత్రా వంటకా లను పెద్ద ఎత్తున తయారు చేయడం వీరి ప్రత్యేకత. వీరి అప్పాలు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని జిల్లాలతోపాటు, అమెరికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియాలాంటి దేశాలకు ఆర్డర్‌పై వెళ్తుంటాయి. దీంతో సుల్తానాపూ ర్ ఇప్పుడు అప్పాలపూర్‌గా మారింది.

ఆర్డర్లపై తయారీ..

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట పట్టణంలోని గణేశ్‌నగర్‌కాలనీకి చెందిన తాడిశెట్టి పద్మ సర్వపిండి సెంటర్ నిర్వహిస్తోంది. పండుగలు, శుభకార్యాలకు ఆర్డర్లపై సకినాలు, మడుగులు, ఖార్జా, బాదుషా తదితర పిండి వంటకాలు చేసి అందిస్తోంది. 10 సంవత్సరాలుగా పిండి వంటలు చేస్తూ మరో ఇద్దరికి పని కల్పిస్తోంది. పండుగ వేళల్లో ఆస్ట్రేలియా, కెనడా తదితర దేశాల్లో ఉద్యోగంలో ఉన్నవారికి పంపిస్తున్నారు. స్వీట్లు కేజీ రూ.300, పిండి వంటలు కేజీ రూ.250 చొప్పున అందిస్తున్నామని పద్మ పేర్కొంటోంది.


పిండి వంటలు చేస్తున్న పద్మ

పిండి వంటలకు కేరాఫ్ గూడూరు

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండలం గూడూరు తెలంగాణ పిండివంటలకు కేరాఫ్‌గా నిలుస్తోంది. గ్రామానికి చెందిన చీటి వసంత విదేశాల్లో ఉండే బంధువుల కోసం ఐదేళ్ల క్రితం సకినాలు, గారెలు, రవ్వలడ్డూ, సర్వపిండి, నువ్వుల లడ్డూ తయారుచేసి పంపించారు. అవి వారికి నచ్చడంతో తరుచూ తయారు చేయమని కోరారు. దీంతో చీటి వసంత, కారంగుల రజనీ మరో ఇరవై మందికి ఉపాధి కల్పిస్తూ ఐదేళ్లుగా తెలంగాణ పిండి వంటలు తయారు చేస్తున్నారు. అమెరికా, ఆస్ట్రేలియా, బ్రిటన్‌తోపాటు గల్ఫ్ దేశాలకు వెళ్లేవారు ఆర్డర్‌పై తీసుకెళ్తున్నారు. హైదరాబాద్, సిద్దిపేట, సిరిసిల్ల, కరీంనగర్, కామారెడ్డి, ముంబయి నుంచి కూడా ఏడాదిపొడవునా ఆర్డర్లు వస్తున్నాయి. ఇవేకాకుండా చికెన్, మటన్, ఫిష్ పచ్చళ్లు అందిస్తున్నారు. సకినాలు, గారెలు, లడ్డూ కిలోకు రూ.300 చొప్పున అందిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా నెలరోజుల నుంచే ఆర్డర్లు పంపించామని చెబుతున్నారు.


సకినాలు చేస్తున్న మహిళలు

సంప్రదాయ వంటలు



ఇంట్లో ఖాళీగా ఉండలేక బంధువుల కోసం సకినాలు, గారెలు అందించా. రుచి నచ్చి చాలామంది పిండి వంటకాలు కావాలని అడిగారు. అలా ఐదేళ్ల క్రితం మొదలైన పిండి వంటల తయారీ నిత్యం కొనసాగుతోంది. సకినాలు, సర్వపిండి, గారెలు, లడ్డూలు, అరిసెలు తయారు చేసి ఇస్తున్నాం. ప్రస్తుతం ఆర్డర్లు బాగానే వస్తున్నాయి.

– చీటి వసంత, గూడూరు

సర్కారు సాయం చేయాలి



సహజసిద్ధంగా లభించే పిండిపదార్థాలతో వంటకాలు తయారు చేస్తున్నాం. ప్రభుత్వం సాయం అందిస్తే పిండివంటకాల అవుట్‌లెట్లు పెడతాం. మరింత మందికి ఉపాధి కల్పిస్తాం. సంక్రాంతి పండగే కాదు సంవత్సరమంతా సకినాలు, గారెలు, సర్వపిండి, చెగొడీలకు గిరాకీ ఉంటుంది. నెలకు రూ.30వేల వరకు సంపాదిస్తున్నాం.

– కారంగుల రజని, గూడూరు

19 ఏళ్లుగా ఇంటి వంటలు

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖని పవర్‌హౌజ్‌కాలనీలోని శ్రీసాయి తెలంగాణ పిండివంటల టేస్ట్ సపరేటు అంటున్నారు స్థానికులు. తానిపర్తి రామ్మోహన్‌రావు ఆయన భార్య జయశ్రీ కలిసి పండివంటల కేంద్రాన్ని వారి ఇంట్లోనే నిర్వహిస్తూ 20మంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. చకినాలు, గారెలు, అరిసెలు, చగోడిలు, నువ్వుల ముద్దలు, లడ్డులు, కారపూసలు(జంతికలు), కరిజలు, పల్లీలడ్డులు, బక్షాలు, సర్వపిండి తయారు చేస్తున్నారు. వీటిని ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని స్వీట్‌హౌజ్‌లు, బేకరీలు, సూపర్ మార్కెట్‌లు, కిరాణం దుకాణాలతోపాటు హైదరాబాద్, ఆదిలాబాద్, మంచిర్యాల తదితర జిల్లాలకు సరఫరా చేస్తున్నారు. అమెరికా, ఆస్ట్రేలియా, దుబాయ్, యుకే తదితర దేశాలకు ఎన్ఆర్ఐ ప్యాకింగ్‌లో తెలుగువాళ్లకు కూడా పంపిస్తున్నట్లు రామ్మోహన్‌రావు తెలిపారు.


గారెలు తయారు చేస్తున్న మహిళలు

పప్పు, జొన్నరొట్టెతో ప్రారంభించాం..



2003లో పప్పు, జొన్న రొట్టెతో ప్రారంభించాం. 19 ఏళ్లుగా పిండి వంటలు తయారు చేస్తున్నాం. మాతోపాటు మరో 20 మంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్నాం. సంక్రాంతికి ఎక్కువగా ఆర్డర్లు వచ్చాయి. విదేశాలకు కూడా మేం తయారు చేసిన పిండి వంటలను తీసుకుపోతుండడం ఆనందంగా ఉంది. సంక్రాంతికి 15 రోజుల ముందు నుంచే ఆర్డర్లు రెడీ చేశాం.

– తానిపర్తి రామ్మోహన్‌రావు, జయశ్రీ

‘మంథని’ రుచులు

మంథని: మంథనికి చెందిన పలువురు మహిళలు స్వయం ఉపాధి కోసం పిండి వంటలు తయారు చేస్తున్నారు. వీటిని విదేశాల్లోని తమవారికి పంపిస్తుంటారు. సంక్రాంతి పండగ పిండి వంటలు పదిహేను రోజుల ముందు నుంచే అమెరికా, లండన్, సింగపూర్, ఆస్ట్రేలియాతో ప్రపంచంలోని ఆయా దేశాలకు చేరాయి. మంథనిలో కారపు చకినాలు ప్రత్యేకం. పచ్చి మిరపకాయల ముద్ద, కోతిమీర, నెయ్యి, వెన్నతో తయారు చేసే కారపు చకినాలకు మంచి గిరాకీ ఉంటుంది. వీటిని చాలామంది కొనుగోలు చేసుకెళ్తుంటారు. మోతీచూర లడ్డూ కూడా ఇక్కడ స్పెషల్. ఏ రకం పిండి వంటలైనా కిలో రూ.300 నుంచి రూ.400కు విక్రయిస్తుంటారు. ‘మేము తయారు చేసిన పిండివంటలు కిలోకు రూ.300 చొప్పున అమ్ముతున్నాం. తయారీ ఖర్చు రూ.250 వరకు ఉంటుంది. కిలోకు యాభై రూపాయలు మిగులుతాయి. పండగ సమయంలో గిరాకీ ఎక్కువగా ఉంటుంది. మిగతా రోజుల్లో తక్కువే. విదేశాలకు పంపేవారు ముందుగానే ఆర్డర్ ఇస్తారు.’ అని వాణి లక్ష్మీ నారాయణ స్వగృహఫుడ్స్ నిర్వాహకురాలు బండారి సునీత వివరించారు.


తయారు చేసిన పిండి వంటలతో బండారి సునీత

న్యూస్‌రీల్

ఫిర్యాదుల పరిష్కారంలో చురుగ్గా ఉండాలి


మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ

కరీంనగర్ క్రైం: రిసెప్షన్ అధికారులు ఫిర్యాదుల పరిష్కారంలో చురుగ్గా ఉండాలని అడిషనల్ డీసీపీ(పరిపాలన) జి.చంద్రమోహన్ అన్నారు. కమిషనరేట్ కేంద్రంలో శుక్రవారం పోలీస్‌స్టేషన్లకు చెందిన రిసెప్షన్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ ఫిర్యాదుల ప్రాధాన్యతను సంబంధిత ఎస్‌హెచ్‌వోల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఠాణాలకు వచ్చే అన్ని వర్గాల ప్రజలు సంతృప్తి చెందేలా సేవలందించాలని చెప్పారు. ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధించిన రెండు రకాల ధ్రువీకరణలతో వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. సమర్థంగా సేవలందించే వివిధ విభాగాలకు చెందిన అధికారులకు ప్రతినెలా రివార్డులు అందిస్తామని తెలిపారు. నెలాఖరులో సెలవులో వెళ్లకుండా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు విజ్ఞాన్ రావు, బి.సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

ఏసీడీ చార్జీలు వేయడంపై నిరసన


నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్‌టౌన్: విద్యుత్ బిల్లుల్లో ఏసీడీ చార్జీల పేరుతో వినియోగదారులపై అదనపు భారం వేయడాన్ని నిరసిస్తూ నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్ఈ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల నుంచి నిత్యం ఏదో ఒక రూపంలో చార్జీల పేరుతో వేల రూపాయలు వసూలు చేయడం రాష్ట్ర ప్రభుత్వానికి నిత్యకృత్యమైందని అన్నారు. గతంలో కేవలం కేటగిరి 2 (వ్యాపారులకు)కు మాత్రమే ఏసీడీ చార్జీలు వసూలు చేసేవారని, ఇప్పుడు గృహవినియోగదారులపై కూడా వసూలు చేయడానికి తెరలేపారని విమర్శించారు. ఒక్కో బిల్లులో 500 నుంచి 5 వేలకు పైనభారం వేశారని.. ఇది రాష్ట్ర ప్రజలకు సీఎం కేసీఆర్ సంక్రాంతి పండుగ కానుకనా అని ఎద్దేవా చేశారు. చార్జీల పెంపు వెంటనే ఉపసంహరించుకోవాలని.. లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నా అనంతరం ఎస్ఈకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బానోతు శ్రావణ్ నాయక్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, లింగంపల్లి బాబు, కుర్ర పోచయ్య, దండి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భవన్ ఆవరణలో స్వచ్ఛ భారత్


చెత్త తొలగిస్తున్న ఎస్ఈ గంగాధర్

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్‌లోని విద్యుత్ భవన్ ఆవరణలో శుక్రవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం చేపట్టారు. కార్యాలయ ఆవరణలోని చెత్త తొలగించారు. ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యుత్ భవన్ ఆవరణలోని రూరల్ ఈఆర్‌వో ఆఫీసు, ఎంఆర్‌టీ, జిల్లా స్టోర్స్, గెస్ట్‌హౌస్, కార్యాలయ ద్వారం వద్ద చెత్త, గడ్డిని తొలగించారు. కార్యక్రమంలో డీఈలు లక్ష్మారెడ్డి, రాజం, చంద్రమౌళి, గోపీకృష్ణ, రాజేశం, పీవో చంద్రయ్య, ఏడీఈలు, ఏవోలు, ఏఈలు పాల్గొన్నారు.

పత్తి ధర రూ.8,140

జమ్మికుంట(హుజూరాబాద్): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో పత్తి ధరలు రోజురోజుకూ పడిపోతున్నాయి. శుక్రవారం క్వింటాల్ ధర గరిష్టంగా రూ.8,140 రూపాయలు పలికింది. మార్కెట్‌కు 61 వాహనాల్లో 678 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకురాగా క్వింటాల్‌కు మోడల్ ధర రూ.8,050, కనిష్ట ధర రూ.7,550 చెల్లించారు. గన్నీ సంచుల్లో 10 మంది రైతులు 18 క్వింటాళ్ల పత్తిని తీసుకురాగా క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,800, మోడల్ ధర రూ.7,700, కనిష్ట ధర రూ.6,500కు వ్యాపారులు కొనుగోలు చేశారు. మార్కెట్‌కు శనివారం భోగి, ఆదివారం సంక్రాంతి, సోమవారం కనుమ పండుగల సందర్భంగా 3 రోజులు సెలవులు ప్రకటించామని కార్యదర్శి గుగులోతు రెడ్డి నాయక్ తెలిపారు. మంగళవారం మార్కెట్‌లో క్రయవిక్రయాలు యథావిధిగా కొనసాగుతాయని పేర్కొన్నారు.

భోగి.. వైభోగం

- సంబరాలకు ఉమ్మడి జిల్లాలో సర్వం సిద్ధం
- రంగవళ్లులు.. డూడూ బసవన్నలు ముస్తాబు

కరీంనగర్‌కల్చరల్/ బోయినపల్లి (చొప్పదండి): మూడురోజుల ముచ్చటైన వేడుక సంక్రాంతి సంబరాలకు ఉమ్మడి జిల్లా ప్రజలు సిద్ధమవుతున్నారు. నేటి భోగితో ప్రారంభమయ్యే పండుగ జోష్ కనుమ వేడుకతో ముగియనుంది. భోగి మంటలు వేసి ఆడిపాడేందుకు యువత, చిన్నారులు రెడీ అవుతున్నారు. ఇంటివాకిళ్లు రంగవళ్లులతో ముస్తాబుకానున్నాయి. తాటాకులతో భోగి మంట వేస్తారు. ఆ మంటల్లో ముందుగా సిద్ధం చేసుకున్న పాత వస్తువులు వేస్తారు. మంటల మధ్యన నీటితో నింపిన కుండలను పెడతారు. ఆ మంటలకు కాగిన వేడినీటితో భోగి స్నానాలు చేస్తారు. భోగి మంటల్లో పాత వస్తువుల వేయడం వల్ల పీడతొలగి భాగ్యాల్ని అందిస్తుందని విశ్వాసం. భోగి రోజు పిల్లలకు రేగుపండ్లు తలపై పోస్తారు. సాయంత్రం చుట్టుపక్కల పెద్దవాళ్లను పిలిచి వారితో పిల్లలకు దిష్టి తీయిస్తారు. గుప్పిట నిండా రేగుపండ్లు, చిల్లరనాణేలు, బంతిపూల రెక్కలు, చెరకు ముక్కలు పిడికిలో తీసుకుని పిల్లలకు మూడుస్లారు దిష్టితీస్తారు. సంక్రాంతికి పంటలు చేతికందిన రైతులు రెండోపంట వేసుకునేందుకు తమ పొలాల్లో కొంత మేరకు నీరు పారించి భూమిని తడుపుతారు. దీన్ని పిలకవేయడం అంటారు. భోగి సందర్భంగా మహిళలు ఇంటిముంగిళ్లను రంగవల్లికలతో స్వరాంగ సుందరంగా తీర్చిదిద్దుతారు. ఆవుపేడతో తయారు చేసిన గొబ్బెమ్మలు, నవధాన్యాలు ముగ్గుమధ్యలో పెడతారు. ముత్తయిదువులు వాయినాలు ఇచ్చి పుచ్చుకుంటారు. శ్రీరంగనాథుడిని గోదాదేవి వివాహం చేసుకున్నది భోగిరోజు కావున.. వైష్ణవ ఆలయాల్లో భోగిరోజు గోదాదేవి కల్యాణం నిర్వహిస్తారు. కొన్నిప్రాంతాల్లో బొమ్మల కొలువును ఏర్పాటు చేసి ముత్తయిదువులను పేరంటానికి పిలిచి సత్కరిస్తారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా సంక్రాంతిని మూడురోజులు పాటు ఘనంగా జరుపుకునేందుకు ప్రజలు సిద్ధం అవుతున్నారు.



‘కంటి వెలుగు’ను విజయవంతం చేయండి

- కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్

చిగురుమామిడి(మానకొండూర్): ఈ నెల 18వ తేదీ నుంచి అమలు కానున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ ఆదేశించారు. శుక్రవారం చిగురుమామిడి మండలంలోని చిన్నముల్కనూర్ ఆరోగ్య ఉప కేంద్రంలో, చిగురుమామిడి పీహెచ్‌సీలో, తిమ్మాపూర్ మండలంలోని రామకృష్ణకాలనీలో ఏర్పాటు చేసిన కేంద్రాలను ఆయన పరిశీలించారు. కంటి వెలుగు శిబిరానికి వచ్చే ప్రజలకు మంచినీరు, కూర్చోడానికి కుర్చీలు, షామియానాలు ఏర్పాటు చేయాలన్నారు. వారి వివరాలను ట్యాబ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయాలని చెప్పారు. అవసరం ఉన్న వారికి రీడింగ్ గ్లాసులు వెంటనే ఇవ్వాలని, ప్రిస్క్రైబ్డ్ అద్దాల కోసం ఒకరు కేంద్రం నుంచే కంపెనీకి ఆర్డర్ పెట్టాలన్నారు. కంటి వెలుగు విధులు నిర్వహించే వారికి వసతి, భోజనం, వాహన సౌకర్యాలను కల్పించాలని అధికారులకు సూచించారు. ఆశవర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లతో మాట్లాడుతూ.. ప్రజలతోపాటు మీ ఆరోగ్యం కూడా చూసుకోవాలని చెప్పారు. అందరూ ఎనీమియా పరీక్షలు చేయించుకొని, రక్తహీనత ఉన్నవారు ఐరన్ మాత్రలు తీసుకోవాలన్నారు. మండల ప్రత్యేకాధికారి నేతానియల్, చిగురుమామిడి, తిమ్మాపూర్ మండలాల తహసీల్దార్లు ఎండీ.ముబీన్‌అహ్మద్, కనకయ్య, ఎంపీడీవో నర్సయ్య, ఏపీవో శ్రావణ్‌కుమార్, మెడికల్ ఆఫీసర్ ధర్మనాయక్, సర్పంచులు బెజ్జంకి లక్ష్మణ్, మీసాల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.


చిగురుమామిడిలో వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ కర్ణన్

సమాచారం ముందుగానే అందించాలి

కరీంనగర్‌టౌన్: రెండో విడత కంటివెలుగు కార్యక్రమం నిర్వహణ సమాచారాన్ని ముందుగానే ప్రజలకు తెలియజేయాలని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో వైద్యాధికారులు, ప్రోగ్రాం అధికారులు, కంటివెలుగు బృందాలతో సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన కంటివెలుగు బృందాలు ఏ రోజు, ఎక్కడ శిబిరాన్ని నిర్వహిస్తారన్న సమాచారంతో కూడిన ఆహ్వాన పత్రం, కరపత్రాలను అంగన్‌వాడీ సిబ్బంది ద్వారా ప్రజలకు అందించాలని అన్నారు. డాక్టర్, ఆప్తమాలజిస్ట్ లేకుండా క్యాంప్ నిర్వహించకూడదని, క్యాంపునకు హాజరుకాని పక్షంలో ప్రోగ్రాం అధికారి సహాయంతో అదనంగా ఉన్న సిబ్బందిని పంపిస్తామని తెలిపారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, డీఎంహెచ్‌వో జువేరియా, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ రత్నమాల, స్త్రీ, శిశు సంక్షేమ అధికారి సబితా కుమారి, ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్
- ముగిసిన పార్టీ జిల్లాశాఖ క్రికెట్ పోటీలు

కరీంనగర్‌టౌన్: క్రీడలు మానసికోల్లాసానికి దోహదం చేస్తాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అన్నారు. స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని పార్టీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నాయకులకు కోతిరాంపూర్ గిద్ద పెరుమాండ్ల దేవాలయ గ్రౌండ్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు శుక్రవారం సాయంత్రం ముగిశాయి. బహుమతి ప్రదానోత్సవానికి హాజరైన ఆయన విజేత, రన్నర్ జట్లకు, బెస్ట్ బ్యాట్స్‌మెన్, బెస్ట్ బౌలర్‌లకు మెమెంటోలు, ట్రోఫీలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. క్రీడల్లో గానీ, రాజకీయాల్లో గానీ గెలుపోటములు సహజమన్నారు. వాటిని సమానంగా స్వీకరించి, ముందుకుసాగితే విజయం సాధిస్తారని చెప్పారు. ముఖ్యంగా రాష్ట్రంలోని ప్రజావ్యతిరేక ప్రభుత్వంతో బీజేపీ శ్రేణులు అనునిత్యం పోరాటం చేస్తున్నాయని తెలిపారు. ఇలాంటి సమయంలో నాయకుల మానసికోల్లాసానికి క్రీడాపోటీలు చేపట్టడం అభినందనీయమన్నారు. జిల్లా బీజేవైఎం జట్టు గెలుపొందగా, ప్రెసిడెంట్ లెవెల్ జట్టు రన్నర్స్‌గా నిలిచింది. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, క్లోం వాసుదేవ రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రాల వెంకట్ రెడ్డి, జిల్లా కార్యదర్శి రాపర్తి ప్రసాద్, జిల్లా ఆఫీస్ సెక్రటరీ మాడుగుల ప్రవీణ్, మీడియా కన్వీనర్ కటకం లోకేశ్, అధికార ప్రతినిధి బొంతల కల్యాణ్, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దురుశెట్టి సంపత్, అధికార ప్రతినిధి బండారి గాయత్రి, నాయకులు బండ రమణారెడ్డి, మామిడి చైతన్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతి అందిస్తున్న ఎంపీ సంజయ్

క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కరీంనగర్ క్రైం: తెలంగాణ ప్రొహిబిషన్ ఎక్సైజ్ రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్‌ను శుక్రవారం తెలంగాణ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ పెన్షనర్ల సంఘం బాధ్యులు, కరీంనగర్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ఎక్సైజ్ కేఏబీ శాస్త్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకట్, శంకర్, చంద్రశేఖర్, పర్శరాములు, సత్తయ్య, సయ్యద్ హఫీజుద్దీన్, లింగరాజ్, ప్రకాశం, హంక్యానాయక్, అసిస్టెంట్ కమిషనర్ విజయ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బహుజన ఉపాధ్యాయ సంఘు కార్యవర్గం


రాజయ్య


అంజన్‌బాబు

విద్యానగర్(కరీంనగర్): బహుజన ఉపాధ్యాయ సంఘం కరీంనగర్ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికలను నగరంలోని సంఘం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా మానుపాటి రాజయ్య, ప్రధాన కార్యదర్శిగా జంగం అంజన్‌బాబు, ఉపాధ్యక్షులుగా పొత్తూరి దేవదాసు, కన్నం అశోక్, అందె రాజమల్లు, జెట్టి రవీందర్, జిల్లా కార్యదర్శులుగా మేక నగేశ్, జంగం సురేష్‌కృష్ణ, అంగడి శ్రీనివాస్, మానుపాటి రాజమల్లు, సాంస్కృతిక కార్యదర్శిగా గడ్డం మల్లేశంలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము రమేశ్, ఉపాధ్యక్షులు తమ్మడి సుధీర్, బెజుగం రమేశ్ పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీల ఫొటోల అప్‌లోడ్ ఉపసంహరించుకోండి

కరీంనగర్: ఉపాధిహామీ పనుల్లో ఎన్‌ఎంఎంఎస్ (నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్) సాఫ్ట్‌వేర్‌లో ప్రతీరోజు రెండు పూటలా కూలీల ఫొటోలను అప్‌లోడ్ చేయాలన్న కొత్త పద్ధతిని కేంద్రం వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. అందులో భాగంగానే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ఈ పథకానికి బడ్జెట్ కేటాయింపులో కోత విధించారన్నారు. గతంలో కూలీలు ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు పనిచేసే వారని, కొత్త నిబంధన వల్ల రెండు పూటలా పనులు చేయాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఈ విధానాన్ని మానుకోవాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా కూలీలకు రూ.400 కూలి చెల్లించాలని, 200 రోజులు పని కల్పించాలని కోరారు.

బడి బయటి పిల్లలపై సర్వే

- పాఠశాలల్లో చేర్పించేందుకు విద్యాశాఖ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్
- ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్న అధికారులు
- జిల్లాలో ఇప్పటివరకు 35 మంది గుర్తింపు

కరీంనగర్: పాఠశాలలకు వెళ్లకుండా కూలి పనుల్లో తల్లిదండ్రులకు సహాయం చేస్తూ, ఇల్లు గడవక దుకాణాలు, హోటళ్లలో పని చేస్తున్న పిల్లలు కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా చాలామంది ఉన్నారు. ఇలా బడి బయట ఉన్న 1,266 మందిని స్వచ్ఛంద సంస్థలు గుర్తించి, విద్యాశాఖ అధికారులకు ఇటీవలే నివేదికలు అందజేశాయి. దీంతో వారిని పాఠశాలల్లో చేర్పించేందుకు విద్యాశాఖ స్పెషల్ డ్రైవ్ ప్రారంభించింది. ఏటా డిసెంబర్ నెలలో ఈ కార్యక్రమం ప్రారంభమయ్యేది. వివిధ కారణాలతో పిల్లలు పాఠశాలలకు వెళ్లకుండా డ్రాపవుట్ అవుతున్నారు. ఇందులో భాగంగా ప్రతీ సంవత్సరం 6 నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలు ఎంతమంది బడి బయట ఉన్నారన్న అంశంపై సర్వే చేపడుతుంది. వారిని పాఠశాలలో చేర్పించి, చదువుకునేలా చర్యలు తీసుకుంటుంది. ఈ నెల 9వ తేదీ నుంచి 18వ తేదీ వరకు 10 రోజుల పాటు మండలాల వారీగా విద్యాశాఖ ఆధ్వర్యంలో సీఆర్‌పీలు, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్లు, విలీన విద్య బోధకులు ఇంటింటికీ వెళ్లి, చదువు మానేసిన పిల్లల వివరాలు సేకరిస్తున్నారు. ఈ సర్వేలో గత గురువారం వరకు 35 మంది చిన్నారులను గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు.

జిల్లాలో 16 మండలాలు

కరీంనగర్ జిల్లాలో 16 మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో బడి బయటి పిల్లలను గుర్తించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. డీఎల్‌ఎంటీలు, ఐఈఆర్‌పీలు, సీఆర్‌పీలకు ఇదివరకే శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి, అవగాహన కల్పించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో పేర్లు నమోదు కానివారు, బడీడు పిల్లలను చేర్చేందుకు ప్రత్యేక కార్యాచరణ మొదలైంది. జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రావు, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారి అశోక్‌రెడ్డి ఆయా మండలాల విద్యాధికారులకు దిశానిర్దేశం చేశారు. బడీడు పిల్లలతోపాటు దివ్యాంగులను సైతం గుర్తించనున్నారు.

25న ఉన్నతాధికారులకు నివేదిక

చదువు మధ్యలో మానేసిన వారిని గుర్తించి సమీపంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించాల్సి ఉంటుంది. ప్రతీ గ్రామంలోని పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల వద్ద విలేజ్ ఎడ్యుకేషన్ ఇన్‌ఫర్మేషన్ రిజిస్టర్ ఉంటుంది. అందులో 0–14 ఏళ్ల వయసున్న పిల్లల సమాచారం ఉంటుంది. తాజాగా సర్వే అనంతరం బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించాక ఇక గ్రామంలో ఎవరూ లేరని ప్రధానోపాధ్యాయులు రాతపూర్వకంగా డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చేరితే టీసీ అవసరం లేకుండా అడ్మిషన్ ఇవ్వాలి. ఈ ప్రక్రియ పూర్తి చేసి, ఈ నెల 25న నివేదికను ఉన్నతాధికారులకు అందజేయాల్సి ఉంది.


మానకొండూర్‌లో సర్వే చేస్తున్న అధికారులు

సర్వే తీరు ఇలా..

- ఈ నెల 19వ తేదీ వరకు పని దినాల్లో నిర్వహిస్తారు.
- బడీడు చిన్నారులకు సంబంధించి 28 అంశాలు నమోదు చేస్తారు.
- 9వ తేదీ నుంచి 19వ తేదీ వరకు మండల వనరుల కేంద్రంలో వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరిచి, 25న తుది నివేదిక సమర్పిస్తారు.
- మానసిక దివ్యాంగులను సైతం గుర్తిస్తారు. భవిత కేంద్రాల్లో చేర్పించి, విద్యాబుద్ధులు నేర్పుతూ, ఫిజియోథెరపీ చేయిస్తారు.

బడీడు పిల్లలకు విద్యనందించడమే లక్ష్యం

జిల్లాలో బడి బయటి పిల్లల సర్వే జరుగుతోంది. గుర్తించిన వారిని స్థానిక పాఠశాలల్లో చేర్పిస్తారు. ఈ నెల 19వ తేదీ వరకు సర్వే చేస్తాం. విద్యాహక్కు చట్టం ప్రకారం బడీడు పిల్లలకు విద్యనందించడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నాం.
– జనార్దన్‌రావు, డీఈవో

'కంటి వెలుగు'కు ఏర్పాట్లు పూర్తి

- మేయర్ సునీల్‌రావు
- కరీంనగర్ నగరవ్యాప్తంగా 13 సెంటర్లలో శిబిరాలు

కరీంనగర్ సిటీ: ఈ నెల 18 నుంచి రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నామని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థలో ఏర్పాటు చేసిన నమూనా సెంటర్‌ను శుక్రవారం కమిషనర్ సేవా ఇస్లావత్‌తో కలిసి పరిశీలించారు. కంటి శిబిరంలో కల్పించిన తాగు నీరు, మరుగుదొడ్ల వసతులను తనిఖీ చేశారు. కంటి సమస్యలున్నవారు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగరవ్యాప్తంగా 13 సెంటర్లలో ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. డివిజన్‌వారీగా ప్రజలు తమ ఆధారు కార్డుతో వచ్చి, పేరు నమోదు చేసుకొని, కంటి పరీక్షలు చేయించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ స్వరూపారాణి, డిప్యూటీ కమిషనర్ త్రయంబకేశ్వర్, ఎస్‌ఈ నాగమల్లేశ్వర్‌రావు, ఈఈలు కిష్టప్ప, మహేందర్, డీఈ వెంకటేశ్వర్, ఏఈ నిఖిత, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.


నమూనా సెంటర్‌ను పరిశీలిస్తున్న మేయర్ సునీల్‌రావు, కమిషనర్ ఇస్లావత్

21న స్వచ్ఛత పోటీలు

స్వచ్ఛ సర్వేక్షన్–2023లో భాగంగా కరీంనగర్ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో జనవరి 21న స్వచ్ఛత పోటీలు నిర్వహిస్తామని మేయర్ సునీల్‌రావు తెలిపారు. స్థానిక భగత్‌నగర్ క్యాంపు కార్యాలయంలో కమిషనర్ సేవా ఇస్లావత్‌తో కలిసి సంబంధిత పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులకు స్థానిక అంబేడ్కర్ స్టేడియంలో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. నగర స్వచ్ఛత అనే అంశంపై వ్యాసరచన, వాల్ పేయింటింగ్, షార్ట్ ఫిలిం షూట్, వీధి నాటక ప్రదర్శన వంటి పోటీలుంటాయన్నారు. ప్రథమ స్థానంలో నిలిచినవారికి రూ.5 వేలు, ద్వితీయ స్థానం సాధించినవారికి రూ.3 వేల నగదు బహుమతిని నగరపాలక సంస్థ ద్వారా అందిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 13 నుంచి 18 వరకు నగరపాలక సంస్థ ఈ–మెయిల్ ఐడీ knrcmnr@rediffmail.com కి వివరాలు పంపించి, పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రధానంగా షార్ట్ ఫిలిం కాంపిటీషన్‌లో పాల్గొనేవారు లఘుచిత్రాన్ని చిత్రీకరించి, 21వ తేదీన ప్రదర్శించాలని తెలిపారు. పూర్తి వివరాలకు 98499 07544 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ త్రయంబకేశ్వర్, శానిటేషన్ సూపర్‌వైజర్ రాజమనోహర్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ధనాధన్ టోర్నీకి వేళాయె..

సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీకి ఎంట్రీల ఆహ్వానం

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

SPL
SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

Regional sponsor

SUDHAKAR
PIPES AND FITTINGS
LEADER IN QUALITY AND TECHNOLOGY

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపాదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్–19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్–25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్‌ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్ఠంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు
95055 14424, 99124 40790
గమనిక : అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

కరీంనగర్: పట్టణంలో నివసిస్తున్న అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని, పెన్షన్, రేషన్‌కార్డులు మంజూరు చేయాలన్న డిమాండ్‌తో ఆర్‌పీఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే దీక్ష శుక్రవారం నాలుగో రోజుకు చేరింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సయ్యద్ షఫీ మాట్లాడుతూ.. స్థానిక పేదలు సరైన ఉపాధి అవకాశాలు లేక లేబర్ అడ్డా కూలీలుగా పని చేస్తూ అద్దె గదుల్లో ఉండేందుకు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వ ఆధీనంలో నిరుపయోగంగా ఉన్న భూమిలో దారిద్ర్యరేఖకు దిగిన ఉన్నవారికి ఇళ్ల స్థలాలు కేటాయించాలని అన్నారు. ఈ విషయమై పలుమార్లు జిల్లా అధికారులకు విన్నవించినప్పటికీ స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రజాసంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. స్థలాలు కేటాయించని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.


రిలే దీక్షలో నాయకులు, బాధితులు

ఘనంగా గోదారంగనాథస్వామి కల్యాణం

ఇల్లందకుంట(హుజూరాబాద్): మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో ధనుర్మాస ముక్కోటి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీగోదారంగనాథస్వామి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శేషం రామాచార్యులు, వంశీధరచార్యుల వేదమంత్రోచ్చరణల మధ్య కల్యాణం జరిపించారు. అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్, డీఈవో జనార్దన్‌రావులు హాజరై, ప్రత్యేక పూజలు చేశారు. వారికి అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందించి, సన్మానించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కార్యనిర్వాహక అధికారి కందుల సుధాకర్ ఏర్పాట్లు చేయించారు. స్థానిక ఎస్సై తోట తిరుపతి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అనంతరం ఎంపీపీ సరిగొమ్ముల పావని వెంకటేశ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ కంకణాల శ్రీలత దంపతులు, తనుగుల సింగిల్‌విండో చైర్మన్ పోల్సాని వెంకటేశ్వర్‌రావు దంపతులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్

కాళేశ్వరంలో మంత్రి 'గంగుల' తండ్రి అస్థికల నిమజ్జనం

కాళేశ్వరం: రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ తండ్రి మల్లయ్య ఇటీవల చనిపోయిన విషయం విదితమే. శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని త్రివేణి సంగమ గోదావరిలో తండ్రి అస్థికలకు మంత్రి తన సోదరులతో కలిసి, నిమజ్జనం చేశారు. అంతకుముందు భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శంకర్, సివిల్ సప్లయ్ అధికారులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



తండ్రి అస్థికలకు పూజ చేస్తున్న మంత్రి కమలాకర్, ఆయన సోదరులు

ధర్మపురి గోదావరిలో..

ధర్మపురి: మంత్రి గంగుల కమలాకర్ తన తండ్రి మల్లయ్య అస్థికలను శుక్రవారం సోదరులతో కలిసి ధర్మపురిలోని పవిత్ర గోదావరిలో నిమజ్జనం చేశారు. అనంతరం నదిలో స్నానమాచరించారు.

మంత్రి గంగులకు ఎంపీ బండి పరామర్శ

కరీంనగర్: రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ తండ్రి మల్లయ్య చిత్రపటానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ శుక్రవారం నివాళులర్పించారు. అనంతరం మంత్రిని పరామర్శించారు. మల్లయ్య ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, నాయకులు బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, బోయినిపల్లి ప్రవీణ్‌రావు, కార్పొరేటర్లు పెద్దపల్లి జితేందర్, కచ్చు రవి, కొలగాని శ్రీనివాస్, బండ రమణారెడ్డి, సొల్లు అజయ్ వర్మ తదితరులు పాల్గొన్నారు.


మల్లయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ సంజయ్, నాయకులు

నాయీబ్రాహ్మణ యువజన విభాగం నగర కమిటీ ఎన్నిక

సప్తగిరికాలనీ(కరీంనగర్): తెలంగాణ నాయీ బ్రాహ్మణ ఐక్యవేదిక యువజన విభాగం నగర కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బోనకుర్తి సాయికృష్ణ, ప్రధాన కార్యదర్శిగా విలాసాగరం అనిల్‌కుమార్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుంజపడుగు హరిప్రసాద్, జిల్లా అధ్యక్షుడు జంపాల నర్సయ్య, ప్రధాన కార్యదర్శి సింగిరాల వెంకటస్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీరాముల రమేశ్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఆదిములం మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యుదాఘాతంతో యువకుడి దుర్మరణం

ఇల్లందకుంట(హుజూరాబాద్): సిరిసేడు గ్రామానికి చెందిన ఓ యువకుడు విద్యుదాఘాతంతో మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. దూలం తిరుపతి(24) గురువారం రాత్రి ఇంట్లో కరెంటు వైర్లకు మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతం సంభవించింది. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి శ్రీనివాస్ శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తోట తిరుపతి పేర్కొన్నారు.


తిరుపతి మృతదేహం

రైలు కిందపడి భూపాలపల్లివాసి మృతి

జమ్మికుంట(హుజూరాబాద్): రైలు కింద పడి ఓ యువకుడు మృతి చెందాడు. రామగుండం రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ గంగారపు తిరుపతి వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా వెంకట్రావుపల్లికి చెందిన పోలోజు రమేశ్(25) ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ పని చేస్తుంటాడు. ఈ క్రమంలో శుక్రవారం జమ్మికుంట–ఉప్పల్ రైల్వేస్టేషన్ల మధ్య రైలు కిందపడి మృతిచెందాడు. అయితే అతను ఓ అమ్మాయి ఇబ్బందులు పెట్టడం వల్లే చనిపోయాడని మృతుడి బంధువులు తెలిపారు. రమేశ్ మృతిపై తమకు అనుమానం ఉందని మృతుడి తల్లి కవిత ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ పేర్కొన్నారు.

ఒకరి ఆత్మహత్య

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ పట్టణానికి చెందిన కొయ్యడ శంకరయ్య(55) ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. శంకరయ్య కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. ఆసుపత్రులకు వెళ్లినా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో శుక్రవారం ఇంటి ఆవరణలోని చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడికి భార్య అంజలి, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కరీంనగర్: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా బిల్డింగ్ పేయింటింగ్ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బంద్ ప్రకటిస్తున్నట్లు జేఏసీ చైర్మన్ చాడ ఆనంద్ తెలిపారు. శుక్రవారం కరీంనగర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిఒక్కరూ రాజీవ్‌చౌక్‌లో గల ఫంక్షన్ హాల్‌లో ప్రతీరోజు ఉదయం 10 గంటలకు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఐదు రోజులు భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న ప్రతీ కార్మికుడికి ఉచితంగా ఇన్సూరెన్స్, ఈ–శ్రమ్ కార్డు, హెల్త్ చెకప్, మందుల పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్మికులు తమ వెంట ఆధార్ కార్డు జిరాక్స్, ఐదు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, రేషన్‌కార్డు జిరాక్స్, ఆధార్ కార్డు లింక్ ఉన్న ఫోన్ నంబర్‌తో రావాలని సూచించారు. ఇంటి ఓనర్లు, ఇంజినీర్లు, బిల్డర్లు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అంబాల ప్రభాకర్, బషీరొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాయకులు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

- అప్పుల బాధతో ఈ నెల 11న ఆత్మహత్యాయత్నం

ఇల్లందకుంట(హుజూరాబాద్): అప్పుల బాధతో ఆత్మహత్యాయత్నం చేసిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఇల్లందకుంట మండల కేంద్రానికి చెందిన కనుమల్ల పోశెట్టి(52) కుటుంబ పోషణకు అప్పులు చేశాడు. వాటిని తీర్చే మార్గం లేక నిత్యం మనోవేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 11న ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి ఒక కూతురు కాగా వివాహమైంది. శుక్రవారం పోశెట్టి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.


పోశెట్టి మృతదేహం

బైక్ ఢీకొని తాతామనవడికి తీవ్ర గాయాలు

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని వంకాయగూడెంలో బైక్ ఢీకొని, తాతామనవడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వంకాయగూడెం గ్రామానికి చెందిన పొన్నం ఎల్లయ్య శుక్రవారం తన మనవడితో కలిసి బైక్‌పై రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో కేశవపట్నం వైపు నుంచి వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో తాతామనవడు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108కు సమాచారం అందించడంతో సిబ్బంది సురేశ్ వచ్చి, క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేశారు. అనంతరం వారిని కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.


వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో..


విద్యానగర్‌లో..


కోదండ రామాలయంలో..

వైభవం.. స్వామి వారి కల్యాణం

ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా నగరంలోని పలు ఆలయాల్లో శుక్రవారం శ్రీగోదాదేవి రంగనాథుల కల్యాణం వైభవంగా జరిపించారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీనిలయంలో జ్యోతిష్య వాస్తు పండితుడు నమిలికొండ రమణాచార్యుల ఆధ్వర్యంలో కన్నుల పండువగా నిర్వహించారు. అశోక్‌నగర్ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో చాత్తాద శ్రీవైష్ణవ సంఘం ఆధ్వర్యంలో, విద్యానగర్‌లో శ్రీయతిరాజ సేవా మండలి, వికాసతరంగిణి సంయుక్త ఆధ్వర్యంలో, సప్తగిరికాలనీ కోదండ రామాలయంతో పాటు టీటీడీ కల్యాణ మండపంలో కల్యాణం జరిపారు. భారీసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి కల్యాణం తంతు తిలకించి పులకించిపోయారు. – సప్తగిరికాలనీ(కరీంనగర్)


శ్రీనిలయంలో ..


కోదండ రామాలయంలో హాజరైన భక్తులు

చిత్ర కథ



ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు

నగరంలో వాహనాల రద్దీ ఎక్కువ కావడంతో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు చర్యలు చేపట్టారు. పలు కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేస్తున్నారు. వాటిలో కొన్నింటిని శనివారం ప్రారంభించే అవకాశాలున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

కరీంనగర్: టీఆర్‌టీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం కలెక్టర్ ఆర్వీ కర్ణన్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులు ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు ప్రత్యేక తరగతులకు హాజరవుతున్నందున వారికి స్నాక్స్ అందజేయాలని టీఆర్‌టీఎఫ్ జిల్లా శాఖ విజ్ఞప్తి చేయగా కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నందికొండ విద్యాసాగర్, చింతపల్లి అశోక్‌రావు, రాష్ట్ర బాధ్యులు మధుచంద్ర, జిల్లా బాధ్యులు రవీందర్‌రెడ్డి, హబీబుల్ రహమాన్, మండల బాధ్యులు అనిల్, కుమారస్వామి, యువరాజ్, మహి హుద్దీన్, సలీం తదితరులు పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధి ప్రణాళికపై సమావేశం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం గ్రామ అభివృద్ధి ప్రణాళిక 2013–24 సంవత్సరం తయారీపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో జగన్మోహన్‌మోహన్‌రెడ్డి అవగాహన సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 9 అంశాలపై పంచాయతీ నిధులను దశలవారీగా ఖర్చు చేయడంపై వివరించారు. ఈనెల 16న అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సర్పంచులు జక్కం నర్సయ్య, తప్పెట్ల భూమయ్యతో పాటు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ


వేణుగోపాలశర్మను సన్మానిస్తున్న కవులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): పద్య కవితా సదస్సు ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో శుక్రవారం మన్నెంపల్లికి చెందిన రామక రామయ్యశర్మ భక్తి శతకమందార మకరందాలు ద్వితీయ ముద్రణ, ఉపాధ్యాయుడు, కవి శేషం వేణుగోపాలశర్మ ఎంఫిల్ పరిశోధక గ్రంథం రామక రామశర్మ రచనలు పరిశీలన పుస్తకాలను గంగవరం నారాయణశర్మ, పురాణం మహేశ్వరశర్మ ఆవిష్కరించారు. అనంతరం పలు శతకాలు రాసిన, పద్య కవితాసేద్యం చేస్తున్న వేణుగోపాలశర్మను అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో పురాణం చంద్రమౌళీశ్వరశర్మ, గంగవరం ఆంజనేయశర్మ, బీఎస్‌ఆర్ శర్మ, రాజారాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

ఇల్లందకుంట: మండలంలోని శ్రీరాములపల్లి గ్రామంలో నిర్మిస్తున్న కేజీబీవీ నూతన భవన నిర్మాణ పనులను శుక్రవారం అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్ పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించి పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. శ్రీరాములపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో మనఊరు మనబడి పనులపై సంతృప్తి వ్యక్తం చేసి పెండింగ్ పనులు తక్షణం పూర్తి చేయాలని ఏఈని ఆదేశించారు. అసంపూర్తిగా అంగన్వాడీ భవన పనులు పూర్తి చేయాలని సర్పంచ్ మొగిలికి సూచించారు. రెండో విడత కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో పలు శాఖల అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు, మల్లారెడ్డి, సర్పంచ్ కంకణాల శ్రీలత, డాక్టర్ తులసిదాస్, ఎస్‌వో రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

గాలిపటమా.. పద పదా..

- ఉత్సాహంగా పతంగుల ఎగురవేత
- మైదానాలు, ఇంటి డాబాలపై చిన్నారుల సందడి

సప్తగిరికాలనీ(కరీంనగర్): సంక్రాంతి.. మూడు రోజుల పాటు ఇంటిల్లిపాది సంబురంగా జరుపుకునే పండుగ. చిన్నారి బాలికలు తమ ఇంటి ముంగిట్లో రంగురంగుల చుక్కల ముగ్గులకు రంగులు దిద్దుకుంటూ ఉంటే.. చిన్నారి బాలలు తమ మిత్రులతో కలిసి పతంగులను ఎగురవేస్తుంటారు. ఇలా మూడు రోజుల పాటు బాలబాలికలు రంగుల పండుగకు తోడు, పతంగుల పండగ జరుపుకుంటారు. శుక్రవారం నుంచి విద్యాసంస్థలకు సెలవులు రావడంతో బాలురు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయా మైదానాల్లో పతంగులను ఎగరవేస్తున్నారు. దీంతో అసలైన సంక్రాంతి పండుగ పతంగులతో సంతరించుకుంది.

నగరంలో పతంగుల సందడి

సంక్రాంతి పండుగ సెలవులు రావడంతో నగరంలోని పలు మైదానాలు సందడిగా మారాయి. కరోనా కారణంగా రెండేళ్ల అనంతరం ఆనందంగా పతంగులు ఎగురవేస్తున్నారు. చిన్నారులకు తోడు తల్లిదండ్రులు సైతం వచ్చి పతంగులు ఎగురవేయడం విశేషం. అంతేకాకుండా ఇంటి డాబాలు, అపార్ట్‌మెంట్‌లపై ఎక్కి మరీ ఎగురవేస్తున్నారు. దీంతో చిన్నారులను ఆకర్షించేందుకు రంగురంగుల, వెరైటీ పతంగుల విక్రయాలు మార్కెట్‌లో జోరందుకున్నాయి. జాతీయ పతాకం, స్పైడర్‌మాన్, ఆవేంజర్, డ్రాగన్, టామ్ అండ్ జెర్రీ, టెడ్డీబేర్ తదితర రకాల పతంగులను విక్రయిస్తున్నారు.


అంబేడ్కర్ స్టేడియంలో పతంగులు ఎగురవేస్తున్న చిన్నారులు, తల్లిదండ్రులు


ఇంటి డాబాపై పతంగులతో చిన్నారులు

ఇంటి పైకి ఎక్కి..



కైట్స్‌లను ఇంటిపైకి ఎక్కి అక్కతో కలిసి ఎగురవేస్తా. ఫస్ట్ టైమ్ కైట్‌లను ఎగురవేస్తున్న. పైకి ఎగురవేసేందుకు ట్రై చేస్తున్నా. వచ్చే సంవత్సరం సంక్రాంతి నాటికి కైట్స్‌లను ఎగురవేయడం పూర్తిగా నేర్చుకుంటా. – సమన్విత్

పతంగులు ఎగురవేయడమంటే ఇష్టం



సంక్రాంతి పండుగ ఎప్పుడు వస్తుందా.. మార్కెట్‌లో పతంగులను ఎప్పుడు అమ్ముతారా అంటూ ఎదురు చూస్తాం. సంవత్సరంలో మూడు నాలుగు రోజులు మాత్రమే ఎగురవేస్తాం. పతంగులు ఎగురవేయడమంటే నాకు చాలా ఇష్టం. – మారుతి నాయక్

నాన్న నేర్పిస్తున్నారు



పతంగులు ఎగురవేయడం నాకు రాదు. అంబేడ్కర్ స్టేడియానికి నాన్న వచ్చి ఎలా ఎగురవేయాలో నేర్పిస్తున్నారు. పతంగులను ఎగురవేయడం చాలా సరదాగా ఉంది. సెలవుల్లో పతంగులు ఎగురవేయడం నేర్చుకుంటా. – వైభవ్

ఫ్రెండ్స్‌తో కలిసి..



కైట్ ఫెస్టివల్ వచ్చిందంటే ఫ్రెండ్స్ అందరం కలిసి ఉదయం ఒకసారి, మధ్యాహ్నం అన్నం తిన్న తర్వాత సాయంత్రం వరకు పతంగులు ఎగురవేస్తూనే ఉంటాం. ఎవరిది ఎత్తుకు ఎగురుతుందో వారే విన్నర్. మేము చాలా బాగా ఎగురవేస్తాం. – జస్వంత్

ఫస్ట్ టైమ్ ఎగురవేస్తున్న



పతంగులు ఎగురవేయడం అంటే చాలా ఇష్టం. ఇంట్లో అందరం కలిసి ఎగురవేసేందుకు వచ్చాం. ఫస్ట్ టైమ్ ఎగురవేస్తున్న. ఇక నుంచి ప్రతీ సంక్రాంతికి పతంగులు ఎగురవేస్తా. చాలా సంతోషంగా ఉంది. – చందన

నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి మరమ్మతు చేయాలి


సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నాయకులు

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్‌లోని సుభాష్‌నగర్ ప్రభుత్వ పాఠశాల ప్రక్కన ఏర్పాటు చేసిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి వెంటనే మరమ్మతులు చేయించాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి జోజిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి విగ్రహాన్ని పరిశీలించారు. వందేళ్ల చరిత్ర ఉన్న సుభాష్ చంద్రబోస్ విగ్రహం శిథిలావస్థలో ఉందని అన్నారు. కోట్లాది రూపాయలతో నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నామని గొప్పలు చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం దేశం కోసం త్యాగం చేసిన మహనీయుల విగ్రహాలను పట్టించుకోకపోవడం శోచనీయమని అన్నారు. ఈనెల 20లోగా సుభాష్‌చంద్రబోస్ విగ్రహానికి మరమ్మతు చేయకుంటే నగరపాలక సంస్థ కార్యాలయం ముట్టడించి ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ పక్షాన మరమ్మతు చేయిస్తామని తెలిపారు. విగ్రహాన్ని సందర్శించిన వారిలో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కార్యకర్తలు పులిమాటి సంతోష్, పెద్దెల్లి శేఖర్, బి.లింగమూర్తి, కుమార్, సిగిరి శ్రీధర్, బండ ప్రసాద్ ఉన్నారు.

కంటి వెలుగుపై మాక్ డ్రిల్


కొత్తపల్లిలో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న చైర్మన్, వైద్య సిబ్బంది

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 18వ తేదీ నుంచి శ్రీకారం చుట్టనున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు శుక్రవారం కొత్తపల్లిలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ప్రజలకు ఇబ్బందుల్లేకుండా ఐదు కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు తెలిపారు. పట్టణ ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా డిప్యూటీ వైద్యాధికారి వినత, మండల వైద్యాధికారి వంశీకృష్ణ, శుశ్రత ప్రియదర్శిని, మున్సిపల్ కమిషనర్ కె.వేణుమాధవ్, ప్రత్యేకాధికారి దేవేందర్, వైద్య సిబ్బంది శ్రీధర్‌రెడ్డి, శంకర్, సంధ్య, ఉమా, సుమతి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గో ఆధారిత వ్యవసాయం చేయాలి


మాట్లాడుతున్న నాగేందర్‌రెడ్డి

కరీంనగర్‌రూరల్: గో ఆధారిత వ్యవసాయం ద్వారా మంచి ఆహారాన్ని పండించుకునే అవకాశముందని కామధేను గోశాల ట్రస్టు సభ్యుడు, ప్రాంత గో ఉత్పత్తుల తయారీదారుల శిక్షణ ప్రముఖ్ గోగూరి నాగేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కరీంనగర్ మండలం నగునూరులో కామధేను విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గో ఆధారిత వ్యవసాయంపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. రసాయన ఎరువులు, పురుగుల మందు వినియోగించడంతో భూసారం తగ్గిపోయి నిర్జీవంగా మారుతుందన్నారు. విషపూరిత ఆహార పదార్థాలతో మానవుల ఆరోగ్యం దెబ్బతింటుందని తెలిపారు. మనం ఆరోగ్యంగా ఉండి భవిష్యత్తుతరాలకు మంచి ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని ఇవ్వాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో గోశాల ప్రధాన కార్యదర్శి నర్సింగం, కార్యదర్శి రాజేందర్‌రెడ్డి, సభ్యులు రామారావు, శ్రీనివాస్, కార్యక్రమ నిర్వాహకులు దావు సంతోశ్, అనిల్, సునీల్, మల్లయ్య, శంకర్, మణికంఠ, అఫ్రోజ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



ప్రమాదకరంగా డ్రెయినేజీ

నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఎదురుగా మూలమలుపు వద్ద ఉన్న డ్రెయినేజీ మీద పైకప్పు లేక ప్రమాదకరంగా ఉంది. ఎప్పుడూ తిరిగే జనసంచారం ఉంటున్నందున ప్రమాదం జరుగకముందే డ్రెయినేజీపై కప్పు వేయాలని నగరవాసులు కోరుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

ప్రశ్నించాల్సిన అధికారి : ఇస్లావత్ సేవా, మున్సిపల్ కమిషనర్
సెల్ నంబర్ : 98499 05876

క్రీడా పోటీలు ప్రారంభం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న తిరుపతి

కరీంనగర్‌స్పోర్ట్స్: యువతను క్రీడ రంగంలో ప్రోత్సహించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని డీవైఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.తిరుపతి అన్నారు. శుక్రవారం సప్తగిరికాలనీలో డీవైఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ క్రీడాపోటీలను ప్రారంభించారు. యువతను క్రీడారంగంలో ప్రోత్సహించేందుకు బడ్జెట్ కేటాయించకపోవడం, క్రీడా మైదానాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల పేద, మధ్య తరగతి ప్రతిభ గల క్రీడాకారులు క్రీడారంగంలో రాణించలేకపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నరేశ్, తిరుపతి, రాజు, అశోక్, నవీన్, రాజేందర్, శివ, ప్రకాశ్, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

పర్సు అప్పగింత



కరీంనగర్: కరీంనగర్ బస్‌స్టేషన్‌లో పర్సు పోగొట్టుకున్న కల్లెపల్లి అనూషకు శుక్రవారం కరీంనగర్ 1, 2 డిపో మేనేజర్లు ప్రణీత్, మల్లయ్య, బస్‌స్టేషన్ మేనేజర్ అంజయ్యలు తిరిగి అప్పగించారు. తాను పోగొట్టుకున్న పర్సు తిరిగి దొరకడంతో యువతి ఆనందం వ్యక్తం చేసింది.

బస్‌స్టేషన్‌లో ట్రాఫిక్ పర్యవేక్షణ

సంక్రాంతి పండుగ సందర్భంగా కరీంనగర్ బస్‌స్టేషన్‌లోని వివిధ రూట్లలో ప్రయాణీకుల రద్దీని కరీంనగర్–1, 2 డిపో మేనేజర్లు ప్రణీత్, మల్లయ్యలు శుక్రవారం పర్యవేక్షించారు అవసరమైన రూట్లలో తగు బస్సులను ఏర్పాటు చేశారు.

ఆదర్శనగర్ రాజరాజేశ్వరాలయ కమిటీ కార్యవర్గం



సప్తగిరికాలనీ(కరీంనగర్): నగరంలోని ఆదర్శనగర్ రాజరాజేశ్వరాలయ కమిటీ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఆలయ ఆవరణలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మెతుకు కనకయ్య, ఉపాధ్యక్షులుగా ఉస్కమల్ల మల్లయ్య, గంధం లక్ష్మీనారాయణ, కార్యదర్శులుగా దామరపల్లి జగ్గారెడ్డి, వైద్యుల అంజనీకుమార్, ప్రధాన కార్యదర్శిగా దామరపల్లి భూంరెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా జెల్ల సత్తయ్య, కందుకూరి రామబ్రహ్మం, తోట సత్యనారాయణ, కోశాధికారిగా మెతుకు జయలక్ష్మి, నిర్వాహణ కార్యదర్శులుగా నంది దేవేందర్, కస్తూరి అశోక్‌రెడ్డి, గంజి మనోహర్, ప్రచార కార్యదర్శులుగా ఇట్టనేని శ్రీనివాస్, దామరపల్లి జయపాల్‌రెడ్డి, వైద్యుల శ్రీధర్, సభ్యులుగా కొమురయ్య, విఠల్‌రెడ్డి, సత్యనారాయణ, రమణారావు, కోటేశ్వర్, వంశీధర్‌రెడ్డి, రోజర్ బిన్నీ, లక్ష్మణ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ముగ్గురికే మైనార్టీ రుణాలు

- మండలానికి మూడు యూనిట్లు
- 236మంది దరఖాస్తు

కరీంనగర్‌రూరల్: మైనార్టీల సంక్షేమానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు ప్రకటిస్తున్న ప్రభుత్వం క్షేత్రస్థాయిలో అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. ఆరేళ్ల నుంచి లక్షలాది మంది నిరుద్యోగులు స్వయంఉపాధి రుణాల కోసం నిరీక్షిస్తున్న తరుణంలో ఇటీవల మైనార్టీలకు రుణాలు మంజూరు చేస్తామని ప్రకటించింది. అయితే మండలానికి ముగ్గురికి మాత్రమే రుణాలు మంజూరు చేసేందుకు ప్రభుత్వం అవకాశమివ్వడంతో కరీంనగర్ రూరల్ మండలానికి అధికారులు మూడు యూనిట్లు కేటాయించారు. రూ.1 లక్ష యూనిట్–2, రూ.2లక్షల యూనిట్–1 ఉండగా.. రూ.లక్షలోపు రుణానికి 80శాతం సబ్సిడీ, రూ.2లక్షలకు 70శాతం సబ్సిడీ ఉంది. దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 9వ తేదీ వరకు అవకాశమివ్వడంతో 236 మంది నిరుద్యోగ యువకులు దరఖాస్తు చేసుకున్నారు. ప్రధానంగా బొమ్మకల్, దుర్శేడ్, నగునూరు, ఇరుకుల్ల, ఫకీర్‌పేట గ్రామాల నుంచి దరఖాస్తులు ఎక్కువగా వచ్చాయి. గ్రామాల వారీగా ఆయా దరఖాస్తులను పరిశీలించేందుకు పంచాయతీ కార్యదర్శులకు పంపించినట్లు ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. ఈనెల 18వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించినట్లు వివరించారు.

చిత్ర కథ



గుంతను పూడ్చడంలో నిర్లక్ష్యం

కరీంనగర్ మండలం మొగ్దుంపూర్ నుంచి చెర్లభూత్కూర్‌కు వెళ్లే రహదారిలో ఏర్పడిన గుంతను పూడ్చివేయడంలో ఆర్‌అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు ఈ ప్రాంతంలో వరదనీరు నిల్వ ఉండి భారీ వాహనాల రాకపోకలతో గుంతగా ఏర్పడింది. రాత్రివేళల్లో ద్విచక్రవాహనదారులు గుంతలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. గుంతను పూడ్చివేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు ఆర్‌అండ్‌బీ అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకరమైన గుంతను పూడ్చివేసేందుకు చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. – కరీంనగర్‌రూరల్

అయ్యో.. పాపం

బాలింతల మృత్యుఘోష!

- మలక్‌పేట ఏరియా ఆస్పత్రిలో ప్రసవం.. ఇద్దరు బాలింతలకు సీరియస్
- హుటాహుటిన గాంధీకి తరలింపు... చికిత్స పొందుతూ ఇద్దరు మృతి
- వైద్యుల నిర్లక్ష్యం వల్లేనని బంధువుల ఆరోపణ


మృతురాలు సిరివెన్నెల
సిరివెన్నెలకు పుట్టిన పాప


మృతురాలు శివాని
శివానికి పుట్టిన మగబిడ్డ

సాక్షి, హైదరాబాద్/మలక్‌పేట్/గాంధీ ఆస్పత్రి: ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రిలో కుటుంబ నియంత్రణ చికిత్సలు వికటించి నలుగురు మహిళలు మృతి చెందిన అంశాన్ని ఇంకా పూర్తిగా మరిచిపోక ముందే..తాజాగా గురువారం రాత్రి మలక్‌పేట ఏరియా ఆస్పత్రిలో ప్రసవించిన ఇద్దరు మహిళలు మృత్యువాత పడ్డారు. కేవలం గంట వ్యవధిలోనే ఆ ఇద్దరు తల్లులు కన్నుమూయడం విషాదం నింపింది. సిజేరియన్‌కు ముందు గర్భిణుల ఆరోగ్య పరిస్థితిని అంచనా వేయకపోవడం, వైద్య పరీక్షలు నిర్వహించకపోవడం, సిజేరియన్ చేసిన ప్రదేశాన్ని సరిగా శుభ్రం చేయకుండానే కుట్లు వేయడం వల్లే మృతిచెందారని బంధువులు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం ఆస్పత్రి ముందు ఆందోళనకు దిగారు. పోస్టుమార్టం రిపోర్ట్ ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని టీవీవీపీ కమిషనర్ హామీ ఇచ్చారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. అయితే ఈ మొత్తాన్ని తీసుకునేందుకు కుటుంబ సభ్యులు నిరాకరించారు. ఇదిలా ఉంటే శుక్రవారం ఉదయం డీఎంఈ రమేష్‌రెడ్డి, డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటిలు గాంధీకి చేరుకుని సూపరింటెండెంట్ రాజారావు సహా, గైనకాలజీ వైద్యులతో ప్రత్యేకంగా సమావేశమై బాలింతల మృతికి దారి తీసిన పరిస్థితులపై ఆరా తీశారు.

రెండో కాన్పుకోసం వచ్చిన సిరివెన్నెల

నాగర్‌కర్నూలు జిల్లా వెల్దండ మండలం చెదురుపల్లి గ్రామానికి చెందిన పోలే మహేష్ భార్య సిరివెన్నెల (25) రెండో కాన్పు కోసం సోమవారం ఆస్పత్రిలో చేరారు. వైద్యులు ఆమెకు బుధవారం సిజేరియన్ చేశారు. ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. ఆ తర్వాతి కొద్దిసేపటికే పల్స్ రేట్ ఒక్కసారిగా పడిపోయింది. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో అత్యవసర వైద్య సేవల పేరుతో వైద్యులు ఆమెను గాంధీకి తరలించారు. 2డీ ఎకో పరీక్ష సహా ఇతర వైద్య పరీక్షలు చేశారు. గురువారం రాత్రి పది గంటలకు మరణించింది. అయితే ఆమె గత ఐదు రోజులుగా డెంగీ జ్వరంతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. ఆస్పత్రి వైద్యులు ఈ విషయాన్ని గుర్తించకుండా ఆమెకు సిజేరియన్ చేయడం, ప్లేట్‌లెట్స్ సంఖ్య పడిపోవడానికి కారణమయ్యారని మృతురాలి భర్త మహేష్ ఆరోపించారు. వీరికి ఏడాదిన్నర పాప కూడా ఉంది. తల్లి లేదని తెలిసి ఆ పాప గుక్కపట్టి ఏడుస్తుండగా...అప్పుడే పుట్టిన శిశువు కనీసం ముర్రుపాలకు కూడా నోచుకోలేదు.

తొలి కాన్పు కోసం వచ్చిన శివాని

సైదాబాద్ పూసలబస్తీకి చెందిన రవీందర్, వెంకటలక్ష్మి కుమార్తె శివాని(25) మొదటి కాన్పు కోసం కుటుంబ సభ్యులు ఆమెను ఈనెల 10 తేదీన ఏరియా ఆసుపత్రిలో చేర్పించగా.. వైద్యులు బుధవారం ఉదయం సిజేరియన్ చేశారు. మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆ తర్వాత ఆమె అకస్మాత్తుగా విరేచనాలతో బాధపడింది. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో వైద్యులు ఆమెను గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. అయితే బాలింత మరణానికి థైరాయిడ్ కారణమని వైద్యులు చెబుతుండగా, సిజేరియన్ తర్వాత కుట్లు వేసే సమయంలో సరిగా శుభ్రం చేయక పోవడం వల్లే తన భార్య చనిపోయిందని, ఆరోగ్యంగా ఉన్న తన భార్య మృతికి ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆమె భర్త జగదీష్‌కుమార్ ఆరోపించారు.

ఆందోళనలు..ఆర్తనాదాలు

వైద్యుల నిర్లక్ష్యం వల్లే రెండు నిండు ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందని మృతుల బంధువులు ఆరోపించారు. కారణమైన వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఉదయం 9 గంటలకు మలక్‌పేట్ ఏరియా ఆసుపత్రి ఆవరణలో ఆందోళనకు దిగారు.బాధితుల కుటుంబాలకు రూ. 50లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలీసులు భారీగా అక్కడికి చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. శిశువులను నిలోఫర్ ఆస్పత్రికి తరలించేందుకు వాహ నం సమకూర్చినా తీసుకెళ్లేందుకు నిరాకరించారు. శిశువులను చూపిస్తూ కన్నీరుమున్నీరుగా విలపించారు.బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ నాయకులు బాధిత కుటుంబాలకు మద్దతుగా ఆందోళనలో పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: మలక్‌పేట ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం వికటించి ఇద్దరు బాలింతలు మృతి చెందిన ఘటన అత్యంత దారుణమని, ఈ ఘటన ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట అని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. హైదరాబాద్ చుట్టూ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు కడుతున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం.. కనీసం బాలింతలను కాపాడలేకపోతోందని విమర్శించారు.

చర్యలు తీసుకుంటాం

ఈ ఘటనపై నిపుణుల కమిటీతో విచారణ చేయిస్తాం. కుటుంబ సభ్యుల ఆరోపణల నేపథ్యంలో విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. ఆస్పత్రిలో 11 మంది డెలివరీ కాగా వీరిద్దరూ మినహా మిగతా వారంతా ఆరోగ్యంగా ఉన్నారు.

– టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్

అధ్యయనం చేస్తున్నాం

ఇద్దరు బాలింతల మరణాలకు గల కారణాలపై అధ్యయనం చేస్తున్నాం. మృతుల హెల్త్ రిపోర్ట్, మలక్‌పేట ఆస్పత్రిలో అందించిన వైద్యం, పోస్టుమార్టం నివేదిక తదితర అంశాలను క్రోడీకరించి పూర్తిస్థాయి నివేదిక రూపొందిస్తాం.

– డాక్టర్ రాజారావు, సూపరింటెండెంట్, గాంధీ


ఏరియా ఆసుపత్రి ఆవరణలో బంధువుల రోదనలు

నిమ్స్‌కు మరో ఎనిమిది మంది..

మలక్‌పేట్ ఏరియా హాస్పిటల్‌లో ఇద్దరు బాలింతల మృతితో వైద్యారోగ్యశాఖ అలర్ట్ అయింది. ఏ ఒక్కరికి ఇబ్బంది కాకుండా ముందస్తు చర్యలు చేపట్టింది. దానికి గల కారణాలపై ఆరా తీసింది. మొత్తం 10 మందికి సిజేరియన్లు జరగ్గా ఇందులో ఇద్దరు మృతి చెందారని, మెరుగైన వైద్యం కోసం మిగతా 8 మంది బాలింతలను నిమ్స్‌కు తరలించారు.

ఉన్నత విద్యలో 'షేరింగ్'

విద్యా సంస్థల మధ్య ఇచ్చిపుచ్చుకునే విధానానికి శ్రీకారం

- నాలెడ్జ్ షేరింగ్, నాలెడ్జ్ ట్రాన్స్‌ఫర్‌కి వీలుగా నిర్ణయం
- యూజీ, పీజీ, పరిశోధన కోర్సుల్లో అమలు
- అదనపు పెట్టుబడి అవసరంలేకుండా దగ్గర్లోని సంస్థల వనరుల వినియోగం
- ల్యాబ్‌లు, లైబ్రరీ, తరగతి గదులు ఇతర సదుపాయాలు పంచుకోవచ్చు
- ఉన్నత విద్యా సంస్థలకు యూజీసీ ఆదేశాలు



సాక్షి, అమరావతి: సెంట్రల్ వర్సిటీలు సహా దేశంలోని అన్ని ఉన్నత విద్యాసంస్థల్లోని వనరులను సద్వినియోగం చేయడం, సమీపంలోని ఇతర ఉన్నత విద్యాసంస్థలు కూడా వాటిని పూర్తిస్థాయిలో వినియోగించుకోవడానికి వీలుగా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) 'షేరింగ్' విధానానికి శ్రీకారం చుట్టింది. వివిధ సదుపాయాలతో పాటు అత్యున్నత ప్రమాణాలతో కూడిన బోధన ఇతర అంశాల్లో విద్యా సంస్థల మధ్య ఇచ్చిపుచ్చుకునే ధోరణికి తెరతీసింది. నాలెడ్జ్ షేరింగ్, నాలెడ్జ్ ట్రాన్స్‌ఫర్‌కి వీలుగా టెక్నాలజీని, ఇతర వనరులను ఆయా సంస్థలు ఉమ్మడిగా వినియోగించుకునేందుకు ఈ విధానం దోహదపడనుంది. ఈ మేరకు సెంట్రల్ వర్సిటీలు సహా అన్ని ఉన్నత విద్యా సంస్థలకు యూజీసీ ఆదేశాలు జారీచేసింది. అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్–గ్రాడ్యుయేట్ కోర్సులతో పాటు పరిశోధన కోర్సుల్లోనూ దీన్ని అమలుచేయాలని సూచించింది. వనరులు లేని విద్యాసంస్థలు వాటిని ఏర్పాటుచేసుకునేందుకు అదనపు పెట్టుబడి పెట్టాల్సిన అవసరంలేకుండా దగ్గర్లోని విద్యా సంస్థల వనరులను వినియోగిస్తూ తమ విద్యార్థులను ఆయా సంస్థలు తీర్చిదిద్దడానికి ఈ విధానంతో వీలుపడుతుంది.

రెట్టింపు ఫలితాలు

ఈ విధానంవల్ల రెట్టింపు ఫలితాలు వస్తాయని యూజీసీ భావిస్తోంది. అకడమిక్ అంశాలు సహా ఏదైనా అభివృద్ధి కార్యకలాపాలను సమగ్రంగా అమలుచేయాలంటే అదనపు సదుపా యాలు అవసరమవుతుంటాయి. ఇందుకోసం ఆయా సంస్థలు అదనపు పెట్టుబడి పెట్టాలి. అలా కాకుండా.. ఇప్పటికే ఉన్న వనరులను సమర్థంగా ఉపయోగించడంవల్ల రెట్టింపు ఫలితాలు వస్తాయి. ఉన్నత విద్యాసంస్థలు పరస్పర సహకారంతో విద్యాపరమైన మౌలిక వనరులను పంచుకోవడం వల్ల విద్యార్థులకు సమానమైన విద్య అందుతుంది. ప్రస్తుతం ల్యాబ్‌లు, లైబ్రరీలు, ఇతర వనరులున్న సంస్థల్లో చదివే వారికి ఆ వనరుల ద్వారా ఉత్తమ బోధన లభిస్తుంది. కానీ, అలాంటివిలేని సంస్థల విద్యార్థులకు ఉన్నత బోధన దూరమవుతోంది. వనరులను పంచుకునేలా ఆయా సంస్థల మధ్య జరిగేఒప్పందాలతో విద్యార్థులందరికీ మేలు చేకూరుతుంది. అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్–గ్రాడ్యుయేట్, పీహెచ్‌డీ కోర్సులన్నిటికీ ఈ విధానాన్ని అమలుచేయాలని యూజీసీ సూచించింది. ఆయా విద్యాసంస్థలన్నీ తమ సంస్థలోని తరగతి గదులు, ల్యాబ్‌లు ఇతర వనరుల సమాచారాన్ని సమీపంలోని ఇతర ఉన్నత విద్యాసంస్థలన్నిటికీ తెలిసేలా వెబ్‌సైట్ ద్వారా తక్షణమే అందుబాటులో ఉంచాలని ఆదేశించింది. వీటిని వినియోగించుకోవాలనుకునే ఇతర ఉన్నత విద్యా సంస్థల నుంచి నిర్దిష్ట వనరులకు సాధారణ కనీస చార్జీలు నిర్ణయించి వసూలుచేయవచ్చని సూచించింది. ఆ కనీస చార్జీల వివరాలూ అందుబాటులో ఉంచాలని స్పష్టంచేసింది.

సంస్థల మధ్య ఒప్పందాలు

ఇక ఉన్నత విద్యా సంస్థల్లోని వనరులను పరస్పర భాగస్వామ్యంతో వినియోగించుకునేందుకు వీలుగా ఆయా సంస్థలు ఎంఓయూ కుదుర్చుకోవాలని యూజీసీ పేర్కొంది. ఏ సమయంలో ఏ సంస్థ విద్యార్థులు వనరులు వినియోగించుకోవాలో సమగ్ర టైమ్‌టేబుల్‌ను రూపొందించి ఆ ప్రకారం కార్యక్రమాలకు కమిటీలను ఏర్పాటుచేసుకోవాల్సి ఉంటుంది. తరగతి గదులు, ల్యాబ్‌లు, ఇతర వనరులు పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా సంస్థలు చర్యలు చేపట్టాలని, ఏ ఒక్క తరగతి ఖాళీగా ఉండకుండా చూసుకోవాలని యూజీసీ సూచించింది.

ఈ విధానంతో విద్యార్థులకు మేలు..

తరగతి గదులు, మౌలిక సదుపాయాలు పంచుకోవడం ద్వారా విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుంది. క్రీడా మైదానాలు, స్టేడియం, సమావేశ మందిరాలను కూడా అవసరాలను అనుసరించి పంచుకోవచ్చు. సైన్సేతర అంశాలకు సంబంధించిన వనరుల విషయంలో కూడా సంస్థలు పూర్తిస్థాయిలో తమ వద్ద ఉన్న అన్ని సదుపాయాలను ఇతర సంస్థలకు అందుబాటులో ఉంచాలని యూజీసీ పేర్కొంది. పరికరాలు దెబ్బతినే విషయంలోనూ వాటిని తిరిగి ఏర్పాటు చేయడంపైనా ఒప్పందంలో పేర్కొనాలి. అకడమిక్ అంశాలకు సంబంధించి ఆన్‌లైన్ లెక్చర్‌లు, వీడియోలు, లెర్నింగ్ మెటీరియల్‌లు, ఎల్‌ఎంఎస్ (లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్)లలోనూ ఇచ్చిపుచ్చుకోవచ్చు. విద్యార్థుల నమోదు ప్రక్రియ మొత్తం ముందుగా ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ద్వారా పూర్తిచేయాలి. ఉపాధ్యాయుల శిక్షణ, ఫ్యాకల్టీ అభివృద్ధి కార్యక్రమాలు కూడా నిర్వహించవచ్చు.

ఖర్చులపై ముందుగానే ప్రణాళిక

వనరులను పంచుకోవడానికి ముందు వ్యయ విశ్లేషణ, ఖర్చును నిర్ణయించే పద్ధతులపై ప్రణాళిక రూపొందించుకోవాలి. లాభనష్టాలకు తావులేని రీతిలో వనరుల వినియోగంపై ఛార్జీలు వసూలుచేయాలి. ప్రయోగాల వినియోగం ఆధారంగా, నిర్వహణ వ్యయం ప్రకారం పరికరాలు ఛార్జీలు నిర్ణయించాలి. ఉన్నత విద్యాసంస్థల మధ్యే కాకుండా కాలేజీలు, పరిశ్రమల మధ్య కూడా ఇలాంటి ఒప్పందాలు చేసుకోవాలి. నాలెడ్జ్ షేరింగ్, నాలెడ్జ్ ట్రాన్స్‌ఫర్, టెక్నాలజీ వినియోగాన్ని సంస్థలు ప్రోత్సహించాలని యూజీసీ సూచించింది.

యూజీసీ పేర్కొన్న ఇతర సూచనలివే..

- ఆయా విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీచేయాలి.
- తరగతి గది బోధకులు, ల్యాబ్ అసిస్టెంట్‌లు, సెక్యూరిటీ సిబ్బందికి అదనపు చెల్లింపులతో పాటు నిర్వహణ ఖర్చులలో ఆయా సంస్థలు భాగస్వామ్యం కోసం రూపొందించిన ఫార్ములాను అనుసరించాలి.
- ఒకే నగరం, పట్టణం లేదా సమీప ప్రాంతాల్లో ఉండే ఉన్నత విద్యాసంస్థల మధ్య ఈ పరస్పర సహకారం ఉండాలి.
- పరిశోధన స్థాయిలో వనరుల భాగస్వామ్యం అనేది ఆయా పరిశోధకుల స్థాయిలో ఉండాలి. పీజీ స్థాయిలో వనరుల షేరింగ్ విభాగాల వారీగా లేదా సంస్థాగతస్థాయిలో ఉండొచ్చు.
- అదే యూజీ స్థాయిలో వనరుల భాగస్వామ్యం సంస్థల మధ్యే ఉండాలి.
- సెంట్రల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ సదుపాయం వంటి హైఎండ్ పరికరాల భాగస్వామ్యంలో లాభనష్టాలు లేనివిధంగా ఒప్పందాలు ఉండాలి.
- లైబ్రరీ, రీడింగ్ హాళ్లు ఆవరణ స్థలాలు తదితర వనరులనూ ఇదేరకంగా వినియోగించుకోవాలి.
- ఇ–బుక్స్, డేటాబేస్‌లు, ఆన్‌లైన్ వనరుల భాగస్వామ్యంలో కాపీరైట్ ఉల్లంఘనలకు తావులేకుండా, గోప్యతకు భంగం కలగని రీతిలో వ్యవహారాలు నడిచేలా సంస్థలు జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ విషయంలో యాంటీ–ప్లాజియరిజం సాఫ్ట్‌వేర్‌తో సహా ఎలక్ట్రానిక్ వనరులను వినియోగించాలి.

అమ్మవారిని దర్శించుకున్న సినీ నటుడు బాలాదిత్య


అమ్మవారి సన్నిధిలో బాలాదిత్య దంపతులు

బాసర (ముధోల్): బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారిని శుక్రవారం సినీ నటుడు, బిగ్‌బాస్ ఫేమ్ బాలాదిత్య కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. తన కూతురు జైత్ర విరణ్యకు అక్షరశ్రీకార పూజలు జరిపించారు. ఆలయ అధికారులు ఆయనను శాలువాతో సత్కరించారు. అమ్మవారి లడ్డూ ప్రసాదాన్ని అందించారు.

సెల్‌ఫోన్ కొనివ్వలేదని ఆత్మహత్య

వాంకిడి(ఆసిఫాబాద్): భర్త సెల్‌ఫోన్ కొనివ్వలేదని క్షణికావేశంలో భార్య ఆత్మహత్య చేసుకున్న ఘటన కుమురంభీం జిల్లా వాంకిడి మండలంలో చోటుచేసుకుంది. శుక్రవారం ఈ ఘటనకు సంబంధించిన వివరాలను పోలీసులు వెల్లడించారు. వారి కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని లాథూర్ జిల్లాకు చెందిన మీర్జా జావేద్ బేగ్, అంజూమ్ బేగం(22)లకు ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి మూడేళ్ల కుమారుడు, ఏడాది వయస్సున్న కుమార్తె ఉంది. జీవనోపాధి కోసం కుమురంభీం జిల్లాలోని వాంకిడి మండల కేంద్రానికి వలస వచ్చి ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. ఈ క్రమంలో గురువారం అంజూమ్ సెల్‌ఫోన్ కొనివ్వాలని భర్తను కోరింది. ప్రస్తుతం డబ్బులు లేవని చెప్పిన జావేద్ ఇంటి నుంచి బయటికి వెళ్లిపోయాడు. మనస్తాపానికి గురైన అంజూమ్ పిల్లలను బయటికి పంపి తలుపు వేసుకుని ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకుంది. గంట తర్వాత ఇంటికి వచ్చిన భర్త చుట్టుపక్కల వారి సాయంతో ఆసిఫాబాద్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలి తండ్రి భాండే శాబొద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు.

కోర్టా–చనాఖాకు పర్యావరణ అనుమతులు

జైనథ్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న కోర్టా–చనాఖా బ్యారేజీకి పర్యావరణ అనుమతులు లభించాయి. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ ఈ మేరకు శుక్రవారం తుది ఉత్తర్వులు జారీ చేసింది. గతేడాదే పర్యావరణ అనుమతులు లభించినా, ప్రస్తుతం పూర్తి స్థాయిలో ఉత్తర్వులు అందాయి. 2016లో జైనథ్ మండలం కోర్టా సమీపంలో పెన్‌గంగ నదిపై 50వేల ఆయకట్టు లక్ష్యంగా ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. ఎట్టకేలకు అనుమతులు లభించడంతో న్యాయపరమైన చిక్కులు లేకుండా ప్రాజెక్ట్ ముందుకు సాగే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

వీసీ ద్వారా సాక్ష్యం నమోదు చేసిన పోక్సో కోర్టు


సాక్ష్యం నమోదు చేస్తున్న జడ్జి మాధవీకృష్ణ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ జిల్లా పోక్సో కోర్టులో శుక్రవారం ఓ కేసుకు సంబంధించి సీఐ సాక్ష్యాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నమోదు చేశారు. నేరడిగొండ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా పనిచేసిన సమయంలో ఓ బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై హరిశేఖర్ పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. బాధితురాలిని వైద్య పరీక్షల కోసం రిమ్స్‌కు తరలించారు. కేసు దర్యాప్తు నిమిత్తం ఉట్నూర్ డీఎస్పీ వెంకటేశ్‌కు పంపించారు. ఈ మేరకు కేసుకు సంబంధించి అప్పటి ఎస్సై సాక్ష్యాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నమోదు చేశారు. స్పెషల్ పీపీ రమణారెడ్డి ప్రాసిక్యూషన్ తరఫున సాక్షిని విచారించారు. కార్యక్రమంలో లైజన్ అధికారి ఎ.పండరి, ఏఎస్సై నాగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

గోవింద్‌పూర్‌ను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే..


గ్రామంలో వివరాలు నమోదు చేసుకుంటున్న భుజంగ్‌రావు

- మానవహక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగ్‌రావు

తాంసి: కిడ్నీ సంబంధిత వ్యాధుల కారణంగా ఖాళీ అవుతున్న గోవింద్‌పూర్ గ్రామాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని మానవహక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగ్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు వేదిక సభ్యులతో కలిసి గ్రామాన్ని శుక్రవారం సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కిడ్నీ సంబంధిత వ్యాధితో మరణించిన వారి వివరాలు నమోదు చేసుకున్నారు. అలాగే గ్రామస్తులు ఖాళీ చేసిన ఇళ్లను పరిశీలించారు. ప్రభుత్వం తరఫున ఇప్పటివరకు అందిన సాయం ఇతర అంశాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాన్ని వదిలి వెళ్లవద్దని వారికి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కిడ్నీ సంబంధిత వ్యాధి భయంతో గ్రామాన్ని ఖాళీ చేసిన గిరిజనుల కోసం ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇంటి పెద్దదిక్కు కోల్పోయిన కుటుంబాలకు సైతం ఎలాంటి జీవనోపాధి, ఆర్థిక సాయం అందజేయలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గ్రామానికి అండగా నిలవాలన్నారు. గ్రామస్తులకు ప్రాణరక్షణతో పాటు కిడ్నీ వ్యాధిగ్రస్తులకు డయాలసిస్, అనారోగ్యంతో ఉన్నవారికి కార్పొరేట్ వైద్యసేవలు అందించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట జిల్లా ప్రధాన కార్యదర్శి సుగుణ, జ్ఞానేశ్వర్, కైలాస్, సాయినాథ్ తదితరులున్నారు.

పొలాలు బీటలు!


నెల్కివెంకటాపూర్‌లో బీటలు వారిన వరిపొలం

దండేపల్లి: దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణాలో వ్యవసాయానికి 24గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని అధికార పార్టీ ప్రజాప్రతినిధులు గొప్పలు చెబుతుంటారు. అయితే దండేపల్లి మండలంలో వ్యవసాయానికి రోజుకు రెండు విడతల్లో 10గంటలు విద్యుత్ సరఫరా అందిస్తున్నామని విద్యుత్ అధికారులు అంటున్నా.. ఇచ్చే పది గంటల విద్యుత్‌లో తరచుగా అంతరాయంతో పొలాలకు సాగునీరందించలేక పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దండేపల్లి మండలం నెల్కివెంకటాపూర్ శివారులో వ్యవసాయ బావుల కింద సాగు చేస్తున్న పొలాలకు కరెంటు కోతలతో పూర్తిస్థాయిలో సాగునీరందక నాట్లు వేసిన పొలాలు బీటలు వారుతుండగా, నాట్లకు సిద్ధం చేస్తున్న పొలాలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చే పది గంటల కరెంట్‌ను అంతరాయం లేకుండా అందించాలని కోరుతున్నారు. ఈ విషయమై విద్యుత్ ఏఈఈ రాయనర్సును సంప్రదించగా బ్రేక్‌డౌన్ కారణంగా అంతరాయం కలుగుతుందని, అంతరాయ సమయాన్ని మళ్లీ తిరిగి ఇచ్చేలా చూస్తామని చెప్పారు.

'కంపోస్టు తయారీ'లో విద్యార్థులు

- 'కిసాన్ వర్మి బ్రాండ్'తో వర్మి కంపోస్టు విక్రయాలు
- కిలో రూ. 9 చొప్పున రైతులకు విక్రయాలు


ప్రాజెక్టు గైడ్‌తో వర్మి కంపోస్టు తయారు చేస్తున్న వ్యవసాయ విద్యార్థులు

జగిత్యాలఅగ్రికల్చర్ : రసాయన ఎరువులతో సాగు చేసే భూములు ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి. వాటికి బదులు వర్మికంపోస్టు ఎరువు వినియోస్తే అధిక దిగుబడి సాధించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో పొలాస వ్యవసాయ కళాశాలలో నాలుగో ఏడాది చదువుతున్న పి.సాయి, సి.రమేశ్, ఎ.విష్ణున్, బి.సతీశ్, పి.వెంకటేశ్, బి.సంధ్య, ఐ.సోనిక, ఎన్.సాత్విక, రేష్మా, ఎం.శ్వేత, వాణి, వినీల తమ ప్రాజెక్టులో భాగంగా వర్మి కంపోస్టు తయారు చేసి, కిసాన్ బ్రాండ్ పేరిట కిలో రూ.9 ధరతో విక్రయిస్తున్నారు.

ఎలా తయారు చేశారంటే..

- తొలుత నేలకు సమానంగా 50 అడుగుల పొడవు, 3 అడుగుల వెడల్పు, ఒక అడుగు లోతుతో బెడ్లు తయారు చేసుకున్నారు.
- వాటిని నీటితో తడిపి దాదాపు 45 సెం.మీ. ఎత్తు వరకు కుళ్లిన వ్యర్థ పదార్థాలు వేసి, వాటిపై 5 – 10 సెం.మీ. మందంతో పేడ వేశారు.
- బెడ్‌పై 50–60 శాతం తేమ ఉండేలా చూసుకున్నారు. ఇందుకోసం రోజూ నీళ్లు చల్లారు.
- వారం తర్వాత బెడ్‌పై చ.మీ.కు వెయ్యి వానాపాములు వేశారు.
- అవి ఆహారం, తేమను వెతుక్కుంటూ లోపలికి వెళ్లాయి.
- వాటి సంరక్షణకు బెడ్‌పై పాత గోనెసంచులు, వరిగడ్డి పరిచారు.
- బెడ్‌కు పందిరి నీడ వేశారు.
- ఇలా చేసిన రెండు, మూడు నెలల్లోనే వర్మీకంపోస్టు తయారైంది.
- ఎరువు తయారైన తర్వాత వానాపాములు గోనెసంచులకు అతుక్కుపోతాయి.
- వాటిని వెంటనే మరోబెడ్‌పైకి మార్చారు.
- ఇలా విద్యార్థులు దాదాపు ఆరేడు టన్నుల వర్మీకంపోస్టు తయారు చేశారు.

కిసాన్ వర్మి పేరిట విక్రయం..

విద్యార్థులు తయారు చేసిన ఎరువు విక్రయించి, వారి ప్రాజెక్టులో లాభాలు చూపించాల్సి ఉంటుంది. ఇందుకోసం కళాశాలల వర్మి కంపోస్టు ఎరువుల విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అభ్యుదయ రైతులతోపాటు కూరగాయలు సాగుచేసే రైతులు, పట్టణాల్లో పూలు, పండ్ల మొక్కలు పెంచేవారికి కిసాన్ వర్మీ బ్రాండ్‌తో కంపోస్టు విక్రయిస్తున్నారు. దాబాలు, ఇంటి పరిసరాల్లో రసాయనాలు లేకుండా కూరగాయలు పండించేవారు నేరుగా పొలాస వ్యవసాయ కళాశాలకు వెళ్లి సేంద్రియ ఎరువు కొనుగోలు చేస్తున్నారు.

వర్మి కంపోస్టుతో ఉపయోగాలు..

- వానాపాములకు సేంద్రియ వ్యర్థ పదార్థాలను ఆహారంగా వేస్తే వాటిని తిని విసర్జించే పదార్థమే వర్మికంపోస్టు.
- వర్మి కంపోస్టులో 1.6 శాతం నత్రజని, 0.5 భాస్వరం, 0.8 శాతం పొటాష్ ఉంటుంది.
- ఒకసారి వర్మీకంపోస్టు వాడితే రెండు, మూడు పంటల వరకు ఉపయోగపడుతుంది.
- నేలలో పంటకు అవసరమైన సూక్ష్మజీవులను వృద్ధి చేసి, మొక్కలకు పోషకాలు అందిస్తుంది.

కష్టపడి తయారు చేశాం



పన్నెండు మంది విద్యార్థులం కష్టపడి వర్మీకంపోస్టు ఎరువు తయారు చేశాం. పేడతోపాటు వానాపాములు తినే వ్యర్థాలనే ఉపయోగించి నాణ్యమైన వర్మీ కంపోస్టు తయారు చేశాం. చాలా కంపెనీలు వచ్చినా రైతులకే విక్రయించాలని నిర్ణయించాం. – ఎన్.సాత్విక, వ్యవసాయ విద్యార్థిని

కూరగాయల రైతులకు లాభం



దాబాలు, ఇంటి పరిసరాల్లో కూరగాయలు పండించే రైతులకు వర్మీ కంపోస్టు చాలాఉపయోగం. ఇందులో నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి పోషకాలు ఉండి, మొక్కల ఎదుగుదలకు ఉపయోగపడుతుండటంతో డిమాండ్ ఉంది. – సి.రమేశ్, వ్యవసాయ విద్యార్థి

ప్రైవేట్ కంపెనీలకు తీసిపోని విధంగా..



ప్రైవేట్ కంపెనీలకు తీసిపోని విధంగా వర్మీ కంపోస్టు తయారు చేసి విక్రయిస్తున్నాం. పేడ, చెత్తచెదారంలో వానాపాములను వేయడం నుంచి ప్రతీ పనిని మేమే స్వయంగా చేస్తాం. ఎలాంటి కల్తీ లేకుండా నేరుగా వినియోగదారులకు విక్రయిస్తున్నాం. – ఐ.సోనిక, వ్యవసాయ విద్యార్థిని

నాణ్యతతో విక్రయం



ప్రైవేట్ కంపెనీల మాదిరిగా మట్టిపెళ్లలు కలుపకుండా మా కళాశాల విద్యార్థులు వర్మీ కంపోస్టు తయారు చేశారు. రైతులు, కూరగాయలు పండించే ఔత్సాహికులు నేరుగా కళాశాలకు వచ్చి వర్మీ కంపోస్టు చూసి కొనుగోలు చేయవచ్చు. – జి.సత్యనారాయణరెడ్డి, ప్రాజెక్టు గైడ్

సీఎం పర్యటన ఖరారు


ఏర్పాట్లను పరిశీలించిన మేయర్, తదితరులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కరీంనగర్ పర్యటన ఖరారైంది. ఇటీవల మంత్రి గంగుల కమలాకర్ తండ్రి గంగుల మల్లయ్య అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంత్రి కమలాకర్ కుటుంబాన్ని పరామర్శించేందుకు సీఎం స్వయంగా 16న కరీంనగర్‌కు మధ్యాహ్నం వస్తున్నారు. ఉజ్వల పార్కు సమీపంలోని స్పోర్ట్స్ స్కూల్‌లో హెలీప్యాడ్‌ను సిద్ధం చేస్తున్నారు. అక్కడి నుంచి సీఎం నేరుగా పెద్దకర్మ జరిగే కొండా సత్య లక్ష్మీ గార్డెన్స్‌కు చేరుకుంటారు. శుక్రవారం మేయర్ యాదగిరి సునీల్ రావు ఏర్పాట్లను పరిశీలించారు. స్థానిక కార్పొరేటర్ ఐలేందర్ యాదవ్, కమిషనర్ సేవా ఇస్లావత్, ఏసీపీ తుల శ్రీనివాస్, ట్రాఫిక్ సీఐ తిరుమల్ ఎంసీకే అధికారులతో కలిసి ఏర్పాట్లు పరిశీలించారు. ప్రధాన రహదారుల్లో పారిశుద్ధ్య పనులు తనిఖీ చేశారు.

పండగ



భోగి వచ్చిందోచ్



మసక చీకటిలో భోగి మంటలు
ఇంటి ముంగిటిలో వెలుతురును తెస్తాయి.
పాత వస్తువులను దగ్ధం చేసి
కొత్త ఉత్సాహంలోకి అడుగు పడేలా చేస్తాయి.
జనులెల్లా భోగభాగ్యాలతో
విలసిల్లాలని కోరే పండగ భోగి.
తెల్లవారుజాము తలంట్లూ
దోసెలూ మసాలా కూరలూ
చంటిపిల్లల భోగిపండ్లూ
మూడు రోజుల సంక్రాంతి సంబరాలకు బోణి-భోగి.
మనిషిని భోగంతో బతకండి అంటుంది ఈ పండగ.
సంతోషాన్ని, సంతృప్తిని కనుగొనడంలోనే
భోగం ఉందని చెబుతుంది ఈ పండగ.
చలి వంటి జడత్వాన్ని ఉష్ణమనే చైతన్యంతో పారద్రోలి
మనిషిని కర్తవ్యోన్ముఖుణ్ణి చేసేది భోగి.
పరిశ్రమే భోగమూ భాగ్యమూ అని చెప్పేదే భోగి.

భోగుల్లో భోగుల్లో భోగభాగ్యాల భోగుల్లో
భోగిమంటల భోగుల్లో
తెల్లారకుండానే పల్లెపల్లెంతాను ఎర్రని కాంతుల భోగుల్లో...

చీకటిని తనకు తానుగా తరిమికొట్టడానికి వెలుతురు మంటను ఇంటి ఇంటి ముంగిటకు, వీధి వీధిలోనా, ప్రతి కూడలిలో మనిషి రాజేసే ఇలాంటి పండగ మరొకటి లేదు. అంత ఉదయాన లేచి పాతవన్నీ పనికి మాలినవన్నీ దగ్ధం చేసి నవీనతలోకి అడుగుపెడదామని మనిషి అనుకునే పండగ కూడా ఇలాంటిది వేరొకటి లేదు. తెల్లారకుండానే పల్లె లేస్తుంది. మనిషీ లేస్తాడు. ఎర్రటి నాల్కులు సాచుతూ మొద్దు చలిని, మంచు మందాన్ని కోస్తూ మంటా పైకి లేస్తుంది. 'రేపటి నుంచి సూర్యుడు ఉత్తరాయణంలోకి వస్తాడు. కాంతి ప్రకాశవంతం అవుతుంది. జీవితాన్ని ప్రకాశవంతం చేసుకోవడానికి సిద్ధపడు' అని ఇవాళ మనిషిని సిద్ధం చేయడానికి వస్తుంది భోగి. ఎల్లవేళలా శుభ్రంగా స్నానం చేసి, మంచి బట్టలు కట్టుకుని, నచ్చింది తినడానికి మించిన భోగం లేదు. అందుకే భోగినాడు తలంట్లు తెలుగునాట ఫేమస్. భోగిమంటలు కాగానే స్త్రీలు కాగుల్లో, గంగాళాలలో వేడినీళ్లు సిద్ధం చేస్తారు. ఇంటి పిల్లలు, మగవాళ్లు నలుగు పెట్టుకుని ఒంటిని తోముకోవాలనే ఆనవాయితీ. ఆ తర్వాత తలంట్లు. కొత్త బట్టలు. కొత్తబియ్యం పాయసం. ఒళ్లు, ఇల్లు, పరిసరాలు శుభ్రంగా ఉండటం, శుభ్రమైన పరిసరాల్లో సుఖవంతంగా జీవించడం భోగం. అందుకే భోగి శుభ్రతను సూచిస్తుంది. శుభ్రత అంటే బయట శుభ్రత మాత్రమే కాదు... ఆత్మిక, ఆధ్యాత్మిక శుభ్రత కూడా. జ్ఞాన శుభ్రత కూడా. వివేచనా శుభ్రత. అజ్ఞానాన్ని మించిన అంధకారం లేదు. సరైన 'చదువు', దృక్పథం మనిషికి ఉండాలి. మూకలు చెప్పినట్టు చేయరాదు. అలాంటి అజ్ఞాన అంధకారాన్ని మంటల్లో వేసి మాడ్చి మసి చేయమని చెబుతుంది భోగి. నీలోని కల్మషాన్ని, కసిని, పగని, ద్వేషాన్ని, చెడుని తగులబెట్టు అని చెబుతుంది భోగి. మనలో మంచితనం నిండటమే భోగం. మంచివాడిగా బతకడం, అగ్నిలా స్వచ్ఛంగా ఉండటం భోగం. అగ్నికి చీడ అంటదు. అలాంటి జీవితం జీవించగలగాలని సూచన. భోగం అంటే కేవలం ఐశ్వర్యం అనే అర్థం చూడరాదు. అన్నివేళలా చెరగని చిర్నవ్వును ధరించి ఉండగలగడం కూడా భోగమే.

భోగిపళ్లు

రేగిపండ్లు సూర్యుడి నుంచి ఎక్కువ శక్తిని గ్రహించి దాచుకుంటాయట. ఎటువంటి జటిల వాతావరణం లోనైనా, ఉష్ణోగ్రతలో అయినా ఎదురు తిరిగి బతికి రేగుచెట్లు నిలబడతాయట. చంటిపిల్లలు కూడా అలాంటి శక్తితో అలాంటి ఆయుష్షుతో దిష్టి గిష్టి వదిలించుకుని ఈ కొత్తకాలంలోకి ప్రవేశించాలని భోగినాటి సాయంత్రం భోగిపళ్ల పేరంటం పెడతారు. రేగుపండ్లు, తలంబ్రాలు, రాగి నాణేలు, చిల్లర పైసలు, పూల రెక్కలు కలిపి పిల్లల నెత్తిన పోసి, దిగవిడిచి దిష్టి తీస్తారు.

చిట్టి చిట్టి రేగుపళ్లు
చిట్టి తలపై భోగిపళ్లు
ఎంతో చక్కని భోగిపళ్లు
ఎర్ర ఎర్రని రేగుపళ్లు....

అని పాటలు పాడతారు. ఆయుష్షుతో ఉండటం భోగం. అందుకు ఆరోగ్యాన్ని కాపాడుకోవడం భోగం. పరిస్థితులను ఎదుర్కొనే గుండె దిటవును కలిగి ఉండటం భోగం.

బొమ్మల కొలువులు... గొబ్బి పాటలు

భోగినాడు బొమ్మల కొలువు పెడతారు కొంతమంది. చిన్నపిల్లలు తమ బొమ్మలు, సేకరించిన బొమ్మలు తీర్చిదిద్ది సంబరపడతారు. ఇక భోగితో మొదలెట్టి పండగ మూడు రోజులూ సాయంత్రం సందె గొబ్బెమ్మలను పెడతారు. వాటి చుట్టూ ఆడవారందరూ చేరి గొబ్బిళ్ళ పాటలు పాడుతూ గొబ్బెమ్మల చుట్టూ ఆడతారు.

'గొబ్బియళ్ళో సఖియా వినవె
చిన్ని కృష్ణుని చరితము గనవె
చిన్ని కృష్ణుని మహిమను గనవె ..... '

'సుబ్బీ సుబ్బమ్మ శుభము నీయవె
తామర పువ్వంటి తమ్ముణ్ణీయవె
చామంతి పువ్వంటి చెల్లెల్నీయవె' లాంటి పాటలు పాడతారు.

పెళ్ళి కాని అమ్మాయిలు 'మొగలి పువ్వంటి మొగుణ్ణీయవె' అని కలుపుతారు.

పండగ అంటే అందరికి సంతోషాన్ని ఇచ్చేది. అందరి శుభాన్ని కోరడం భోగం. ఈ భోగి సకల శుభాలను తేవాలని కోరుకుందాం. ●

ముగ్గులోనే ముగ్ధరూపాలు





వ్రతం చేసిన ఆండాళ్
భోగినాడు రంగనాథుడిలో ఐక్యం అయిందని ప్రతీతి.
ధనుర్మాసంలో దాపున ఉన్న కోవెలలో
ముగ్గులతోనే ఆధ్యాతిక ఆరాధన చేసింది
హైదరాబాద్‌లో స్థిరపడ్డ కన్నడ చిత్రకారిణి లభ్య.
ముగ్గులలోనే అందమైన దేవతా మూర్తులను
తీర్చిదిద్దడం బాల్యంలో తన తాత వద్ద నేర్చుకున్నానని చెబుతోంది.
లభ్య బొమ్మలు సంక్రాంతి కళకు వన్నె తెచ్చాయి.



'ఇదంతా మా తాతయ్య చెలువయ్య చలువ' అంది లభ్య తాను వేసిన ముగ్గు మూర్తులను చూపుతూ కొద్దిగా తెలుగు, మరింత కన్నడం భాషల్లో.

హైదరాబాద్ బాచుపల్లిలోని ఒక గేటెడ్ కమ్యూనిటీలో నివసించే లభ్యది బెంగళూరు. ధనుర్మాసం మొదలయ్యాక కమ్యూనిటీలో ఉన్న గుడిలో ఆమె నిత్యం వేసే ముగ్గు బొమ్మలు చుట్టుపక్కల వారిని విశేషంగా ఆకట్టుకున్నాయి. ఒక్కో బొమ్మను తీర్చిదిద్దడానికి లభ్య ఏడెనిమిది గంటలు వెచ్చించాల్సి వచ్చింది.

'మా తాత పేరు చెలువయ్య. ఆయన బెంగుళూరు జ్ఞానభారతి యూనివర్శిటీలో ప్రొఫెసర్ గా పని చేసేవారు. దీపావళి, సంక్రాంతి పండుగ సమయాల్లో ఇంటిముందు చక్కని ముగ్గులు రంగులతో వేసేవారు. చిత్రాన్ని జాగ్రత్తగా వేయడం, దాన్ని రంగులతో నింపడం ఆయన వద్దే నేర్చుకున్నా' అంటుంది లభ్య.


తాత ప్రభావం వల్లే చిన్నప్పటి నుంచి బొమ్మలు గీస్తూ పెరిగిన లభ్య ఇంజినీరింగ్ పూర్తిచేసి ఉద్యోగంలో చేరింది. ఉద్యోగం చేస్తూనే వివిధ రీతుల చిత్రకళని పరిశీలిస్తూ కుంచెకు పదును పెట్టుకుంటూ వచ్చింది. బెంగుళూరులో చిత్రకళ ఉపాధ్యాయినిగా కూడా పని చేసింది. వివాహానంతరం కొన్నాళ్లకి పూర్తి దృష్టి చిత్రలేఖనం మీద పెట్టే ఉద్దేశ్యంతో ఉద్యోగానికి స్వస్తి చెప్పి గ్వాలియర్‌లోని రాజా మాన్‌సింగ్ తోమర్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్‌లో చిత్రకళను అభ్యసించింది. కాని ఆమె ప్రత్యేకత అద్భుతమైన చిత్రాలను ముగ్గులుగా నేలమీద ఆవిష్కరించడంలో ఉంది. పండుగ సందర్భాల్లో దేవతామూర్తులను, పండగ సందర్భాన్ని రంగుల ముగ్గులుగా చిత్రిస్తుంది.'ఈ ధనుర్మాసంలో తిరుప్పావై పాశురాలకు దృశ్యరూపం ఇచ్చాను ముగ్గుల్లో' అందామె.

వీణలో కూడా డిప్లొమా చేసిన లభ్య వద్ద చిత్రకళ నేర్చుకున్న విద్యార్థులు చాలామందే ఉన్నారు. కేవలం గీతలు రంగులు మాత్రమే కాక ఒక చిత్రాన్ని ప్రేమతో, భావోద్వేగంతో ఎలా అర్థం చేసుకోవాలో, భావనల్ని ఆలోచనలని సంప్రదాయకళగా, మోడర్న్ ఆర్ట్‌గా, ఫ్యూజన్ ఆర్ట్‌గా ఎలా మలచవచ్చో లభ్య తన విద్యార్థులకు నేర్పిస్తుంది. 2022 ముంబైలో జరిగిన ఇండియా ఆర్ట్ ఫెస్టివల్‌లో, బెంగుళూరులో జరిగే 'చిత్ర సంతె'లో లభ్య చిత్రాలు అమ్ముడుపోయాయి. రాజా రవివర్మ చిత్రాలను ఎంతో ప్రతిభావంతంగా లభ్య పునః చిత్రీకరించింది.

ఏ కళలో అయినా స్త్రీలు పురోగమించడానికి కుటుంబ బాధ్యతలు కొంత ఆటంకం కల్గిస్తాయని, పురుషులకు ఉన్న సౌకర్యం స్త్రీలకు ఎల్లవేళలా ఉండదంటోంది లభ్య.



ముగ్గు ముచ్చట





అరుణమ్మ
వికారాబాద్
20 చుక్కలు:
20 వరుసలు





కట్టమూరి సుభాషిణి
గుంటూరు

15 చుక్కలు
8 వరుసలు






కాంతి శారద శ్రీనివాస్
మెట్టుగూడ, సికింద్రాబాద్



గోకవరపు సుహాసిని
మదిలీపట్నం





ఆందోళన వద్దు.. ఆస్వాదిస్తూ తినండి...

రకరకాల వంటకాల ఘుమఘుమలు ఇల్లంతా పరుచుకోకపోతే పండుగ పరిపూర్ణం కాదని భావించని వారు ఉండరు. జీవితంలో జిహ్వకు ఉన్న ప్రాధాన్యం ఏమిటో తెలిసొచ్చేది సరిగ్గా ఇప్పుడే. మరిప్పుడు తెలుగువారికి ముఖ్యమైన సంక్రాంతి పండగ వచ్చేసింది. ఇవ్వాళ భోగి. పండగని పురస్కరించుకుని అరిసెలు, జంతికలు, బూరెలు, గారెలు వంటి పిండివంటలను ఇరుగు పొరుగుతో కలిసి పెద్ద ఎత్తున చేసుకుని పరస్పరం పంచుకోవడం సర్వసాధారణం.

ఇల్లలకగానే పండగ కాదని వెనకటి సామెత. అలాగే పండగ వచ్చిందంటే రకరకాల పిండివంటలు వండుకోవడం పరిపాటి. అయితే నలభైలు కూడా పూర్తిగా నిండక ముందే బీపీ, షుగర్, కొలెస్టరాల్ వంటి వాటితో బాధపడుతున్న వారు జిహ్వను చంపుకోలేక నచ్చిన వాటన్నిటినీ ఆరగించేస్తే, ఆ తర్వాత ఎదురు కాబోయే పరిణామాలకు పెద్ద మొత్తంలో హాస్పిటల్ బిల్లు, అది చూసి గుండె గుభిల్లు అనడం ఖాయం. అలాగని పండగ పూట కూడా పథ్యపు తిండి తిననక్కరలేదు. కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే బీపీ, షుగర్, కొలెస్టరాల్, హార్ట్ పేషంట్లు కూడా తీపిలోని మాధుర్యాన్ని, కారంలోని కరుకుదనాన్ని ఆస్వాదించవచ్చు.

ఎక్కువ వైవిధ్యం... తక్కువ పరిమాణం

అరిసెలు, బూరెలు, గారెలు, సకినాలు, కజ్జికాయలు...ఇంకా మరెన్నో ఇష్టమైన వంటకాలను చేస్తే నియంత్రించుకోవడం కష్టం. కాబట్టి వీలున్నంత వరకు తక్కువ పరిమాణంలో వండుకోవడం మంచిది. పిండి వంటల్ని పండుగకు ఒక్కసారే చేసుకుని కొన్నిరోజుల పాటు నిల్వ ఉంచడం సహజంగా చేస్తుంటారు. అలా ఉంచే సమయంలో వాటిని సరైన చోట, సరైన విధంగా నిల్వ చేయాలి. అలాగే కొన్ని రోజుల పాటు పాడవకుండా ఉండాలన్నా, కొంచెం ఎక్కువ పరిమాణంలో తీసుకున్నా అనారోగ్యం కలుగకుండా ఉండాలన్నా.. వండేటప్పుడు నాణ్యమైన, తాజాగా ఉన్న దినుసులనే ఉపయోగించడం ముఖ్యం. అదేవిధంగా ఇంచుమించు అన్నీ ఆయిల్ వంటకాలే ఉంటాయి కాబట్టి, సరైన నూనెలు ఉపయోగించడం తప్పనిసరి.

పిల్లల ముందు రకరకాల తినుబండారాలు ఉంచి, తినవద్దంటే ఎంత ఇబ్బంది పడతారో, మధుమేహం ఉన్నవారికి కూడా ఇంట్లో స్వీట్లు చేసినప్పుడు జిహ్వను చంపుకోలేకపోవడం అంతే మరి! ఇలాంటప్పుడు ఏమి చేయాలంటే.. అందరిలా స్వీట్లను ప్లేటులో వడ్డించుకోకూడదు. ఆ మాటకొస్తే కారాలు కూడా! ఒక్కొక్క వెరయిటీనే ఆస్వాదిస్తూ కొద్ది కొద్దిగా తీసుకోవాలి.

స్వీటు తిన్నప్పుడు దానికి తగ్గ శారీరక శ్రమ చేయడమో లేదంటే అన్నం తక్కువ తినడం ఉత్తమం. అలా కాకుండా అన్నం మామూలుగానే తినేసి, దానికితోడు స్వీట్లు కూడా లాగించేస్తే కోరి కోరి ప్రమాదాన్ని కొని తెచ్చుకున్నట్లే! పంచదార కన్న బెల్లంతో చేసినవి, బెల్లం పాకంతో కాకుండా ఆర్గానిక్ బెల్లం పొడితో తయారు చేసినవి కొంత మెరుగు.

తీపి బదులు డ్రై ఫ్రూట్స్ బెటర్: తీపి తక్కువగా తినవలసిన అవసరం ఉన్నవారు ఖర్జూర పండు, తేనెతో, డ్రైఫ్రూట్స్‌తో లడ్డూ తయారు చేసుకుని తినవచ్చు.

సాధారణ ఉప్పు కన్నా... బీపీ ఉన్న వారు సాధారణ టేబుల్ సాల్ట్ బదులు రాక్‌సాల్ట్ లేదా సైంధవ లవణం వాడటం కొంత మెరుగు.

ఇంటిలోనే పిండివంటలు చేసుకునే ఓపిక లేనివారు షాప్స్‌లో కొనుగోలు చేసే సమయంలో మొహమాట పడకుండా ఆయా పదార్థాల తయారీకి వాళ్లు వినియోగించిన నూనెల గురించి అడిగి తెలుసుకోవడం అవసరం.

ఇప్పుడు దాదాపు అన్ని ప్రధాన బ్రాండ్స్ వాళ్లు ఆరోగ్య అవగాహనను దృష్టిలో పెట్టుకుని నాణ్యతాపరంగా తాము పాటిస్తున్న ప్రమాణాలను వెల్లడిస్తున్నారు.

బీపీ ఉన్నవారు ఆహార పదార్థాలలో పులుపు తక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఎందుకంటే పులుపు పెరిగిన కొద్దీ ఆ మేరకు ఉప్పు, కారం వేసే పాళ్లు కూడా పెరుగుతాయని గుర్తుంచుకుని మరీ చప్పిడివి తినడం కన్నా కొద్దిగా మెరుగ్గా తింటున్నామని సంతోషించాలి.

జాగ్రత్తలు పాటిస్తూ పిండివంటలు పరిమితంగా ఆస్వాదిస్తూ తగినంత వ్యాయామం కూడా చేయాలి. శరీరానికి ఒక్కసారిగా అధికంగా అందిన కేలరీలు ఖర్చయేందుకు శారీరక శ్రమ తప్పనిసరి.

చివరగా ఒక్క మాట... పండుగలు ప్రతి సంవత్సరం వస్తాయి... ఆరోగ్యం కోల్పోతే తిరిగి తెచ్చుకోవడం అంత సులభం కాదని, మితమే హితమని గుర్తుంచుకోవాలి.

పిల్లల ఎముకలు దృఢంగా ఉండాలంటే...



గుండెను ఆరోగ్యంగా ఉంచడానికి, కండరాలను బలోపేతం చేయడానికి, ఎముకలను అభివృద్ధి చేయడానికి కాల్షియం అవసరమన్న సంగతి అందరికీ తెలుసు. పాలు, జున్ను, పెరుగుతో సహా అన్ని పాల ఉత్పత్తుల్లో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. పిల్లల ఎముకల ఎదుగుదలకి ఏం చేయాలో తెలుసుకుందాం....

తల్లిదండ్రులు.. పిల్లలు రోజుకు కనీసం 2 గ్లాసుల పాలను తాగేట్టు చూడాలి. అలాగే మీ పిల్లల ఆహారంలో బచ్చలి కూర, బెండకాయ, పాలకూర వంటి ఆకుపచ్చ కూరగాయలు ఉండేట్టు చూడండి. అలాగే రోజుకు ఒక సారైనా పెరుగును తినేట్టు చూడాలి. సోయా పాలు, సోయా పెరుగు వంటి సోయాబీన్ ఉత్పత్తుల్లో కూడా కాల్షియం పుష్కలంగా ఉంటుంది. అన్నింటికీ మించి నువ్వులలో క్యాల్షియం చాలా అధికమొత్తంలో ఉంటుంది కాబట్టి పిల్లలు రోజూ ఒక స్పూను నువ్వులు తినేలా చూస్తే చాలు...

తప్పకుండా ఉండాలండి

కాల్షియం శోషణ విటమిన్ డి సహాయపడుతుంది. దీనికే విటమిన్ డి 3 అని కూడా పేరు. మన దేశంలో విటమిన్ డికి ఎలాంటి కొదవ లేకున్నా.. చాలా మంది డి విటమిన్ లోపంతో బాధపడుతున్నారు. విటమిన్ డి సూర్యరశ్మి ద్వారా, కొన్ని రకాల ఆహారాల ద్వారా పొందవచ్చు. పిల్లల ఆహారంలో తగినంత విటమిన్ డి లేకపోతే విటమిన్ డి సప్లిమెంట్ ను తీసుకోవాలి. ఎందుకంటే విటమిన్ డి ఎముకల ఆరోగ్యానికి చాలా ముఖ్యమైనది.

నవజాత శిశువులకు కూడా విటమిన్ డి అవసరం. అందుకోసం వారి ఒంటికి నువ్వుల నూనె రాసి, లేలేత సూర్యకిరణాలు తగిలేలా చూస్తే సరిపోతుంది. ఆ తర్వాత మృదువుగా మర్దనా చేస్తూ స్నానం చేయించాలి.

ఈ విటమిన్లు కూడా ఉండాలి

శరీరంలో విటమిన్ కె, మెగ్నీషియం స్థాయిలు ఎక్కువగా ఉంటే విటమిన్ డి సమృద్ధిగా ఉన్నట్లే. అలాగే రికెట్స్, బోలు ఎముకల వ్యాధితో సహా ఎన్నో ఎముకల సమస్యలను తగ్గించడానికి ఇవి సహాయపడతాయి. కాల్షియంతో పాటుగా ఈ విటమిన్లు కూడా పిల్లల ఎముకలను బలోపేతం చేయడానికి సహాయపడతాయి.

క్యాబేజీ, ఆకుపచ్చ మొలకలు వంటి ఆకుపచ్చ కూరగాయల్లో విటమిన్ కె, మెగ్నీషియం ఉంటాయి.

శీతలపానీయాలు వద్దే వద్దు...

పిల్లలు ఎంత మారాం చేసినా వారిని శీతల పానీయాలు తాగనివ్వకూడదు. ఎప్పుడో ఒకసారి అయితే ఫరవాలేదు కానీ తరచు శీతల పానీయాలు తాగడం పిల్లల ఆరోగ్యానికి అస్సలు మంచిది కాదు. ఎందుకంటే వీటిలో సాధారణంగా కొన్ని ఫాస్ఫోరిక్ ఆమ్లాలు ఉంటాయి. ఇది శరీరం కాల్షియాన్ని గ్రహించకుండా నిరోధిస్తుంది. ఈ ఆమ్లం ఎముకల ఆరోగ్యానికి అస్సలు మంచిది కాదు. కార్బొనేటెడ్ పానీయాలకు బదులుగా నారింజ రసం వంటి హెల్తీ పానీయాలను తాగించండి.

దీనివల్ల పిల్లల ఎముకలు దృఢంగా ఉంటాయి. పిల్లల మానసిక, శారీరక ఎదుగుదల బాగుంటుంది.

■ హెల్త్ టిప్స్

కడుపు ఉబ్బరం.. అజీర్తికి

కడుపు ఉబ్బరాన్ని నివారించడంలో వ్యాయామం అతిముఖ్యమైంది. బ్రిస్క్‌వాక్ రోజు 40 నిమిషాలు ఉదయం, లేక సాయంత్రం చేయాలి. నీళ్లు బాగా తాగాలి. స్విమ్మింగ్ లేక తాడుతో గెంతడం (స్కిప్పింగ్) చేయాలి. అన్నం తిన్న వెంటనే కొద్ది దూరం ఇంట్లోనే నడవాలి. గ్యాస్ ఎక్కువ చేసే పదార్థాలు తగ్గించాలి. ముఖ్యంగా మద్యం సేవించకూడదు. మసాలా దినుసులు తగ్గించాలి. వేళకు మితంగా భోజనం చేయాలి. ఊబకాయం తగ్గించుకోవాలి.

గ్లాస్ నీటిలో కొద్దిగా అల్లం ముక్కలు వేసి ఆ నీటిని బాగా మరిగించి వేడిగా ఉండగానే తాగేయాలి. ఇలా చేయడం వల్ల ఆహారం త్వరగా జీర్ణమవుతుంది.

అల్లం ముక్కలను దంచి రసం తీసి ఆ రసాన్ని తాగినా అజీర్తి నుంచి ఉపశమనం లభిస్తుంది.

చిటికెడు వాములో ఉప్పు వేసి నలిపి ఆ మిశ్రమాన్ని తిని, నీరు తాగినా చాలు.

గ్లాస్ నీళ్లలో కొన్ని సోంపు గింజలను వేసి మరిగించి.. ఆ నీటిని వడకట్టి వేడిగా ఉండగానే తాగితే ఆహారం త్వరగా జీర్ణమవుతుంది.



■ మీకు తెలుసా?

ఎసిడిటీ మందులు దీర్ఘకాలం వాడితే...

అజీర్ణం, త్రేన్పులు, ఛాతీలో మంట వంటి వాటి నుంచి తప్పించుకోవటానికి చాలా మంది ఒమెప్రాజోల్ వంటి మాత్రలు వేసుకుంటూ ఉంటారు. డాక్టర్లు సిఫారసు చేయకపోయినా సొంతంగా కొనుక్కొని వాడేవాళ్లు లేకపోలేదు. అయితే వీటిని దీర్ఘకాలం వాడటం మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు. దీంతో ఎముకల పటిష్ఠత తగ్గి.. తుంటి ఎముకలు విరిగే ప్రమాదం పెరుగుతోందని హెచ్చరిస్తున్నారు.

బోస్టన్‌లోని మసాచుసెట్స్ జనరల్ ఆసుపత్రికి చెందిన డాక్టర్ హమీద్ ఖలీల్ బృందం ఇటీవల ఒక అధ్యయనం చేసింది. నెలసరి నిలిచిపోయిన 80 వేల మంది మహిళలను పరిశీలించింది. ఈ అధ్యయనంలో.. పీపీఐలు వాడేవారిలో తుంటిఎముక విరిగే ముప్పు 35 శాతం పెరిగినట్టు గుర్తించారు. ఈ మందులను ఆపేస్తే ఎముక విరిగే ముప్పు రెండేళ్లలోనే మామూలు స్థాయికి చేరుకుంటోంది కూడా. అందువల్ల అసిడిటీ మందులు మోతాదు మించి వాడకుండా ఉండటం మంచిది.



సినిమా



● నాని
● కీర్తీ సురేష్


దసరా పూర్తి

గోదావరి ఖని ప్రాంతంలోని సింగరేణి కోల్ మైన్స్‌లో ఉన్న ఓ గ్రామంలో జరిగే కథతో రూపొందిన చిత్రం 'దసరా'. నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో కీర్తీ సురేష్ హీరోయిన్. ఈ పాన్ ఇండియా మూవీ షూటింగ్ పూర్తయింది. ఇందులో నాని, కీర్తీ సురేష్ లుక్స్ విభిన్నంగా ఉంటాయి. ''ఇప్పటికే విడుదల చేసిన లుక్స్‌కి, 'ధూమ్ ధామ్..' పాటకు అద్భుతమైన స్పందన లభించింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. మార్చి 30న చిత్రాన్ని రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. సముద్రఖని, సాయి కుమార్, జరీనా వహాబ్ కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి కెమెరా: సత్యన్ సూర్యన్, సంగీతం: సంతోష్ నారాయణన్.



● శ్రుతీహాసన్

నేనెక్కడ ఉన్నానో తెలియదు!



● విజయ్ దేవరకొండ

''నేను ఎవర్ని మోసం చేశానో చెప్పడానికి నేనెక్కడ ఉన్నానో నాకు తెలియదు. నేనొక అనామక గూఢచారిని'' అనే వాక్యాలతో ఒక వ్యక్తి పోలీసు దుస్తుల్లో ముఖానికి ముసుగు ధరించి ఉన్న పోస్టర్‌తో విజయ్ దేవరకొండ కొత్త సినిమా ప్రకటన వెలువడింది. హీరోగా విజయ్‌కి ఇది 12వ సినిమా. కాగా, తమ సంస్థలో 'జెర్సీ' వంటి హిట్ ఇచ్చిన గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఈ చిత్రాన్ని ఫార్ఛ్యూన్ ఫోర్ సినిమాస్‌తో కలిసి సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించనుంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో ఎస్. నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించనున్నారు. ''యువ సంచలనం విజయ్ దేవరకొండ, ప్రతిభ గల దర్శకుడు గౌతమ్‌తో రూపొందించే ఈ సినిమాపై భారీ అంచనాలు ఉంటాయి. ఆ అంచనాలను అధిగమించే సినిమాని ఇవ్వడానికి కృషి చేస్తాం'' అన్నారు నిర్మాతలు. ''విజయ్ దేవరకొండలోని కొత్త కోణాన్ని ఆవిష్కరిస్తాను'' అన్నారు గౌతమ్ తిన్ననూరి. ''ఈ కథ, ప్రాజెక్ట్ గురించి విన్నప్పుడు నా గుండె లయ తప్పినట్లనిపించింది'' అన్నారు విజయ్ దేవరకొండ. త్వరలో ఈ సినిమా షూటింగ్ ఆరంభం కానుంది.

మళ్లీ జోడీగా...



● నితిన్



● రష్మిక

హీరో నితిన్, హీరోయిన్ రష్మికా మందన్నా మరోసారి జోడీగా నటించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి ఫిల్మ్‌నగర్ వర్గాలు. వెంకీ కుడుముల దర్శకత్వంలో నితిన్, రష్మిక జంటగా నటించిన 'భీష్మ' చిత్రం 2020 ఫిబ్రవరి 21న విడుదలై మంచి హిట్ అందుకుంది. కాగా మరోసారి 'భీష్మ' కాంబినేషన్ రిపీట్ కానుందని టాక్. 'ఛలో, భీష్మ' చిత్రాలతో వరుస హిట్లు అందుకున్న వెంకీ కుడుముల మూడో చిత్రాన్ని చిరంజీవితో తీయనున్నారనే వార్తలొచ్చాయి. అయితే ఆ ప్రాజెక్టుపై ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. కాగా తన తర్వాతి చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్‌లో చేయనున్నారు వెంకీ కుడుముల. ప్రస్తుతం ఈ చిత్రం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఇందులో హీరో హీరోయిన్లుగా నితిన్, రష్మిక నటిస్తారని భోగట్టా. 'భీష్మ'లో వీరి జోడీకి మంచి మార్కులే పడటంతో మరోసారి రిపీట్ చేసేందుకు వెంకీ ఆసక్తి చూపుతున్నారట. ఈ ఏడాది చివర్లో ఈ సినిమా సెట్స్‌పైకి వెళుతుందని టాక్.

మా నమ్మకం నిజమైంది

- గోపీచంద్ మలినేని



''వీరసింహారెడ్డి' చిత్రాన్ని ఒక అవకాశంగా కంటే ఒక బాధ్యతగా చూశాను. 'అఖండ' మూవీ హిట్, అన్‌స్టాపబుల్ షోతో అందరికీ కనెక్ట్ అయ్యారు బాలకృష్ణ గారు.. ఇప్పుడు అందరి హీరోల ఫ్యాన్స్ బాలయ్య బాబు అభిమానులే. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఈ సినిమా చేశాను'' అని డైరెక్టర్ గోపీచంద్ మలినేని అన్నారు. బాలకృష్ణ, శ్రుతీహాసన్ జంటగా నటించిన చిత్రం 'వీరసింహారెడ్డి'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా గురువారం విడుదలైంది. ఈ సందర్భంగా గోపీచంద్ మలినేని మాట్లాడుతూ– ''బాలకృష్ణగారి బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్స్ 'సమరసింహా రెడ్డి, నరసింహా నాయుడు' చిత్రాల్లో ఫ్యామిలీ ఎమోషన్ ఉంటుంది. 'వీరసింహారెడ్డి'లోనూ ఉంది. ఇందులో ఉన్న సిస్టర్ సెంటిమెంట్ కనెక్ట్ అయింది. ఫస్ట్ హాఫ్ అయ్యాక ఫ్యాన్స్ అందరూ ఇరగదీశారని కాంప్లిమెంట్ ఇచ్చారు. సెకండ్ హాఫ్‌లో ఫ్యామిలీ ఎమోషన్ ఇంకా గొప్పగా కనెక్ట్ అయ్యింది.. దాంతో విజయంపై మా నమ్మకం నిజమైంది. ఈ చిత్రాన్ని ఫస్ట్ హాఫ్ బాలయ్యబాబు ఫ్యాన్ బాయ్‌గా, సెకండాఫ్ డైరెక్టర్‌గా చేశాను. రామ్–లక్ష్మణ్‌లు ఫైట్స్‌ని అద్భుతంగా డిజైన్ చేశారు. తమన్ మంచి సంగీతం ఇచ్చాడు. నా కెరీర్‌లో బెస్ట్ ప్రొడ్యూసర్స్ మైత్రీ మూవీ మేకర్స్.. వాళ్లతో సినిమాలు చేస్తూనే ఉంటాను'' అన్నారు.

అప్పుడు ఆ ఆలోచనలు లేవు

- ప్రియా భవాని

''కళ్యాణం కమనీయం' చిత్రంలో నేను చేసిన శ్రుతి పాత్రకి, నిజజీవితంలో నాకు దాదాపు 90శాతం పోలికలున్నాయి. అందుకే ఆ పాత్ర చేయడం నాకు పెద్దగా కష్టం అనిపించలేదు. తమిళ్‌లో నా మొదటి చిత్రం విడుదలప్పుడు నాకు పెద్దగా ఆలోచనలు లేవు.. కానీ తెలుగు ప్రేక్షకులు నన్ను ఎలా ఆదరిస్తారో అనే ఎగ్జయిట్‌మెంట్ ఉంది'' అని హీరోయిన్ ప్రియా భవానీశంకర్ అన్నారు. సంతోష్ శోభన్ హీరోగా అనిల్ కుమార్ ఆళ్ల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కళ్యాణం కమనీయం'. యూవీ కాన్సెప్ట్ నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రకథానాయిక భవానీశంకర్ మాట్లాడుతూ– ''తమిళ్‌లో చాలా మంచి చిత్రాలు చేశాను. యూవీ లాంటి పెద్ద బ్యానర్‌లో తెలుగులో పరిచయం కావడం సంతోషంగా ఉంది. ఉద్యోగం లేని భర్త శివ, జాబ్‌కి వెళ్లే భార్య శ్రుతి. వారు సంతోషంగానే ఉన్నా చుట్టూ ఉన్న వాళ్ల మాటలు, అభిప్రాయాల వల్ల వారిద్దరి మధ్య మొదలైన ఒక సమస్య ఎంత దూరం వెళ్లింది? అన్నదే ఈ చిత్రకథ. శ్రుతి పాత్రలో మహిళలు తమని తాము చూసుకుంటారు. ఇక నాగచైతన్యతో 'దూత' వెబ్ సిరీస్ చేస్తున్నాను. సత్యదేవ్‌తో ఓ సినిమాలో నటించనున్నాను'' అన్నారు.



డాక్టర్‌కి చూపించుకోండి!

'శ్రుతీహాసన్ మానసిక వ్యాధితో బాధపడుతోంది. చికిత్స కూడా చేయించుకుంటోందట' అనే వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న ఈ వార్తలకు సోషల్ మీడియా ద్వారానే కౌంటర్ ఇచ్చారు శ్రుతి. ''నేను మానసిక సమస్యలతో ఇబ్బంది పడటం లేదు.. కేవలం వైరల్ ఫీవర్‌తో మాత్రమే బాధపడుతున్నాను. రికవర్ అవుతున్నాను కూడా. అయితే మానసిక వ్యాధి అంటూ తప్పుడు ప్రచారం చేయడం వల్ల తమ మానసిక ఆరోగ్యానికి సంబంధించిన సమస్యలని బయట పెట్టడానికి చాలామంది భయపడుతుంటారు. కానీ నేనలా కాదు. నా విషయంలో అది జరగదు. నేను ఎప్పుడూ ఒక మానసిక నిపుణురాలిగా వ్యవహరిస్తాను. అన్ని రకాలుగా జాగ్రత్తలు తీసుకుంటూ నన్ను నేను సంరక్షించుకుంటుంటాను'' అని శ్రుతి పేర్కొన్నారు. ''ఒకవేళ మీరు (ఆ వార్తలు రాసిన వారిని ఉద్దేశిస్తూ..) మానసిక సమస్యలతో ఇబ్బందిపడితే డాక్టర్‌కి చూపించుకోండి'' అని పోస్ట్ చేశారు శ్రుతీహాసన్.

''బాబీగారు 'వాల్తేరు వీరయ్య' కథ చెప్పినప్పుడే వీరయ్య (చిరంజీవి పాత్ర పేరు) క్యారెక్టర్‌కి ఇలాంటి కాస్ట్యూమ్స్ అయితే బాగుంటుందనుకున్నాను. నా ఆలోచన, బాబీగారి ఐడియాలు చాలావరకూ మ్యాచ్ అయ్యాయి. నాన్నగారూ సలహాలు చెప్పారు'' అన్నారు సుష్మిత కొణిదెల. చిరంజీవి, శ్రుతీహాసన్ జంటగా బాబీ కొల్లి (కెఎస్ రవీంద్ర) దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'వాల్తేరు వీరయ్య'. రవితేజ కీలక పాత్ర చేశారు. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలైంది. ఇందులో చిరంజీవికి కాస్ట్యూమ్ డిజైనర్‌గా చేసిన ఆయన కుమార్తె సుష్మిత చెప్పిన విశేషాలు.

మాకు ఇది స్పెషల్ సంక్రాంతి! - సుష్మిత



● బాబీగారు 'వాల్తేరు వీరయ్య' కథ చెప్పినప్పుడు వింటేజ్ చిరంజీవిగారిని చూపించాలన్నారు. అంటే.. అప్పటి 'గ్యాంగ్ లీడర్' టైమ్ అన్నమాట. ఈ సినిమాలో ఆయనది ఫిషర్ మ్యాన్ క్యారెక్టర్. సో.. కథ విన్నప్పుడే కాస్ట్యూమ్స్‌ని ఊహించేశా. నాన్నగారి సినిమాలు చూస్తూ పెరిగాను కాబట్టి వింటేజ్ లుక్‌లో చూపించడానికి పెద్దగా కష్టపడలేదు. కానీ యూత్‌కి కూడా నచ్చాలి కాబట్టి ఇప్పటి ట్రెండ్‌ని కూడా దృష్టిలో పెట్టుకుని డిజైన్ చేశాను. ● 'రంగస్థలం'లో నా తమ్ముడు రామ్‌చరణ్‌కి నేనే డిజైన్ చేశాను. ఇప్పుడు నాన్నగారివి కూడా అలాంటి డ్రెస్సులే. కానీ చరణ్‌కంటే నాన్నగారే ఈ మాస్ కాస్ట్యూమ్స్‌లో సూపర్. అయితే చరణ్‌ని కూడా మెచ్చుకోవాలి. ఎందుకంటే తను సిటీలో పెరిగాడు. అయినప్పటికీ 'రంగస్థలం'లో ఆ కాస్ట్యూమ్స్‌లో బాగా ఒదిగిపోయాడు. నాన్నగారి అభిమానులుగా మేం మిగతా అభిమానులతో పాటు ఈలలు వేస్తూ, గోల చేస్తూ శుక్రవారం ఉదయం నాలుగు గంటలకు థియేటర్లో 'వాల్తేరు వీరయ్య' టీమ్‌తో కలిసి సినిమా చూశాం. ● ప్రస్తుతం నాన్న 'భోళా శంకర్'కి డిజైన్ చేస్తున్నాను. ఇంకా రెండు వెబ్ సిరీస్‌లపై వర్క్ చేస్తున్నాం. మేం నిర్మించిన 'శ్రీదేవి శోభన్‌బాబు' సినిమా రిలీజ్‌కి రెడీగా ఉంది. మా గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్‌పై నాన్నగారితో సినిమా నిర్మించాలని ఉంది. అందరి నిర్మాతలకు చెప్పినట్లే ఆయన 'మంచి కథతో రా' అన్నారు. మేం కూడా ఆ వేటలోనే ఉన్నాం.

ఈ సంక్రాంతి స్పెషల్ అంటే.. మా తమ్ముడు తండ్రి కానుండటం. ఈ సమయం కోసం ఎప్పట్నుంచో ఎదురు చూస్తున్నాం. సో.. మాకిది స్పెషల్ సంక్రాంతి. ఉపాసనది డాక్టర్స్ ఫ్యామిలీ కాబట్టి ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి? ఏం ఆహారం తీసుకోవాలి? అనేది తనకు బాగా తెలుసు. మావైపు నుంచి మేం ఆమెను వీలైనంత హ్యాపీగా ఉంచుతున్నాం. పాప అయినా, బాబు అయినా మాకు ఓకే. కానీ నాకు, శ్రీజకు ఆడపిల్లలే. ఇంట్లో గర్ల్ పవర్ ఎక్కువైంది (నవ్వుతూ). అందుకే బాబు అయితే బాగుంటుందనుకుంటున్నాను.

సాక్షి బిజినెస్

శనివారం
14-1-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
303	98
60,261	17,957

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లష్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 ముగింపు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	10,978	▽ 23
డోజోన్స్	34,193	▲ 3
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,844	▲ 50
డాక్స్	15,087	▲ 28
షాంఘై	3,195	▲ 31
నికాయ్	26,120	▽ 330

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	56,462 ▲	352
బంగారం (99.5 స్వచ్ఛత)	56,236 ▲	351
వెండి (కేజీ)	68,115 ▲	90

ఫారెక్స్ రేట్లు (రూ. లలో)

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ధామినిబతి	79.50	83.18
£	బ్రిటన్ పౌండ్	ధామినిబతి	96.84	101.69
€	యూరో	ధామినిబతి	85.71	90.23
¥	జపాన్ ఎన్ (100)	ధామినిబతి	50.00	76.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ధామినిబతి	54.20	59.09
S$	సింగపూర్ డాలర్	ధామినిబతి	59.21	63.76
SAR	సౌదీ రియాల్	ధామినిబతి	20.69	22.36
UAE D	యూఏఈ దిర్హామ్	ధామినిబతి	21.25	23.04
¥	చైనా యువాన్	ధామినిబతి	10.98	13.01

డిజిటల్ వినియోగానికి ఎదురుదెబ్బ: గూగుల్

న్యూఢిల్లీ: గుత్తాధిపత్యాన్ని దుర్వినియోగం చేస్తోందంటూ కాంపిటీషన్ కమిషన్ (సీసీఐ) తమకు జరిమానా విధించడంపై టెక్ దిగ్గజం గూగుల్ స్పందించింది. కనెక్టివిటీకి అడ్డంకులను తొలగించే దిశగా సురక్షితమైన స్మార్ట్‌ఫోన్లను అందుబాటులోకి తేవాల్సిన దశలో ఇలాంటి ఆదేశాలు ఇవ్వడం వల్ల దేశీయంగా డిజిటల్ వినియోగం వేగవంతం కాకుండా విఘాతం కలుగుతుందని వ్యాఖ్యానించింది. గూగుల్ ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టం విషయంలో గుత్తాధిపత్యాన్ని దుర్వినియోగం చేస్తోందంటూ రూ. 1,338 కోట్లు, ప్లే స్టోర్‌కి సంబంధించి అనుచిత విధానాలపై మరో రూ. 936 కోట్ల మొత్తాన్ని సీసీఐ జరిమానా విధించిన సంగతి తెలిసిందే.

క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ నుంచి వరి సంరక్షణా పురుగు మందు

హైదరాబాద్: వరి పంట రక్షణ, రైతులకు లాభదాయకత పెంపు లక్ష్యంగా క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ సంస్థ మార్కెట్లోకి సరికొత్త పురుగుమందును ఆవిష్కరించింది. పంట సమయంలో చీడపీడలను నియంత్రించడమే కాకుండా, వరి పంట మొత్తాన్ని సురక్షితంగా ఉంచడానికి, దిగుబడిని పెంచడానికి, నాణ్యమైన ఉత్పత్తికి 'మెంటార్' పేరుతో విడుదలైన ఈ ప్రొడక్ట్ దోహదపడుతుందని ఈ మేరకు వెలువడిన ఒక ప్రకటన వివరించింది. దేశవ్యాప్తంగా వివిధ అగ్రి విశ్వవిద్యాలయాలలో మెంటర్‌ను పరీక్షించడం జరిగిందని ప్రకటన తెలిపింది. వరి పంట విషయంలో చీడపీడలను అరికట్టడంలో ఇది ప్రభావవంతంగా పనిచేస్తున్నట్లు పేర్కొంది.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

14-1-2023	
విశాఖ	572-00
చిత్తూరు	568-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	563-00
విజయవాడ	563-00
రిటైల్ ధర (డజను)	84.00
13-1-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	563-00
వరంగల్	565-00
రిటైల్ ధర	6.20

విప్రో లాభం రూ. 3,053 కోట్లు

- క్యూ3 ఫలితాల విడుదల
- ఆదాయం రూ. 23,229 కోట్లు
- 4.3 బిలియన్ డాలర్ల ఆర్డర్లు
- 2,58,744కు మొత్తం సిబ్బంది

న్యూఢిల్లీ: ఐటీ సేవల దిగ్గజం విప్రో లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022-23) మూడో త్రైమాసిక ఫలితాలు విడుదల చేసింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 2.8 శాతం బలపడి రూ. 3,053 కోట్లను తాకింది. గతేడాది(2021-22) ఇదే కాలంలో రూ. 2,969 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మరింత అధికంగా 14 శాతం ఎగసి రూ. 23,229 కోట్లకు చేరింది. మార్చితో ముగియనున్న పూర్తి ఏడాదికి ఐటీ సర్వీసుల ఆదాయం 11.5-12 శాతం మధ్య పుంజుకోనున్నట్లు తాజాగా అంచనా(గైడెన్స్) ప్రకటించింది. వాటాదారులకు షేరుకి రూ. 1 చొప్పున మధ్యంతర డివిడెండును ప్రకటించింది. ఈ ఏడాది క్యూ2(జూలై-సెప్టెంబర్)తో పోలిస్తే నికర లాభం 15 శాతం, ఆదాయం 3 శాతం వృద్ధి చూపాయి.



ఫలితాలను ప్రకటిస్తున్న విప్రో సీఈవో, ఎండీ థియరీ డెలాపోర్ట్

డీల్స్ రికార్డ్..

ప్రపంచ అనిశ్చితుల్లోనూ క్యూ3లో రికార్డ్ నెలకొల్పుతూ మొత్తం 4.3 బిలియన్ డాలర్ల విలువైన కాంట్రాక్టులు కుదుర్చుకున్నట్లు విప్రో సీఈవో, ఎండీ థియరీ డెలాపోర్ట్ పేర్కొన్నారు. ఇది 26 శాతం వృద్ధికాగా.. వీటిలో బిలియన్ డాలర్ల విలువకు మించిన భారీ ఆర్డర్లను సైతం పొందినట్లు తెలియజేశారు. క్యూ4(జనవరి-మార్చి)లోనూ ఇదే స్థాయి ఆర్డర్లు పొందే వీలున్నట్లు అంచనా వేశారు. క్లయింట్లతో లోతైన సంబంధాల ద్వారా అత్యధిక స్థాయిలో డీల్స్ కుదుర్చుకోగలుగుతున్నట్లు వివరించారు. ట్రాన్స్‌ఫార్మేషన్ లక్ష్యాలు, వ్యయ క్రమబద్ధీకరణ తదితర అంశాలలో క్లయింట్లకు అందిస్తున్న సమర్థవంత సేవలు ఇందుకు దోహదపడుతున్నట్లు తెలియజేశారు. పూర్తిస్థాయి క్లౌడ్ సర్వీసులు, ఇంజనీరింగ్ సర్వీసులు ఆర్డర్‌బుక్‌కు దన్నుగా నిలుస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇతర హైలైట్స్

- క్యూ2తో పోలిస్తే విప్రో ఉద్యోగుల సంఖ్య నికరంగా 435 తగ్గి 2,58,744ను తాకింది.
- ఉద్యోగ వలసల(అట్రిషన్) రేటు 1.8 శాతం తగ్గి 21.2 శాతానికి చేరింది.
- ఐటీ సర్వీసుల నిర్వహణ మార్జిన్లు 1.2 శాతం బలపడి 16.3 శాతానికి చేరాయి.
- ఐటీ సర్వీసుల ఆదాయం 6.2 శాతం వృద్ధితో 280.35 కోట్ల డాలర్లను తాకింది.
- ఐటీ ప్రొడక్టుల ఆదాయం 2.08 కోట్ల డాలర్లు(రూ. 170 కోట్లు)గా నమోదైంది.

ఫలితాల నేపథ్యంలో విప్రో షేరు యథాతథంగా రూ. 396 వద్ద ముగిసింది.

3 రోజుల నష్టాలకు చెక్

ముంబై: ద్రవ్యోల్బణ ఆందోళనలు ఉపశమించిన నేపథ్యంలో మూడు రోజుల వరుస నష్టాలకు చెక్ పడింది. మెటల్, ఫైనాన్షియల్స్, ఐటీలో కొనుగోళ్లు దేశీ స్టాక్ మార్కెట్లు జోష్‌నిచ్చాయి. వెరసి సెన్సెక్స్ ట్రిపుల్ సెంచరీ చేసి 60,000 మార్క్‌ను అధిగమించింది. 303 పాయింట్లు జమ చేసుకుని 60,261 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 98 పాయింట్లు ఎగసి 17,957 వద్ద నిలిచింది. ఒక దశలో సెన్సెక్స్ 460 పాయింట్లు జంప్‌చేయగా.. నిఫ్టీ 18,000 స్థాయికి చేరువైంది. అయితే తొలుత మార్కెట్లు నష్టాలతో ప్రారంభమయ్యాయి. తదుపరి ట్రేడర్లు షార్ట్ కవరింగ్ చేపట్టడంతో మిడ్ సెషన్ నుంచీ జోరందుకున్నట్లు విశ్లేషకులు తెలియజేశారు.

కన్జూమర్ డ్యూరబుల్స్ వీక్

ఎన్ఎస్ఈలో ప్రధానంగా మెటల్, బ్యాంకింగ్, ఐటీ, ఆటో రంగాలు 1.3-0.6 శాతం మధ్య పుంజుకోగా... కన్జూమర్ డ్యూరబుల్స్ 1 శాతం నీరసించింది. నిఫ్టీ దిగ్గజాలలో అదానీ ఎంటర్, ఇండస్‌ఇండ్, ఐషర్, టాటా స్టీల్, ఇన్ఫోసిస్, దివీస్, హీరో మోటో, బజాజ్ ఫైనాన్స్, అల్ట్రాటెక్, బీపీసీఎల్, ఐసీఐసీఐ, హెచ్‌యూఎల్, టీసీఎస్, ఎయిర్‌టెల్, మారుతీ, ఎస్‌బీఐ 2-1 శాతం మధ్య బలపడ్డాయి. అయితే టైటన్, ఎస్‌బీఐ లైఫ్, అపోలో హాస్పిటల్స్, నెస్లే, ఎల్‌అండ్‌టీ 1-0.5 శాతం మధ్య క్షీణించాయి.



స్టాక్ హైలైట్స్

- క్యూ3లో కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా రూ. 716 కోట్ల అమ్మకాలు సాధించినట్లు వెల్లడించడంతో రియల్టీ కంపెనీ కోల్టేపాటిల్ డెవలపర్స్ 16% దూసుకెళ్లింది. రూ. 303 వద్ద ముగిసింది. తొలుత రూ. 312ను సైతం అధిగమించింది.
- చెన్నై మెట్రో రైల్ ప్రాజెక్టు నుంచి తాజాగా రూ. 1,134 కోట్ల విలువైన ఆర్డర్ పొందడంతో రైల్ వికాస్ నిగమ్(ఆర్‌వీఎన్ఎల్) కౌంటర్ 5 శాతం ఎగసి రూ. 80 వద్ద ముగిసింది.
- కొద్ది రోజులుగా ర్యాలీ బాటలో సాగుతున్న ఆర్కియన్ కెమికల్స్ షేరు మరోసారి 8 శాతం జంప్‌చేసి రూ.617 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో రూ.629 వద్ద కొత్త గరిష్టాన్ని తాకింది.

ప్రభుత్వ, ప్రైవేటు రంగం కలసి పనిచేయాలి

- అవకాశాలను సొంతం చేసుకోవాలి
- ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు
- బడ్జెట్‌కు ముందు ఆర్థికవేత్తలతో చర్చలు

న్యూఢిల్లీ: ప్రభుత్వ, ప్రైవేటు రంగం కలసికట్టుగా పనిచేయాలని, అంతర్జాతీయంగా ఉన్న పరిణామాల నేపథ్యంలో తమ పరిధి దాటి విశాల దృక్పథంతో ఆలోచించి అవకాశాలను సొంతం చేసుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. కేంద్ర బడ్జెట్‌కు ముందు ప్రముఖ ఆర్థికవేత్తలతో శుక్రవారం ప్రధాని సమావేశమయ్యారు. వారి అభిప్రాయాలు, సూచనలను తెలుసుకున్నారు. డిజిటల్ కార్యకలాపాల విషయంలో, ఫిన్‌టెక్ విస్తరణలో దేశం సాధించిన విజయాన్ని ప్రధాని ఈ సందర్భంగా ప్రశంసించినట్టు అధికారికంగా ఓ ప్రకటన విడుదలైంది. సమ్మిళిత వృద్ధికి ఇది కీలకమని ప్రధాని అభిప్రాయపడ్డారు. భారత్ వృద్ధిలో మహిళల పాత్ర కీలకమని పేర్కొంటూ, ఉత్పాదకతలో మహిళలను మరింతగా భాగస్వాములను చేయాలని కోరారు. రిస్కులు ఉన్నప్పటికీ అంతర్జాతీయంగా డిజిటైజేషన్, ఇంధనం, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం రంగాల్లో విస్తృతమైన అవకాశాలున్నట్టు ప్రధాని పేర్కొన్నారు. ఈ అవకాశాలను సొంతం చేసుకునేందుకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు కలసి పనిచేయాలని పిలుపునిచ్చారు. భారత్ తన వృద్ధిని స్థిరంగా కొనసాగించేందుకు తీసుకోవాల్సిన చర్యలను ఆర్థికవేత్తలు ఈ సమావేశంలో ప్రధానికి సూచించినట్టు ప్రభుత్వ ప్రకటన తెలిపింది. అంతర్జాతీయంగా ప్రస్తుతం నెలకొన్న సమస్యలు కొనసాగుతాయంటూ, భారత్ మరింత బలమైన వృద్ధిని నమోదు చేసేందుకు చర్యలను ప్రతిపాదించినట్టు పేర్కొంది. ఈ సమావేశంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బెరీ, ఉన్నతాధికారులతోపాటు.. ఆర్థికవేత్తలు శంకర్ ఆచార్య, అశోక్ గులాటీ, షమిక రవి తదితరులు పాల్గొన్నారు.



ఇతర రంగాలకూ పీఎల్ఐ స్కీమ్

- రానున్న సంవత్సరాల్లో వచ్చే చాన్స్
- బడ్జెట్‌లో డిమాండ్ బలోపేతానికి చర్యలు
- పరిశ్రమ వర్గాల ఆశాభావం

న్యూఢిల్లీ: ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం ఎంతో ప్రయోజనకరమని మెజారిటీ వ్యాపారవేత్తలు భావిస్తున్నారు. రానున్న రోజుల్లో పీఎల్ఐ కింద ఇతర రంగాలకూ ప్రోత్సాహకాలు లభిస్తాయన్న ఆశాభావం వారి నుంచి వ్యక్తమైంది. డిమాండ్ బలోపేతానికి వీలుగా బడ్జెట్‌లో ప్రకటించే చర్యలు అన్ని రంగాల్లో వృద్ధికి ఊతంగా నిలుస్తాయన్న అభిప్రాయం కంపెనీల ప్రతినిధుల్లో వ్యక్తమైంది. మూలధన వ్యయాలపైనా బడ్జెట్ దృష్టి సారిస్తుందని అంచనా వేస్తున్నారు. డెలాయిట్ సర్వే వివిధ రంగాల్లోని పారిశ్రామికవేత్తల అభిప్రాయాలను తెలుసుకుంది. మూలధన వ్యయాలు, మౌలిక సదుపాయాలకు రుణాలను అందించడం వృద్ధికి కీలకమన్న అభిప్రాయం వ్యక్తమైంది. భారత ప్రభుత్వ బాండ్ల ద్వారా నిధులు సమీకరించాలని సర్వేలో 60 శాతం మంది సూచించారు. రానున్న బడ్జెట్ నుంచి పరిశ్రమ ఏమి ఆశిస్తుందో తెలుసుకునే ప్రయత్నం సర్వేలో భాగంగా డెలాయిట్ చేసింది. 10 రంగాల నుంచి 181 మంది ప్రతినిధులు సర్వేలో పాల్గొని అభిప్రాయాలు తెలియజేశారు.



పారిశ్రామికవేత్తల అభిప్రాయాలు

- 70 శాతానికి పైగా పరిశ్రమల ప్రతినిధులు పీఎల్ఐ పథకం తమ రంగం వృద్ధికి మేలు చేస్తుందని చెప్పారు.
- 60% మంది పీఎల్ఐ ప్రోత్సాహకాలను మరిన్ని రంగాలకు ప్రకటిస్తారని ఆశిస్తున్నారు.
- పన్నుల్లో మార్పులు తెస్తే అది పరిశ్రమల వృద్ధికి ప్రయోజనం కలిగిస్తుందన్న అభిప్రాయం వ్యక్తమైంది. రానున్న బడ్జెట్‌లో ఎక్కువ మంది బలంగా దీన్ని కోరుకుంటున్నారు.
- ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలు పెట్టుబడుల వృద్ధికి దోహదం చేస్తాయని భావిస్తున్నారు.
- ఎంఎస్ఎంఈలను జీవీసీ కిందకు తీసుకొస్తే పరిశ్రమల వృద్ధి స్థిరత్వానికి సాయపడుతుందని, వాణిజ్య లావాదేవీలు పెరుగుతాయని చెప్పారు.
- 45 శాతం మంది పన్ను బాధ్యతలను ప్రభుత్వం తగ్గిస్తుందని అంచనా వేస్తుంటే, 44 శాతం మంది టీడీఎస్‌కు సంబంధించి స్పష్టత కోరుకుంటున్నారు.
- మూలధన లాభాల పన్ను నిర్మాణాన్ని మరింత సులభతరంగా మార్చాలని పరిశ్రమ కోరుతోంది.
- కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు 14 రంగాలకు పీఎల్ఐ కింద రూ. 2 లక్షల కోట్ల ప్రోత్సాహకాలను ప్రకటించింది. తోలు, సైకిల్, టీకాల తయారీ, టెలికం ఉత్పత్తులకు పీఎల్ఐ విస్తరణ ప్రతిపాదన పరిశీలనలో ఉంది.

సాక్షి స్పోర్ట్స్



నేటి నుంచి అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్ టోర్నీ

దక్షిణాఫ్రికా వేదికగా నేటి నుంచి అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్ జరగనుంది. 16 జట్లు తలపడుతున్న ఈ టోర్నీ ఈనెల 29న జరిగే ఫైనల్‌తో ముగుస్తుంది. గ్రూప్ 'ఎ'లో ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, శ్రీలంక, అమెరికా; గ్రూప్ 'బి'లో ఇంగ్లండ్, పాకిస్తాన్, జింబాబ్వే, రువాండా; గ్రూప్ 'సి'లో ఇండోనేసియా, ఐర్లాండ్, న్యూజిలాండ్, వెస్టిండీస్; గ్రూప్ 'డి'లో భారత్, దక్షిణాఫ్రికా, స్కాట్లాండ్, యూఏఈ జట్లున్నాయి. నేడు జరిగే తమ తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాతో భారత్ ఆడుతుంది. భారత జట్టులో హైదరాబాద్ అమ్మాయి గొంగడి త్రిష, వైజాగ్‌కు చెందిన షబ్నమ్ సభ్యులుగా ఉన్నారు.

టెన్నిస్‌కు సానియా గుడ్‌బై

వచ్చే నెలలో రిటైర్ కానున్న భారత స్టార్

మెల్‌బోర్న్: భారత వెటరన్ టెన్నిస్ స్టార్ సానియా మీర్జా ఫిబ్రవరిలో జరిగే దుబాయ్ ఓపెన్ తర్వాత రిటైర్ అవుతున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఆమె ట్విట్టర్‌లో భావోద్వేగపు లేఖను 'లైఫ్ అప్‌డేట్' అనే క్యాప్షన్‌తో పంచుకుంది. మూడు పేజీల ఈ లేఖలో తన 30 ఏళ్ల రాకెట్ పయనాన్ని, చివరి గమ్యాన్ని వివరించింది. 'నా గ్రాండ్‌స్లామ్ ప్రయాణం 2005లో ఆస్ట్రేలియన్ ఓపెన్‌తోనే మొదలైంది. ఇప్పుడు గ్రాండ్‌స్లామ్ ఆట కూడా అక్కడే ముగించేందుకు సరైన వేదిక అనుకుంటున్నా. 18 ఏళ్ల క్రితం ఎక్కడైతే ఆరంభించానో అక్కడే ఆపేయబోతున్నా. ఇక కెరీర్‌లో చివరి టోర్నీ మాత్రం దుబాయ్ ఓపెన్. ఫిబ్రవరిలో ఈ టోర్నీతో సుదీర్ఘ కెరీర్‌కు వీడ్కోలు పలుకుతాను. ఇన్నేళ్ల పయనంలో ఎన్నో ఆటుపోట్లే కాదు మరెన్నో మధురస్మృతులూ ఉన్నాయి' అని అందులో పేర్కొంది. నాసర్ స్కూల్‌కు చెందిన ఆరేళ్ల బాలిక ఎలా టెన్నిస్ నేర్చుకుంది... తన కలలకు ఎక్కడ బీజం పడింది... అన్నింటికీ మించి దేశానికి ప్రాతినిధ్యం ఎలాంటి స్ఫూర్తినిచ్చిందో ఆ లేఖలో చెప్పుకొచ్చింది. అర్ధ సెంచరీని దాటిన తన గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో గెలిచిన కొన్ని టైటిళ్లు దేవుడిచ్చిన వరమంది. 'నా సుదీర్ఘ కెరీర్‌లో దేశానికి పతకాలు తేవడమే అతిపెద్ద గౌరవంగా భావిస్తాను. పతకం నా మెడలో పడినపుడు జాతీయ పతాకం రెపరెపలాడినపుడు కలిగే ఆనందం అన్నింటికి మించి ఉంటుంది. ఇప్పుడు దీన్ని తలచుకొని రిటైర్మెంట్ సందేశం రాస్తున్నప్పుడు చెరిగిపోని ఆ అనుభూతి నా కళ్లను చెమరుస్తోంది' అని 36 ఏళ్ల సానియా పేర్కొంది.



భారత్ శుభారంభం

నాలుగోసారి ప్రపంచకప్ పురుషుల హాకీ టోర్నీకి ఆతిథ్యమిస్తున్న భారత జట్టు ఆనవాయితీని కొనసాగించింది. స్వదేశంలో జరిగిన గత మూడు ప్రపంచకప్‌లలో భారత జట్టు తాము ఆడిన తొలి మ్యాచ్‌లో విజేతగా నిలిచింది. నాలుగోసారీ ఈ ఫలితంలో మార్పు లేకుండా చూసుకున్న టీమిండియా ఈ మెగా ఈవెంట్‌లో శుభారంభం చేసింది. 48 ఏళ్లుగా ఊరిస్తున్న ప్రపంచకప్ టైటిల్ వేటను విజయంతో మొదలుపెట్టింది.

- తొలి మ్యాచ్‌లో స్పెయిన్‌పై 2-0తో విజయం
- ప్రపంచకప్ హాకీ టోర్నీ

రూర్కెలా (ఒడిశా): సొంతగడ్డపై తమ సత్తా చాటుకుంటూ భారత పురుషుల హాకీ జట్టు ప్రపంచకప్ టోర్నీలో బోణీ కొట్టింది. స్పెయిన్ జట్టుతో శుక్రవారం జరిగిన పూల్ 'డి' తొలి లీగ్ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలోని భారత జట్టు 2-0 గోల్స్ తేడాతో గెలుపొందింది. ఆట 12వ నిమిషంలో వైస్ కెప్టెన్ అమిత్ రోహిదాస్... 26వ నిమిషంలో హార్దిక్ సింగ్ ఒక్కో గోల్ సాధించి భారత విజయంలో కీలకపాత్ర పోషించారు. ఆద్యంతం భారత్ ఆధిపత్యం చలాయించిన ఈ మ్యాచ్‌లో టీమిండియాకు ఐదు పెనాల్టీ కార్నర్‌లు రాగా... స్పెయిన్ మూడు పెనాల్టీ కార్నర్‌లు సంపాదించింది. భారత్ ఐదు పెనాల్టీ కార్నర్‌లలో ఒక దానిని సద్వినియోగం చేసుకోగా... స్పెయిన్ మూడింటినీ వృథా చేసుకుంది. ఆదివారం జరిగే తమ తదుపరి మ్యాచ్‌లో ఇంగ్లండ్‌తో భారత్ ఆడుతుంది.

స్పెయిన్‌తో మ్యాచ్‌లో భారత్ సంపూర్ణ ఆధిపత్యాన్ని కనబరిచింది. అవకాశం దొరికినపుడల్లా భారత ఆటగాళ్లు నీలకంఠ శర్మ, మన్‌దీప్ సింగ్, ఆకాశ్‌దీప్ సింగ్, అభిషేక్ గోల్‌పోస్ట్‌పై దాడులు చేసినా స్పెయిన్ అప్రమత్తంగా ఉంటూ వాటిని నిలువరించింది. లేదంటే భారత్ ఖాతాలో మరిన్ని గోల్స్ చేరేవి. 12వ నిమిషంలో లభించిన రెండో పెనాల్టీ కార్నర్‌ను కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ డ్రాగ్ ఫ్లిక్ చేయగా... బంతి స్పెయిన్ డిఫెండర్‌కు తగిలి వెనక్కి వచ్చింది. అక్కడే ఉన్న అమిత్ రోహిదాస్ బంతిని లక్ష్యానికి చేర్చడంతో భారత్ ఖాతా తెరిచింది. అనంతరం 26వ నిమిషంలో ఎడమ వైపు నుంచి హార్దిక్ సింగ్ దూసుకొస్తూ అదే జోరులో క్రాస్ షాట్‌తో బంతిని స్పెయిన్ గోల్‌పోస్ట్‌లోనికి పంపించాడు. దాంతో భారత ఆధిక్యం 2-0కు పెరిగింది. మూడో క్వార్టర్‌లో భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ పెనాల్టీ స్ట్రోక్‌ను వృథా చేయడం గమనార్హం. తొలి రోజు జరిగిన ఇతర మ్యాచ్‌ల్లో పూల్ 'ఎ'లో అర్జెంటీనా 1-0తో దక్షిణాఫ్రికాపై... మాజీ చాంపియన్ ఆస్ట్రేలియా 8-0తో ఫ్రాన్స్‌పై గెలుపొందగా... పూల్ 'డి'లోని మరో మ్యాచ్‌లో ఇంగ్లండ్ 5-0తో వేల్స్ జట్టును ఓడించింది.



అమిత్ రోహిదాస్

8 ప్రపంచకప్ టోర్నీలలో తాము ఆడిన తొలి మ్యాచ్ లో భారత్ గెలుపొందడం ఇది ఎనిమిదో సారి. 15వసారి ప్రపంచకప్ జరుగుతుండగా... భారత్ రెండుసార్లు తమ తొలి మ్యాచ్‌లను 'డ్రా' చేసుకొని, ఐదుసార్లు తమ తొలి మ్యాచ్‌లో ఓడిపోయింది.

సెమీస్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ



కౌలాలంపూర్: మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో ఏడో సీడ్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ ద్వయం 17-21, 22-20, 21-9తో లియు యు చెన్-జువాన్ యి ఒయు (చైనా) జోడీపై విజయం సాధించింది. పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ ప్రణయ్ 16-21, 21-19, 12-21తో ప్రపంచ ఏడో ర్యాంకర్ కొడాయ్ నరోకా (జపాన్) చేతిలో ఓడిపోయాడు. ప్రణయ్‌కు 6,875 డాలర్ల (రూ. 5 లక్షల 60 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 6,600 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

ఆంధ్ర జట్టుకు నిరాశ

ఢిల్లీకి తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం

న్యూఢిల్లీ: చివరి వికెట్ తీయడంలో విఫలమైన ఆంధ్ర జట్టు బౌలర్లు ఢిల్లీ జట్టుతో జరిగిన రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీ గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కోల్పోయారు. మ్యాచ్ 'డ్రా'గా ముగిసినా 29 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించినందుకు ఢిల్లీ జట్టుకు మూడు పాయింట్లు లభించగా... ఆంధ్ర ఖాతాలో ఒక పాయింట్ మాత్రమే చేరింది. ఓవర్‌నైట్ స్కోరు 300/4తో ఆట చివరిరోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఢిల్లీ జట్టు 9 వికెట్లకు 488 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఓవర్‌నైట్ బ్యాటర్లలో ధ్రువ్ షోరే మరో 43 పరుగులు జోడించి వ్యక్తిగత స్కోరు 185 వద్ద అవుటవ్వగా... హిమ్మత్ సింగ్ (104; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీ పూర్తి చేసుకున్నాడు. హిమ్మత్ సింగ్ అవుటైనపుడు ఢిల్లీ స్కోరు 423/9. చివరి వికెట్ తీసిఉంటే ఆంధ్ర జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతోపాటు మూడు పాయింట్లు లభించేవి. కానీ ఢిల్లీ బ్యాటర్లు హర్షిత్ రాణా (46 బంతుల్లో 33 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్), దివిజ్ మెహ్రా (38 బంతుల్లో 32 నాటౌట్; 6 ఫోర్లు) మొండి పట్టుదలతో ఆడి చివరి వికెట్‌కు అజేయంగా 65 పరుగులు జోడించారు. ఐదు మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న ఆంధ్ర గ్రూప్ 'బి' 13 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉంది.



హిమ్మత్

భారత టెస్టు జట్టులోకి సూర్యకుమార్

- ఇషాన్ కిషన్‌కు తొలిసారి పిలుపు
- ఆసీస్‌తో తొలి రెండు టెస్టులకు జట్టు ప్రకటన

ముంబై: ఆస్ట్రేలియాతో సొంతగడ్డపై జరిగే 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ'లోని తొలి రెండు టెస్టుల కోసం 17 మంది సభ్యులతో భారత జట్టును సెలక్టర్లు ప్రకటించారు. టి20లో తన విధ్వంసక ఆటతో చెలరేగుతున్న సూర్యకుమార్ యాదవ్ తొలిసారి టెస్టు టీమ్‌లోకి ఎంపికయ్యాడు. ఇప్పటి వరకు టెస్టుల్లో అవకాశం రాకపోయినా ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లోనూ సూర్యకు మంచి రికార్డే ఉంది. 79 మ్యాచ్‌లలో అతను 44.75 సగటుతో 5549 పరుగులు చేయగా, ఇందులో 14 సెంచరీలు ఉన్నాయి. మరో వైపు కారు ప్రమాదానికి గురైన వికెట్ కీపర్ రిషభ్ పంత్ ఇప్పట్లో కోలుకునే అవకాశం లేకపోవడంతో ప్రత్యామ్నాయ వికెట్ కీపర్‌గా ఇషాన్ కిషన్‌ను ఎంపిక చేశారు. ఆంధ్ర ఆటగాడు కోన శ్రీకర్ (కేఎస్) భరత్ ఇప్పటికే టెస్టు టీమ్‌తో ఉండగా (ఇంకా మ్యాచ్ ఆడలేదు), కిషన్‌కు టెస్టుల్లో ఇదే తొలి అవకాశం. బుమ్రాను ఎంపిక చేయకపోవడంతో అతను పూర్తిగా కోలుకోలేదని తేలింది. గాయం నుంచి కోలుకుంటున్న రవీంద్ర జడేజానూ జట్టులోకి తీసుకున్నా... ఫిట్‌నెస్ నిరూపించుకుంటేనే ఆడతాడు. భారత్, ఆస్ట్రేలియా మధ్య ఫిబ్రవరి 9నుంచి నాగపూర్‌లో తొలి టెస్టు జరుగుతుంది.

టెస్టు జట్టు వివరాలు: రోహిత్ శర్మ (కెప్టెన్), రాహుల్, గిల్, పుజారా, కోహ్లి, శ్రేయస్, కేఎస్ భరత్, ఇషాన్ కిషన్, అశ్విన్, అక్షర్, కుల్దీప్, జడేజా, షమీ, సిరాజ్, ఉమేశ్, ఉనాద్కట్, సూర్యకుమార్.



సూర్య, ఇషాన్

న్యూజిలాండ్‌దే సిరీస్

కరాచీ: పాకిస్తాన్ గడ్డపై మూడు మ్యాచ్‌ల ద్వైపాక్షిక వన్డే సిరీస్‌ను న్యూజిలాండ్ జట్టు తొలిసారి సొంతం చేసుకుంది. పాకిస్తాన్‌తో శుక్రవారం జరిగిన చివరిదైన మూడో వన్డేలో న్యూజిలాండ్ రెండు వికెట్ల తేడాతో గెలిచింది. తద్వారా మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను న్యూజిలాండ్ 2-1తో దక్కించుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 280 పరుగులు చేసింది. ఫఖర్ జమాన్ (101; 10 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ సాధించాడు. మొహమ్మద్ రిజ్వాన్ (77; 6 ఫోర్లు) అర్ధ సెంచరీ చేశాడు. కివీస్ బౌలర్లలో టిమ్ సౌతీ (3/56) ఆకట్టుకున్నాడు. అనంతరం న్యూజిలాండ్ 48.1 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 281 పరుగులు చేసి విజయం సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' డెవాన్ కాన్వే (52; 5 ఫోర్లు, 1 సిక్స్), విలియమ్సన్ (53; 2 ఫోర్లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' గ్లెన్ ఫిలిప్స్ (42 బంతుల్లో 63 నాటౌట్; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు సాధించి న్యూజిలాండ్ విజయంలో కీలకపాత్ర పోషించారు. పాక్‌తో సిరీస్ ముగించుకున్న న్యూజిలాండ్ ఈనెల 18 నుంచి భారత్‌తో మూడు వన్డేల సిరీస్ ఆడనుంది.

టి20లకు పృథ్వీ షా, వన్డేల్లో భరత్

న్యూజిలాండ్‌తో సిరీస్‌లకు భారత జట్లు

ముంబై: ఏడాదిన్నర క్రితం అంతర్జాతీయ టి20ల్లో తాను ఆడిన ఏకైక టి20లో తొలి బంతికే అవుటైన పృథ్వీ షా భారత జట్టులోకి పునరాగమనం చేశాడు. న్యూజిలాండ్‌తో జరిగే మూడు మ్యాచ్‌ల సిరీస్ కోసం సెలక్టర్లు అతడికి అవకాశం కల్పించారు. ఇది మినహా చెప్పుకోదగ్గ మార్పులేమీ లేకుండా ఇటీవల శ్రీలంకతో టి20 సిరీస్ గెలిచిన జట్టునే ఎంపిక చేశారు. కెప్టెన్‌గా హార్దిక్ పాండ్యా కొనసాగనున్నాడు. ఈ సిరీస్‌లో కూడా రోహిత్, కోహ్లిలను ఎంపిక చేయకపోవడంతో అది 'విశ్రాంతి'నా లేక టి20 భవిష్యత్ ప్రణాళికల్లో భాగంగా వారిని పక్కన పెట్టేశారా అనేదానిపై స్పష్టత లేదు. జనవరి 27, 29, ఫిబ్రవరి 1 తేదీల్లో టి20 మ్యాచ్‌లు జరుగుతాయి. వన్డే జట్టులో ఆంధ్ర వికెట్ కీపర్ కేఎస్ భరత్‌కు తొలిసారి అవకాశం లభించింది. శార్దుల్ ఠాకూర్ పునరాగమనం చేయగా, లెఫ్టార్మ్ స్పిన్నర్ షహబాజ్ అహ్మద్‌కు కూడా చోటు కల్పించారు. వన్డేల్లో మాత్రం రోహిత్, కోహ్లి అందుబాటులో ఉంటారు. వ్యక్తిగత కారణాలతో కేఎల్ రాహుల్, అక్షర్‌లను రెండు జట్లలోనూ ఎంపిక చేయలేదని సెలక్టర్లు వెల్లడించారు. ఈ నెల 18, 21, 24 తేదీల్లో వన్డేలు జరుగుతాయి.



భరత్

వన్డే జట్టు: రోహిత్ (కెప్టెన్), గిల్, ఇషాన్ కిషన్, కోహ్లి, శ్రేయస్, సూర్యకుమార్, భరత్, హార్దిక్, సుందర్, షహబాజ్, శార్దుల్, చహల్, కుల్దీప్, షమీ, సిరాజ్, ఉమ్రాన్. **టి20 జట్టు:** హార్దిక్ (కెప్టెన్), సూర్యకుమార్, ఇషాన్ కిషన్, రుతురాజ్, గిల్, దీపక్ హుడా, రాహుల్ త్రిపాఠి, జితేశ్ శర్మ, సుందర్, కుల్దీప్, చహల్, అర్ష్‌దీప్, ఉమ్రాన్, మావి, పృథ్వీ షా, ముకేశ్ కుమార్.

కొత్త కొత్తగా.. టైగర్ సఫారీ



సాక్షి, హైదరాబాద్: నూతన సంవత్సరంలో కొత్త హంగులు, ఆకర్షణలతో ప్రజలకు మరోసారి 'వైల్డ్ లైఫ్ టూరిజం'.. అందులో భాగంగా 'టైగర్ సఫారీ' అందుబాటులోకి రానున్నాయి. రాష్ట్రంలో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ (ఏటీఆర్) పచ్చటి అడవితో పాటు జీవవైవిధ్యానికి ప్రతీకగా పెద్ద పులుల ఆవాసం, విభిన్నరకాల పువ్వులు, ఔషధమొక్కలు, వాగులు, వంకలకు కేంద్రమై ఉంది. పెద్దపులుల అభయారణ్యంగా పేరుగాంచిన ఏటీఆర్ పరిధిలో ఈ నెల 20వ తేదీన టైగర్ సఫారీని అటవీ, పర్యావరణశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించనున్నారు. పర్యాటకులకు ఎప్పుడు అందుబాటులోకి తీసుకువస్తారనేది త్వరలోనే వెల్లడిస్తారు. 2021 నవంబర్‌లో ఏటీఆర్‌లోని ఫరాహాబాద్‌లో తొలిసారిగా దీనిని అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ టైగర్ సఫారీని ఏడాదికొకసారి నిర్వహించాలని నిర్ణయించారు. అయితే అప్పట్లో కోవిడ్ రెండో దశ ఉధృతమవడంతో 2022లో ఈ సఫారీ నిర్వహణ వాయిదా పడింది. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడు ప్రారంభించాలని అటవీశాఖ నిర్ణయించింది.

అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో మరోసారి 'వైల్డ్ లైఫ్ టూరిజం'

- 20న లాంఛనంగా మంత్రితో ప్రారంభం
- ఆ తర్వాతే పర్యాటకులకు..!
- కొత్త హంగులు, ఆకర్షణలతో ట్రెక్కింగ్ ఇతర ఏర్పాట్లు.. చెంచులు, ఆదివాసీలే టూరిస్ట్ గైడ్‌లు
- 'సాక్షి'తో అమ్రాబాద్ డీఎఫ్‌ఓ రోహిత్

ఏమిటీ 'వైల్డ్ లైఫ్ టూరిజం'?

వైల్డ్‌లైఫ్ టూరిజంలో టైగర్ సఫారీ, ట్రెక్కింగ్, ఫారెస్ట్ స్టడీటూర్, ఆదివాసీ, గిరిపుత్రులను కలుసుకుని వారి జీవనశైలి, అనుభవాలు తెలుసుకోవడం వంటి వాటితో పాటు మరిన్ని ఆకర్షణలను జతచేస్తున్నారు. దాదాపు 24 గంటల పాటు అడవిలో ప్రకృతి రమణీయత, వన్యప్రాణుల మధ్య సేద దీరేలా ఏర్పాట్లు చేస్తున్నారు. రాత్రి పూట అడవిలోనే కాటేజీలు, మట్టి ఇళ్లలో బసతో కొత్త అనుభూతిని కలిగించే అవకాశం కల్పిస్తారు. మధ్యాహ్నం నుంచి మొదలయ్యే ఈ యాత్రలో ముందుగా అడవులు, జంతువుల పరిరక్షణ, పచ్చదనం కాపాడేందుకు అటవీశాఖ నిర్వహిస్తున్న కార్యక్రమాలను లఘుచిత్రాల ద్వారా తెలియజేస్తారు. అడవిలోనే ఏర్పాటు చేసిన ప్లాస్టిక్, ఇతర వ్యర్థాల రీసైక్లింగ్ సెంటర్‌ను, వన్యప్రాణులకు సంబంధించిన ల్యాబ్‌లకు తీసుకెళ్తారు. అనంతరం అడవిలో ట్రెక్కింగ్‌కు తీసుకెళతారు. సాయంత్రానికి క్యాంప్‌నకు తిరిగొచ్చాక రాత్రి కాటేజీల్లో బస ఉంటుంది. మరుసటిరోజు పొద్దునే సందర్శకులను టైగర్ సఫారీకి తీసుకెళ్లడంతో టూర్ ముగుస్తుంది. ఈ టూర్‌లకు స్థానికంగా ఉండే చెంచులు, ఆదివాసీలే టూరిస్ట్ గైడ్‌లుగా వ్యవహరించనున్నారు.

గతంలో 2 పాత వాహనాలను టైగర్ సఫారీకి ఉపయోగించారు. ఇప్పుడు 8 కొత్త వాహనాలను అందుబాటులోకి తెస్తున్నారు. గతంలో 12 మందికి వసతి అవకాశం కల్పించగా ఇప్పుడు 24 మందికి వసతి ఏర్పాట్లు ఇస్తున్నారు.

అతిథుల కోసం ఆధునిక వసతులు, సౌకర్యాలతో కొత్తగా 6 మట్టి కాటేజీలు నిర్మించారు.


అమ్రాబాద్ అటవీ ప్రాంతం

కొత్తగా ఏవి అందుబాటులోకి వచ్చాయంటే?

- 'ట్రీహౌజ్' –చెట్టుపై నిర్మించిన ఇళ్లు కొత్తగా అందుబాటులోకి.. 'ట్రీహౌజ్' నుంచి రాత్రిపూట సమీపంలో పర్‌క్యులేషన్ ట్యాంక్‌లో నీటిని తాగడానికి వచ్చే వన్యప్రాణుల వీక్షణ
- అందుకోసం నైట్‌విజన్ బైనాక్యులర్స్ ఏర్పాటు
- కొత్తగా ఎయిరోకాన్ హౌజ్ తదితరాల ఏర్పాటు
- గతంలో పైనుంచి ఒకరూట్‌లోనే సఫారీ నిర్వహించారు. ఇప్పుడు కిందనున్న చెరువు దాకా (ఉమామహేశ్వరం గుడి) వెళ్లాలని అనుకునే వారికి అదనపు చార్జీలతో మరో కొత్తరూట్ ఏర్పాటు
- ఈ ప్యాకేజీ టూర్‌లను అటవీశాఖ రూపొందించిన ఓ వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకునే వీలు కల్పిస్తారు.
- 2023 జనవరి 4వ వారం నుంచి జూన్ 30 వరకు (ప్రతీరోజు 24 మంది చొప్పున) ఈ ప్యాకేజీని ఉపయోగించుకునే వీలుంది.
- ఒక్కరికి, ఇద్దరికి లేదా ఒక గ్రూపునకు సంబంధించి టికెట్ ధరలు ఎంత ఉంటాయనే దానిపై ఇంకా అటవీశాఖ నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. గతంలో వైల్డ్‌లైఫ్ టూరిజం/ సఫారీ ప్యాకేజీలో భాగంగా ఇద్దరికి రూ.4,600, ఆరుగురికి రూ.9,600గా ధరలు నిర్ణయించారు.

ఈసారి ఇంకా కొంగొత్తగా..



గతేడాదితో పోల్చితే ఈ ఏడాది అటవీ, జంతుప్రేమికులకు మరింత ఆహ్లాదం పంచే విధంగా చర్యలు చేపట్టాం. ఏటీఆర్‌లో కెమెరా ట్రాప్‌లకు చిక్కిన పులుల ఫొటోలతో రూపొందించిన 'టైగర్ బుక్ ఆఫ్ ఏటీఆర్' పుస్తక ఆవిష్కరణ, 'ఫ్రెండ్స్ ఆఫ్ ఏటీఆర్' పేరిట పర్యావరణ పరిరక్షణకు కృషిచేస్తున్న చెంచు గైడ్స్‌కు బహుమతులు వంటి కార్యక్రమాలు చేపడుతున్నాం. గతేడాది టైగర్ సఫారీని మొదలుపెట్టినపుడు 8 సందర్భాల్లో సందర్శకులకు పులులు కనిపించాయి. ఇప్పుడు పులుల సంఖ్య గణనీయంగా పెరిగినందున సైటింగ్స్ మరింత పెరగవచ్చు. -ఐఎఫ్ఎస్ అధికారి రోహిత్ గొప్పిడి, అమ్రాబాద్ డీఎఫ్ఓ

● నేటి నుంచి బుకింగ్స్.. రేపటి నుంచి పరుగులు

పట్టాలపై విమానయానం





సికింద్రాబాద్ నుంచి వైజాగ్‌కు 8.30 గంటల్లోనే వందేభారత్

- ఇప్పటి వరకు మిగతా సూపర్‌ఫాస్ట్ రైళ్లు తీసుకుంటున్న నగటు సమయం 12 గంటలు
- వరంగల్, ఖమ్మం, విజయవాడ, రాజమండ్రి స్టేషన్లలోనే హాల్ట్
- సంక్రాంతి రోజు ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్న ప్రధాని

సాక్షి, హైదరాబాద్: క్షణాల్లో వేగం అందుకుంటుంది. గంటకు 90–100 కి.మీ. వేగంతో పట్టాలపై పరుగులు తీస్తుంది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఈ అత్యాధునిక వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రేపటి నుంచి తెలుగు రాష్ట్రాలకు అందుబాటులోకి రానుంది. దేశంలో ఇప్పటి వరకున్న అన్ని రైళ్ల కంటే అత్యధిక వేగంతో పరుగులు తీసే ఈ రైలు ఎలాంటి కుదుపులు లేని, సౌకర్యవంతమైన విమాన ప్రయాణ అనుభూతిని కలిగిస్తుంది. ఈ రైలు సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నానికి కేవలం ఎనిమిదిన్నర గంటల్లో చేరుకుంటుంది. సికింద్రాబాద్ నుంచి 697 కి.మీ. (రైలు మార్గం) దూరంలో ఉన్న విశాఖకు చేరుకునేందుకు ప్రస్తుతం మిగతా సూపర్‌ఫాస్ట్ రైళ్లలో సగటున 12 గంటలు పడుతోంది. కానీ వందేభారత్ వాటి కంటే మూడున్నర గంటల నుంచి నాలుగు గంటల ముందే చేరుకునేలా పరుగుపెట్టనుంది. సంక్రాంతి శుభవేళ ఆదివారం ఉదయం 10 గంటలకు సికింద్రాబాద్ స్టేషన్ నుంచి తొలి పరుగు ప్రారంభించనుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఈ రైలుకు పచ్చజెండా ఊపి ప్రారంభించనుండగా, సికింద్రాబాద్ స్టేషన్‌లో రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి జెండా ఊపనున్నారు.

నాలుగే స్టేషన్లు..

ఈ రైలు సికింద్రాబాద్‌లో బయలుదేరి విశాఖ చేరుకునేలోపు కేవలం నాలుగు స్టేషన్లలో మాత్రమే ఆగుతుంది. సోమవారం నుంచి రెగ్యులర్ ప్రయాణాన్ని ప్రారంభించనున్న వందేభారత్ రైలు, సికింద్రాబాద్ స్టేషన్‌లో మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరుతుంది. ఆ తర్వాత వరంగల్, ఖమ్మం, విజయవాడ, రాజమండ్రి స్టేషన్లలోనే ఆగనుంది. గమ్యస్థానమైన విశాఖకు రాత్రి 11.30కు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు విశాఖలో ఉదయం 5.45 గంటలకు బయలుదేరుతుంది. అవే నాలుగు స్టేషన్‌లలో నిర్దేశిత సమయాల్లో ఆగుతూ మధ్యాహ్నం 2.15 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.

గుర్తుకొచ్చేది వేగమే...

వందేభారత్ అనగానే ముందుగా గుర్తుకొచ్చేది దాని వేగమే. గంటకు 160 కి.మీ. వేగంతో ప్రయాణించే సామర్థ్యం దీని సొంతం. అయితే, దాని వేగం అధికంగానే ఉన్నా, అంత వేగాన్ని తట్టుకునే ట్రాక్ సామర్థ్యం మనకు లేదు. ఈ మార్గంలో రైళ్ల గరిష్టవేగ పరిమితి 130 కి.మీ. మాత్రమే ఉంది. కానీ గరిష్ట పరిమితితో కాకుండా వందేభారత్ రైలు సగటున 90–100 కి.మీ. వేగంతోనే పరుగుపెట్టనుంది. ప్రస్తుతం ఇతర సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ల సగటు గరిష్ట వేగం గంటకు 60 కి.మీ. మాత్రమే ఉంది.

రైలు నంబర్లు ఇవే:
విశాఖపట్నం– సికింద్రాబాద్: 20833
సికింద్రాబాద్– విశాఖపట్నం: 20834

సికింద్రాబాద్ టు విశాఖపట్నం

స్టేషన్	అరైవల్	డిపార్చర్
సికింద్రాబాద్	మధ్యాహ్నం	3.00
వరంగల్	సాయంత్రం 4.35	4.36
ఖమ్మం	5.45	5.46
విజయవాడ	7.00	7.05
రాజమండ్రి	రాత్రి 8.58	9.00
విశాఖపట్నం	రాత్రి 11.30	-

విశాఖపట్నం టు సికింద్రాబాద్

స్టేషన్	అరైవల్	డిపార్చర్
విశాఖట్నం	ఉదయం	5.45
రాజమండ్రి	7.55	7.57
విజయవాడ	10.00	10.05
ఖమ్మం	11.00	11.01
వరంగల్	మధ్యాహ్నం 12.05	12.06
సికింద్రాబాద్	2.15	

ఇవీ ఎకానమీ క్లాస్ ధరలు సికింద్రాబాద్ నుంచి...

వరంగల్	రూ.540
ఖమ్మం	రూ.755
విజయమాడ	రూ.905
రాజమండ్రి	రూ.1370
విశాఖపట్నం	రూ.1,665

తొలిరోజు 21 స్టేషన్లలో హాల్ట్

జనవరి 15న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరాక తొలిరోజున మాత్రమే 21 స్టేషన్లలో ఆగుతుంది. మార్గమధ్యంలో చర్లపల్లి, భువనగిరి, జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, కొండపల్లి, విజయవాడ జంక్షన్, నూజివీడు, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, ద్వారపూడి, సామర్లకోట, తుని, అనకాపల్లి, దువ్వాడ స్టేషన్లలో ఆగుతూ విశాఖ చేరుకుంటుంది. ఆ తర్వాత అంటే రెండోరోజు నుంచి వరంగల్, ఖమ్మం, విజయవాడ, రాజమండ్రి స్టేషన్లలో మాత్రమే ఈ రైలు ఆగుతుంది.

నేటి నుంచి బుకింగ్స్

ఈ రైల్లో 16 కోచ్‌లుంటాయి. ఇందులో రెండు కోచ్‌లు ఎగ్జిక్యూటివ్ కేటగిరీవి కాగా, మిగతావి ఎకానమీ కోచ్‌లు. ఎగ్జిక్యూటివ్ కోచ్‌లో 104 సీట్లుంటాయి. ఎకానమీ క్లాస్‌లో 1,024 ఉంటాయి. మొత్తం సీట్లు 1,128. టికెట్లు శనివారం నుంచి ఇటు ఆన్‌లైన్‌లో, అటు కౌంటర్లలో అందుబాటులో ఉంటాయి.

జత లేని రైలు కేటగిరీ ఇదే..

సాధారణంగా ఒక రైలు సర్వీసు నడవాలంటే రెండు రైళ్లుంటాయి. ఒక రోజుకు మించి ప్రయాణ సమయం పట్టే సర్వీసుల్లో మూడు రైళ్లుంటాయి. కానీ ఇలా జత రైళ్లు లేని సర్వీసు ఇదే కావటం విశేషం. ఉదయం 5.45కు విశాఖ నుంచి బయలుదేరే రైలు మధ్యాహ్నం 2.15 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుకుని, కేవలం 45 నిమిషాల వ్యవధిలో తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు విశాఖపట్నానికి బయలుదేరుతుంది. దీనికి ముందు, వెనక రెండు అంతర్గత (ఇన్‌బిల్ట్) ఇంజిన్లుంటాయి. ఒకవైపు ఒక ఇంజిన్‌తో, రెండోవైపు మరో ఇంజిన్‌తో నడుస్తాయి.

ఆదివారం సెలవు: ఈ రైలు వారంలో ఆరు రోజులే నడుస్తుంది. జత లేకుండా ఒకే రైలు రోజూ పరుగుపెడుతున్నందున, దాని నిర్వహణ పనుల కోసం ఒకరోజు కేటాయించారు. ఆదివారం రోజు రైలును నిర్వహణ పనుల కోసం షెడ్డుకు తరలిస్తారు.

దుబ్బాక లినెన్ చీరకు జాతీయస్థాయి గుర్తింపు



దుబ్బాకటౌన్: సిద్దిపేట జిల్లా దుబ్బాక నేతన్న ప్రతిభకు గుర్తింపు లభించింది. దుబ్బాక చేనేత కార్మికులు మగ్గంపై నేసిన లినెన్ కాటన్ చీర జాతీయ స్థాయిలో మెరిసింది. స్వాతంత్య్ర వజ్రోత్సవ వేళ దేశంలోని వారసత్వ సంపదలను కాపాడాలనే ఉద్దేశంతో కేంద్ర టెక్స్‌టైల్స్ శాఖ విరాసత్ పేరిట ఢిల్లీలో నేటి నుంచి ఈ నెల 17 వరకు చేనేత చీరల ప్రదర్శన చేపట్టింది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో చేనేత కార్మికులు నేసిన 75 రకాల చీరలను ఈ ప్రదర్శనకు ఎంపిక చేయగా, ఇందులో దుబ్బాక చీరకు స్థానం దక్కింది. చేనేత సహకార సంఘం మాజీ చైర్మన్, చేనేత రంగంలో అద్భుతాలు సృష్టించేందుకు కృషిచేస్తున్న బోడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో హ్యాండ్లూమ్ ప్రొడ్యూసర్ కంపెనీలో కార్మికులు ఈ లినెన్ కాటన్ చీరను నేయడం విశేషం. దేశంలోనే గుర్తింపు పొందిన దుబ్బాక చేనేత పరిశ్రమపై క్రమేణా నిర్లక్ష్యం అలుముకుంటోంది. ఈ క్రమంలో విరాసత్ చీరల ప్రదర్శనకు ఎంపిక కావడంతో మళ్లీ దేశవ్యాప్తంగా దుబ్బాకకు గుర్తింపు లభించింది. జాతీయస్థాయిలో దుబ్బాక చేనేతలకు గుర్తింపు దక్కడం పట్ల ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 'విరాసత్ ప్రదర్శనకు దుబ్బాక లినెన్ కాటన్ చీర ఎంపిక కావడం చాలసంతోషంగా ఉంది. టై అండ్ డై విధానంతో ఇక్కత్ చీరలను తయారు చేయడం ఎక్కడ సాధ్యపడలేదని, కేవలం దుబ్బాకలోనే తయారు కావడం ఆనందంగా ఉంది'అని బోడ శ్రీనివాస్ అన్నారు.

ఒక్క క్లిక్‌తో ఈజీగా బస్సు జాడ

- ప్రయాణికుల మొబైల్ ఫోన్లకు ట్రాకింగ్ లింక్
- మొదట 1,800 రిజర్వేషన్ బస్సులకు అనుసంధానం



సాక్షి, హైదరాబాద్: సంక్రాంతి సందర్భంగా సొంతూళ్లకు బయలుదేరే ప్రయాణికులకు టీఎస్ ఆర్టీసీ మరో సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. తాము బయలుదేరి వెళ్లాల్సిన బస్సు ఎక్కడుందో మొబైల్ ఫోన్‌లో తెలుసుకొనే అవకాశాన్ని కల్పించింది. ఈ మేరకు 'టీఎస్ ఆర్టీసీ బస్ ట్రాకింగ్'యాప్‌ను వినియోగంలోకి తెచ్చింది. ప్రయాణికులు గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని బస్సు జాడ తెలుసుకోవచ్చు. ప్రస్తుతం బుకింగ్ చేసుకుంటున్న ప్రయాణికుల ఫోన్లకు టికెట్ వివరాలతోపాటు బస్ ట్రాకింగ్ లింక్‌ను కూడా అధికారులు ఎస్సెమ్మెస్ రూపంలో పంపిస్తున్నారు. ఆ లింక్‌పై క్లిక్ చేయగానే బస్సు ఎక్కడుందో ప్రయాణికులు సులువుగా తెలుసుకునే అవకాశం ఉంటుంది. ట్రాకింగ్ యాప్ వివరాల ఆధారంగా బస్సు వచ్చే సమయాన్ని కచ్చితంగా తెలుసుకోవచ్చు. ''ప్రస్తుతం ముందస్తు రిజర్వేషన్ చేసుకునే 1,800 బస్సు సర్వీస్‌లకు ఈ ట్రాకింగ్ సదుపాయం కల్పించాం. సంక్రాంతి సందర్భంగా రిజర్వేషన్ సౌకర్యం ఉన్న 600 ప్రత్యేక బస్సులకు కూడా ట్రాకింగ్ సౌకర్యాన్ని అనుసంధానం చేశాం. త్వరలో హైదరాబాద్‌లోని మెట్రో ఎక్స్‌ప్రెస్‌లుసహా మిగిలిన సర్వీస్‌లకు ట్రాకింగ్ సదుపాయం కల్పిస్తాం. ఒక్క క్లిక్‌తో బస్సు ఎక్కడుందో తెలుసుకోవచ్చు''అని టీఎస్‌ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు.

యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి ఇలా..

- గూగుల్ ప్లేస్టోర్ నుంచి, టీఎస్‌ఆర్టీసీ వెబ్‌సైట్ నుంచి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
- ఈ యాప్‌లో ప్రయాణికులు వ్యక్తిగత వివరాలు ఇవ్వాల్సిన అవసరం లేదు.
- హైదరాబాద్ నగరంతోపాటు జిల్లా సర్వీస్‌లకు సంబంధించిన సమాచారాన్ని వేర్వేరుగా పొందుపర్చారు.
- ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి ప్రయాణించే బస్సుల వివరాలతోపాటు అవి ప్రస్తుతమున్న లొకేషన్‌ను తెలుసుకోవచ్చు.
- ప్రయాణికులు సమీపంలోని బస్టాప్, సర్వీస్, బస్సు నంబర్‌లను ఎంటర్ చేసి వివరాలను పొందవచ్చు.
- అత్యవసర పరిస్థితులు తలెత్తితే రిపోర్ట్ చేసే సదుపాయాన్ని ఈ యాప్‌లో కల్పించారు.
- బస్సు బ్రేక్‌డౌన్, వైద్య సహాయం, రోడ్డు ప్రమాదం తదితర వివరాలను ఈ యాప్ ద్వారా ప్రయాణికులు రిపోర్టు చేయొచ్చు. ఆ వివరాల ఆధారంగా అధికారులు తదుపరి చర్యలు తీసుకుంటారు.

రాష్ట్రంలో మూడు కరోనా కేసులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో శుక్రవారం 4,230 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా, వారిలో ముగ్గురికి కోవిడ్ పాజిటివ్ నిర్ధారణ అయింది. తాజా కేసులతో రాష్ట్రంలో ఇప్పటివరకు నమోదైన మొత్తం కేసుల సంఖ్య 8.41 లక్షలకు చేరింది. ఒక్కరోజులో కరోనా నుంచి తొమ్మిది మంది కోలుకోగా, ఇప్పటి వరకు కోలుకున్నవారి సంఖ్య 8.37 లక్షలకు చేరింది. ప్రస్తుతం 47 మంది చికిత్స పొందుతున్నట్లు ప్రజారోగ్య సంచాలకుడు శ్రీనివాసరావు వెల్లడించారు.

● పట్నం.. పల్లెబాట..



సంక్రాంతి పండుగ నేపథ్యంలో పట్టణ జనమంతా పల్లెలకు పయనమయ్యారు. హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై భారీగా వాహనాలు వెళ్తుండడంతో విపరీతమైన రద్దీ నెలకొంది. గురువారం ప్రారంభమైన రద్దీ.. శుక్రవారం మరింత పెరిగింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద సాధారణ రోజుల్లో టోల్‌ప్లాజా మీదుగా ప్రతినిత్యం 30 వేల నుంచి 40వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా.. ఇప్పుడు సంక్రాంతి రోజుల్లో అదనంగా మరో 20 నుంచి 30వేల వాహనాలు రాకపోకలు సాగించినట్టు అంచనా. నిమిషం కూడా ఆగకుండా వెళ్తున్న వాహనాలతో హైవే ఎక్కడా ఖాళీ లేకుండా గొలుసు మాదిరిగా మారింది.– చౌటుప్పల్

ఫ్లెక్సీపెట్టి.. అన్నదానం చేసి

ఎవరైనా కన్నుమూస్తే సంతాప సూచకంగా వారి ఫొటోతో ఫ్లెక్సీ చేయించి కూడళ్లలో ఏర్పాటు చేయడం తెలిసిందే. అయితే ఖమ్మంలో మృతిచెందిన ఓ కోతికి సైతం ఫ్లెక్సీ చేయించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో తిరుగుతూ, నిత్యం హమాలీల మధ్య ఉంటూ.. వారు పెట్టే భోజనం తింటూ గడిపే ఓ కోతి ఇటీవల మృతి చెందింది. దీంతో హమాలీలు ఆ వానరానికి అంత్యక్రియలు నిర్వహించడమే కాకుండా శుక్రవారం అన్నదానం సైతం నిర్వహించారు. ఇంతటితో సరిపెట్టకుండా ఆ కోతి ఫొటోతో ఫ్లెక్సీ చేయించి మార్కెట్ ప్రధాన గేటుకు పెట్టగా పలువురు ఆసక్తిగా పరిశీలించారు.

– ఖమ్మం వ్యవసాయం



గాలిపటం తీస్తుండగా బాలుడికి కరెంట్ షాక్

జహీరాబాద్ టౌన్: సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలంలోని రాయిపల్లి తండాలో పిల్లలు గాలిపటాలు ఎగురవేస్తుండగా ఓ బాలుడికి కరెంట్ షాక్ తగలింది. తండాకు చెందిన రవీందర్ కుమారుడు 12 ఏళ్ల రాహుల్ శుక్రవారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఇంటిపైన గాలిపటం ఎగరవేస్తున్నాడు. ఈ క్రమంలో గాలిపటం కరెంట్ తీగలపై పడింది. దీంతో రాహుల్ అక్కడే ఉన్న ఇనుప చువ్వతో గాలిపటం తీసే ప్రయత్నంలో కరెంట్‌షాక్ తగిలి కిందపడ్డాడు. బాలుడికి తీవ్రగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు వెంటనే జహీరాబాద్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. పరిస్థితి విషమంగా ఉండటంతో సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

తల్లిని కొట్టి చంపి.. కాసేపటికే రక్తపు మడుగులో పడి..

- అనుమానాస్పద స్థితిలో కొడుకు మృతి
- కామారెడ్డి జిల్లా భవానీపేటలో దారుణం


నర్సమ్మ


నర్సారెడ్డి

మాచారెడ్డి: ఇంట్లో గొడవ.. ఓ కొడుకు తల్లిని కర్రతో బాదడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి.. గ్రామస్తులు ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్తుండగానే మృతి చెందింది.. మృతదేహాన్ని తీసుకుని ఇంటికి తిరిగొచ్చేసరికి.. ఆ కొడుకు కూడా ఇంట్లో రక్తపు మడుగు మధ్య చనిపోయి ఉన్నాడు. శుక్రవారం కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం భవానీపేట గ్రామంలో కేవలం గంటన్నర వ్యవధిలో జరిగిన ఈ ఘటనలు కలకలం రేపుతున్నాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..

కుటుంబ కలహాలతో..: చిటుకుల నర్సమ్మ (67), ఆమె కుమారుడు నర్సారెడ్డి (45), ఆయన భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తెతో కలిసి భవానీపేటలో ఉంటున్నారు. కుటుంబ కలహాల కారణంగా నర్సారెడ్డి భార్య పిల్లలను తీసుకుని ఇంట్లోంచి వెళ్లిపోయింది. అదే గ్రామంలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటోంది. తల్లీకొడుకులు నర్సమ్మ, నర్సారెడ్డి సొంత ఇంట్లో ఉంటున్నారు. ఇటీవల అయ్యప్పమాల వేసుకున్న నర్సారెడ్డి.. రెండు రోజుల క్రితమే శబరిమల యాత్రకు వెళ్లివచ్చాడు. శుక్రవారం సాయంత్రం తన భార్యను ఇంటికి రప్పించాలంటూ తల్లితో నర్సారెడ్డి గొడవకు దిగాడు. ఈ సమయంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. నర్సారెడ్డి ఆవేశంతో కర్రతో నర్సమ్మ తలపై బాదాడు. తీవ్ర గాయాలపాలైన ఆమెను గ్రామస్తులు కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలిస్తుండగా చనిపోయింది. దీంతో వారు నర్సమ్మ మృతదేహాన్ని భవానీపేటలోని ఇంటికి తీసుకువచ్చారు. కానీ అప్పటికే ఇంట్లో రక్తం మడుగులో నర్సారెడ్డి మృతిచెంది కనిపించాడు. ఇది చూసి గ్రామస్తులు ఆందోళనకు గురై పోలీసులకు సమాచారమిచ్చారు. కామారెడ్డి రూరల్ సీఐ శ్రీనివాస్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరిస్తున్నారు. అయితే నర్సారెడ్డి తలకు పెద్ద గాయమైనట్టు కనిపిస్తుండటం, రక్తపు మడుగు మధ్య పడి ఉండటంతో ఆయనను ఎవరో హత్య చేసి ఉంటారని భావిస్తున్నారు.

చనాకా–కొరాట ప్రాజెక్టుకు ఓకే

- పర్యావరణ అనుమతులు జారీ చేసిన కేంద్రం
- రూ.390 కోట్లతో పెన్‌గంగపై మహారాష్ట్ర, తెలంగాణల ఉమ్మడి ప్రాజెక్టు

సాక్షి, హైదరాబాద్: చనాకా–కొరాట అంతర్రాష్ట్ర ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు లభించాయి. కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ నేతృత్వంలోని నిపుణుల మదింపు కమిటీ(ఈఏసీ) గత ఏడాది మే 31న సమావేశమై.. ఈ ప్రాజెక్టుకు అనుమతులు జారీ చేయాలని సిఫార్సు చేసింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం 2016 ఆగస్టు 23న తెలంగాణ, మహారాష్ట్ర మధ్య ఒప్పందం జరిగింది. ఆదిలాబాద్ జిల్లాలో పెన్‌గంగ నదిపై ఇరు రాష్ట్రాలు సంయుక్తంగా ప్రాజెక్టును చేపట్టాయి. మొత్తం రూ.399.16 కోట్ల అంచనా వ్యయంతో చనాకా–కొరాట బ్యారేజీతోపాటు రిజర్వాయర్, పంపుహౌజ్, ప్రెజర్ మెయిన్స్, అప్రోచ్ బండ్, కెనాల్ నెట్‌వర్క్‌ను నిర్మించనున్నారు. దీని ద్వారా తెలంగాణలో ఆదిలాబాద్ జిల్లా తాంసి, జైనథ్ మండలాల్లో 13,657.5 ఎకరాలు, మహారాష్ట్రలోని యావత్మాల్ జిల్లా కెలాపూర్ మండలంలోని 9 గ్రామాల్లో 3,035 ఎకరాల ఆయకట్టుకు నీరు అందించాల్సి ఉంది. ఈ ప్రాజెక్టు ద్వారానే లోయర్ పెన్‌గంగ మెయిన్ కాల్వ కింద మరో 37,500 ఎకరాల ఆయకట్టును ప్రతిపాదించారు. ఇది కలిపి మొత్తంగా తెలంగాణ పరిధిలో 51,000 ఎకరాలకుపైగా ఆయకట్టు ఉంది.

తెలంగాణలో పనులకే ఆమోదం: 0.83 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో నిర్మిస్తున్న చనాకా–కొరాట బ్యారేజీకి 23 గేట్లు ఉంటాయి. ప్రస్తుతం తెలంగాణ పరిధిలో నిర్మాణ పనులకు మాత్రమే పర్యావరణ అనుమతులు లభించాయి. మహారాష్ట్రలో కెనాల్ పనులకు అటవీ అనుమతులు లభించాకే పర్యావరణ అనుమతుల జారీని పరిశీలిస్తామని కేంద్ర పర్యావరణ శాఖ తెలిపింది. ఆ అనుమతులు వచ్చాకే మహారాష్ట్ర పరిధిలో పనులు చేపట్టాలని స్పష్టం చేసింది. ప్రాజెక్టు ద్వారా వచ్చే ఉద్యోగావకాశాల్లో స్థానిక గ్రామస్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించింది. అనుమతులు లేకుండా ప్రాజెక్టుకు మార్పులు, విస్తరణ చేయరాదని పేర్కొంది.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.